మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 125 | శుక్రవారం 08 - 05 -2026 | పేజీలు : 12 | వెల-3



మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు..





# రెవిన్యూ లో కలెక్షన్ రాజాలు..

నంద్యాల బ్యూరో, మేమ (నంది పత్రిక):-

నంద్యాల డివిజన్ పరిధిలో ఆయన ఒక మండల సర్వేయర్. ఆయన నెల జీతం రూ.30వేలు నుంచి రూ. 40 వేల పైగా ఉంటుంది. అయితే ఆయన ఇటీవల ఎన్జీవోస్ కాలనీలో రూ.కోటి 50 లక్షల పైగా వెచ్చించి భవనం కొనుగోలు చేశారనే ఆరోపణలు వున్నాయి.



తారస్థాయికి దిగువ స్థాయి సిబ్బంది అవినీతి..

చేయి తడిపితేనే పెన్ను కదులుతుంది..

అక్రమార్జనతో రూ. కోట్ల కు పడగెత్తిన అవినీతి అధికారులు..

ఒక వైపు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్న.. బెదరని వైనం..

దొరికితే దొంగ.. దొరకకపోతే దొరలాగా ఉంటున్న అధికారులు..

2లో

## తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

గవర్నర్‌తో మరోమారు విజయ్ భేటీ

మెజార్టీకి అవసరమైన మద్దతు

లేఖలు కోరిన గవర్నర్

టీవికె పార్టీకి అధికారం

దక్కడంపై తొలగని అనిశ్చితి

2లో





# ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

సమిష్టి పితో..ప్రజలకు జవాబుదారీతనం

పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు

సింగపూర్ పాలనా విధానంపై అధ్యయనం

మోడల్‌గా ఓ జిల్లాలో అమలు చేసి చూద్దాం

కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ప్రజా సమస్యలను వంద శాతం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంతృప్తి చెందాలన్నారు. సచివాలయంలో ఏడో విడత కలెక్టర్ల సదస్సులో అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అందరం సమష్టిగా పని చేయాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని చెప్పారు. సరిగా పరిపాలించకపోతే ప్రజలు ఆమోదించే అవకాశం లేదని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఇదే విషయం స్పష్టమైందన్నారు. 'ప్రజా సంతృప్తే నాకు కొలమానం. ప్రస్తుతం రూ.9.74 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయి. గత ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత

## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..

కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం!



పశ్చిమ బెంగాల్ శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి

ముగిసిన ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ పదవీకాలం

ఎన్నికల తర్వాత రాజీనామాకు నిరాకరించడంతో ఏర్పడిన సంక్షోభం

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ గెలిచిందని మమత ఆరోపణ

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నేడు (మే 7) అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి అధికారికంగా ముగిసింది. "భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174, క్లాజ్ 2 ప్రకారం నాకు దఖలుపడిన అధికారాలను ఉపయోగించి, పశ్చిమ బెంగాల్ శాసనసభను 2026 మే 7 నుంచి రద్దు చేస్తున్నాను" అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే.

## కొల్లు రవీంద్ర చెత్త రాజకీయాలు చేస్తున్నారు:

హౌసింగ్ కాలనీలకు సంబంధించిన స్టీల్ తరలింపు వ్యవహారంపై మాటల యుద్ధం

తప్పు చేసిన వారిని జైలుకు పంపుతామన్న పేర్ని నాని

వ్యక్తిగత విమర్శలు సరికాదని కొల్లు రవీంద్రకు హితవు



మచిలీపట్నం రాజకీయాల్లో మాజీ మంత్రి పేర్ని నాని, ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్ర మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. జగనన్న హౌసింగ్ కాలనీలకు సంబంధించిన స్టీల్ తరలింపు వ్యవహారం ఇప్పుడు అధికారుల మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది. పేర్ని నాని గతంలోనే హౌసింగ్ శాఖ అధికారులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వం హౌసింగ్ కాలనీల కోసం కేటాయించిన స్టీల్‌ను అధికారులు వెనక్కి తీసుకెళ్లడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మళ్లీ అధికారంలోకి వచ్చాక, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులను జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు

పాఠశాల, ఇంటర్, ఉన్నత విద్యను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నం

హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వివరాలు డ్యాష్‌బోర్డులో అందుబాటు

త్వరలో ప్రజలకు సైతం ఈ డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తెస్తామని స్పష్టీకరణ

ఉత్తమ విధానాలకు కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామన్న సీఎం చంద్రబాబు

2లో



రాష్ట్ర విద్యాశాఖ మొత్తాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ, ఒకే డ్యాష్‌బోర్డును రూపొందించబోతున్నట్టు ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక ప్రకటన చేశారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల పనితీరును దీని ద్వారా పర్యవేక్షించ నున్నట్టు తెలిపారు. అమరావతి సచివాల యంలో జరుగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "విద్యాశాఖకు సంబంధించి

## జీడీడీపీ లక్ష్యం రూ.62,751 కోట్లు

తలసరి ఆదాయం రూ.2,29,866

రాష్ట్రంలో 24వ స్థానంలో కర్నూలు జిల్లా


స్థూల ఉత్పత్తిలో 15వ స్థానం

2026-27లో 14.46 - 14.91 శాతం పెరుగుదల చూపాలని టార్గెట్

కలెక్టర్ల సమావేశంలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు

హాజరైన మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డా. సిరి

2లో



## ఏమిటీ హంటావైరస్... ప్రమాదకరమైనదా?



విహార నౌకలో వెలుగు చూసిన హంటావైరస్ వ్యాప్తి

ఇప్పటికే ముగ్గురు ప్రయాణికులు మృతి

పలు దేశాలకు పాకిన వైరస్..

అధికారుల అప్రమత్తత

మనిషి నుంచి మనిషికి వ్యాపించే అరుదైన వైరస్‌గా గుర్తింపు

ప్రపంచ మహమ్మారిగా మారే ప్రమాదం తక్కువేనన్న డబ్ల్యూహెచ్ఓ

2లో

# రెవిన్యూ లో కలెక్షన్ రాజాలు..

కలెక్షన్ల అక్రమ వసూళ్లతో ఆయన రూటే సపరేట్ అని, ఆయన 'సహో'చర సిబ్బంది చెపుతుండటంతో పాటు, ఆయన అవినీతి ఆ "దేవుడు" కే తెలుసని రెవెన్యూ శాఖ సిబ్బంది చెబుతుంటారు.

డోన్ నియోజకవర్గ పరిధిలో ఆయన ఒక మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఎంఆర్ఐ), కలెక్షన్ లో ఈయన వ్యవహారం చాటుమాటుగా కాకుండా నేరుగానే ఉంటుందనే ఆరోపణలు ఉన్నాయి. పనిమీద వెళ్లిన వారిని ఎంత ఇస్తావని మొహమాటం లేకుండా అడుగుతాడని చెబుతుంటారు. 'డీల్' కుదిరితేనే పనిచేస్తాడని లేదంటే తిప్పుకోవడం ఆయన ప్రత్యేకత అని రెవెన్యూ వర్గాలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుంటాయి..

నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలోని ఆయన ఒక గ్రామ రెవెన్యూ అధికారి (విఆర్వో). ఆయన చేతిలో డబ్బు పడితేనే పెన్ను కత్తి మీద 'సాము' లాగా ముందుకు కదులుతుందనే విమర్శలు ఉన్నాయి. ఆయన అక్రమార్జనే దాదాపు రూ.1.50 కోట్ల నుండి రూ.2 కోట్ల వరకు ఉంటుందనే ఆరోపణలు. రెవెన్యూ సిబ్బంది నుంచే వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలోనే కర్నూలు పట్టణంలో ఒక నూతన భవనం కొనుగోలు చేసినట్లు రెవెన్యూ సిబ్బంది కొందరు చెబుతున్నారు. అలా సంపాదించిన సొమ్ముతో భూములు, స్థలాలు కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

జిల్లా యంత్రాంగంలో కీలక మైన రెవెన్యూ శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రధానంగా దిగువస్థాయిలో కొందరు సిబ్బంది అక్రమ వసుళ్ళ దందా తారస్థాయిలో ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. డబ్బులు వీరి చేతిలో పడితేనే కానీ పెన్ను ముందుకు కదులుతుందని ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్జనులతో కొందరు ఆర్ ఐలు, వీఆర్వోలు కోట్లకు పడగలెత్తారని ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ శాఖలో ఇలాంటి అక్రమ దారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) నిఘా ఉంచినట్లు తెలిసింది. ఆదాయానికి మించిన ఆస్తులు, బినామీలకు సంబంధించిన కొందరు అవినీతి ఉద్యోగుల జాబితాలో సిద్ధం చేసినట్లు సమాచారం.

**ప్రతి పనికి పైసా వసూల్** ప్రజలు వివిధ పనులపై తహసిల్దార్ కార్యాలయంలకు వస్తుంటారు. అక్కడ కొందరు అవినీతి సిబ్బంది ప్రతి పనికి డబ్బులు వసూలు చేయడం సర్వసాధారణమని ఆరోపణలు ఉన్నాయి. ఆన్లైన్లో పేరు నమోదుకు ఒక రేటు పాస్ పుస్తకాల మంజూరుకు మరొకరి ఎటు మ్యూటేషన్ కు ఇంకొక రేటు భూమిని ఆన్లైన్లో ఎక్కించేందుకు ఇంకో రేటు ఇలా ప్రతిదానికి డబ్బులు ఇచ్చుకుంటేనే పనులవుతాయని విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులు అవసరాన్ని బట్టి వసూళ్లు మొత్తం పెరుగుతుందని తెలుస్తుంది. అడంగల్ 1బి సవరణలు, పట్టాదారు పాస్ పుస్తకాలు , మ్యుటేషన్, సర్వేనెంబర్ కరెక్షన్ సబ్ డివిజన్ ఇలా ప్రతిపనికి డబ్బులు గుంజు తారని బహిరంగనే విమర్శలు వస్తున్నాయి.

**కల్పతరువుగా 22ఏ, 08 ఫైళ్లు** తహసీల్దారు కార్యాలయాల్లోని కొండకు ఆవినీతి సిబ్బందికి 22ఏ (నిషేతిక భూములు) 08 (చుక్కలు భుములు) ఫైళ్ళు కల్పతరువుగా మారి కాసులు కురిపిస్తున్నాయి. ఫైలు సిద్ధం చేయడము ప్రారంభించడంతో డబ్బు వసలు ప్రక్రియ సమాంతరంగా మొదలవుతుందనే ఆరోపణులు ఉన్నాయి. అవినీతి సిబ్బంది పై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కరెక్షన్ ఇతర అధికారులకు ప్రతి వారం ఒకటో రెండో పిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

**అవినీతి ప్రక్షలనకు చర్యలు --డీఆర్ఓ రాము నాయక్**

అవినీతి సహించె ప్రసక్తి లేదు. రెవెన్యూ శాఖలో అవినీతి ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటాం. అవినీతి ఆరోపణలు ఉన్న వారిపై కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ చేపడతాం. ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగి పై ఉంది. అందుకు భిన్నంగా వ్యవహరిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

# జీడీడీపీ లక్ష్యం రూ.62,751 కోట్లు

జిల్లా ఆర్థికాభివృద్ధికి సూచికగా నిలిచే జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ), జిల్లా తలసరి ఆదాయం (పీసీ) వృద్ధి రేటులో 2025–26లో జిల్లా బాగా వెనుకబడింది. తలసరి ఆదాయంలో ప్రమాదకర స్థాయిలో 24వ ర్యాంక్‌తో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 2026–27 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు సాధించాలని, జిల్లా స్థూల ఉత్పత్తి రూ.62,751కోట్లు సాధించాలని కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు సూచించారు. వ్యవసాయం సహా అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన పెరుగుదల సాధించాలని దిశానిర్దేశం చేశారు. వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్, మైనింగ్.. వంటి కీలకమైన శాఖల ద్వారా వచ్చే ఆదాయం పెంచాలి. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలి. తద్వారా ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత పెంచడంలో జిల్లా అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలని మంత్రులు, కలెక్టర్లను ఆదేశించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం కలెక్టర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జిల్లా మంత్రి టీజీ భరత్‌గుప్తా, కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి హాజరయ్యారు. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

**మూడు రంగాలను బలోపేతం చేయాలి** వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలను బలోపేతం చేయాలని సీఎం సూచించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.54,607 కోట్లు రాబట్టి 15వ స్థానంతోనే సరిపుచ్చుకున్నారు. గతేడాది అధిక వర్షాలు కారణంగా పంటలు పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ధరలు కూడా పతనం కావడంతో వ్యవసాయం రంగం రాబడి పూర్తిగా తగ్గిపోయింది. తాజా ఆర్థిక సంవత్సరంలో జీడీడీపీ 14.91 శాతం వృద్ధి రేటు సాధించి రూ.62,751 కోట్లు రాబట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది మే, జూన్, జూలై మాసాల్లో పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడే అవకావం ఉందని, తద్వారా వర్షాలు తక్కువగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తలసరి ఆదాయంలో జిల్లాకు రెడ్ మార్క్ తప్పలేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కేవలం 2.98 శాతం మాత్రమే పెరుగుదల సాధించి రూ.2,00,522లతో రాష్ట్రంలో 24వ స్థానంలో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వం రెడ్ మార్క్ ఇచ్చింది. తాజా ఆర్థిక సంవత్సరం 2026–27లో 14.46 శాతం వృద్ధి రేటు సాధించి జిల్లా తలసరి ఆదాయం రూ.2,29,866లు సాధించాలని లక్ష్యం విధించారు. లక్ష్యం సాకారం కావాలంటే వ్యవసాయ, పారిశ్రామిక, సేవారంగాల్లో రాబడి మెరుగైన పురోగతి సాధించాలి. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో కత్తి వేలాడుతుండడంతో పారిశ్రామిక. సేవా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పారిశ్రామిక ప్రగతిపై దృష్టి సారించాలి** జిల్లాలో పారిశ్రామిక పురోగతికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎంవోయూ, ఎస్ఐపీబీ అనుమతి పొందిన పరిశ్రమలు క్షేత్రస్థాపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను సీఎం ఆదేశించారు. గతేడాది రూ.2,889 కోట్ల పెట్టుబడులతో ఆరు పరిశ్రమలు స్థాపించారు. వాటి ద్వారా 3,525 మందికి ఉపాధి, ఉద్యోగాలు రానున్నాయి. రూ.1,470 కోట్ల పెట్టుబడితో మరో ఐదు పరిశ్రమలు ఏర్పాటుకు దాదాపు సిద్ధం అవుతున్నాయి. వీటి ద్వారా 3,460 మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. జిల్లా యంత్రాంగం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎస్ఐపీబీ అనుమతి పొందిన రూ.5,095 కోట్లతో రెండు పవర్ ఉత్పత్తి (ఎనర్జీ) ప్రాజెక్టులు ఇప్పటికే స్థాపించారు. రూ.3,726 కోట్లతో స్థాపించే మరో రెండు ప్రాజెక్టులు ఏర్పాటు దశలో ఉంటే, రూ.12,492 కోట్లతో చేపట్టే మరో ఐదు ప్రాజెక్టులు భూసేకరణ దశలో ఉన్నాయి. ఆయా ప్రాజెక్టులు ద్వారా రూ.21,225 కోట్లు పెట్టుబడులు, 9,255 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. అన్ని ప్రాజెక్టులు స్థాపించేలా చర్యలు తీసుకోవాలిన కలెక్టర్‌ను ఆదేశించారు.

**సాధించాల్సిన పురోగతి:** జిల్లాలో 105 కిలోమీటర్లు జాతీయ రహదారుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ పనుల పురోగతి సాధించాంటే ఇంకా 12.47 హెక్టార్లు భూసేకరణ వేగవంతం చేయాలి. తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్‌కు సీఎం ఆదేశించారు.వ్యవసాయ రంగాన్ని సౌరశక్తితో అనుసంధానించి, రైతులకు ఆర్థిక, ఇంధన భద్రత కల్పించాలనే లక్ష్యంగా పీఎం–కుసుం పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద ఈ నెల 5వ తేది నాటికి 47 మెగావాట్ల సామర్థ్యంలో 9 యూనిట్లు ఏర్పాటు చేశారు. సివిల్ వర్క్స్ ఏడు యూనిట్లకు 78 శాతం పూర్తి చేశారు.పీఎం–సూర్యఘర్ పథకం కింద 30,707 దరఖాస్తులు రాగా, 5,826 దరఖాస్తులు ఎంపిక చేశారు. 286 యూనిట్లు పూర్తిగా ఏర్పాటుచేశారు.జిల్లాలో 1,423 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. బడి పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గతేడాది 2,55,092 మంది విద్యార్థులను బడిలో చేర్పించారు. 2026 – 27 విద్యా సంవత్సరంలో 2,81,260 మంది విద్యార్థులను చేర్పించాలని లక్ష్యం నిర్దేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా విద్యార్థులు మార్చిలో 69.10 శాతం, ఏప్రిల్‌లో 69.50 శాతం విద్యార్థులు భోజనాలు చేశారు. దీనిని 75–85 శాతానికి పెంచాలని సూచించారు. ప్రధానమంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటెర్‌ప్రైజెస్ స్కీం (పీఎంఎఫ్ఎంఈ) కింద గత మార్చి లెక్కలు ప్రకారం 2020–21 నుంచి 2025–26 వరకు ఐదేళ్లలో జిల్లాలో 467 ధరఖాస్తులు వచ్చాయి. 392 మంది యూనిట్లు స్థాపించారు. 2026–27లో వంద యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం నిర్దేశించారు.

# ఏమిటీ హంటావైరస్... ప్రమాదకరమైనదా?

ఎంవీ హోండియస్ అనే విలాసవంతమైన విహార నౌకలో హంటావైరస్ వ్యాప్తి చెందినట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ధృవీకరించింది. ఈ షిప్‌తో సంబంధం ఉన్న ఐదుగురికి వైరస్ సోకినట్టు తేలింది. అర్జెంటీనా నుంచి బయలుదేరిన ఈ నౌకలో ఇప్పటికే ముగ్గురు మరణించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మృతుల్లో డచ్ దంపతులు, ఒక జర్మన్ జాతీయుడు ఉన్నారు.ప్రస్తుతం ఈ షిప్‌లో 23 దేశాలకు చెందిన 146 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా కఠినమైన ఆరోగ్య జాగ్రత్తల మధ్య ఉన్నారు. ఈ నౌక స్పెయిన్‌లోని టెనెరైఫ్ దీవులకు ఈ వారాంతంలో చేరుకోనుంది. అక్కడి నుంచి ప్రయాణికులను వారి వారి దేశాలకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. షిప్ నుంచి దిగి వెళ్లిన ప్రయాణికుల ద్వారా ఈ వైరస్ నెదర్లాండ్స్, సౌత్ ఆఫ్రికా, స్విట్జర్లాండ్, యూకే, యూఎస్ఏ, సింగపూర్ వంటి దేశాలకు చేరింది. ఆయా దేశాల్లోని వారిని గుర్తించి ఐసోలేషన్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు. అయితే, ఇది కోవిడ్ తరహాలో పెద్ద మహమ్మారిగా మారే ప్రమాదం తక్కువని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది. ఈ వైరస్ ఇంక్యుబేషన్ పీరియడ్ 1 నుంచి 6 వారాలు ఉండటంతో మరికొన్ని కేసులు బయటపడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. షిప్ ఎక్కకముందే అర్జెంటీనా, చిలీ వంటి ప్రాంతాల్లో పర్యటించినప్పుడు ప్రయాణికులకు ఈ వైరస్ సోకి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. షిప్ ఆపరేటర్లు ప్రయాణికుల వివరాలు సేకరించి కాంటాక్ట్ ట్రేసింగ్‌కు సహకరిస్తున్నారు.

## బెంగళూరులో ఆకాశాన్నంటుతున్న లగ్జరీ ఇళ్ల ధరలు... రూ.10 కోట్లకు దక్కేదింతే!

సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన బెంగళూరులో విలాసవంతమైన ఇల్లు కొనాలనుకునేవారికి షాకింగ్ న్యూస్. నగరంలో లగ్జరీ రెసిడెన్షియల్ మార్కెట్ ధరలు ఆకాశాన్నంటడంతో, ఇప్పుడు రూ.10 కోట్లు వెచ్చించినా గతేడాది కంటే తక్కువ విస్తీర్ణంలోనే సర్దుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన 'వెల్త్ రిపోర్ట్ 2026' ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించింది.నివేదిక ప్రకారం, 2025లో బెంగళూరులో విలాసవంతమైన ఇళ్ల ధరలు ఏకంగా 9.4 శాతం పెరిగాయి. దీని ఫలితంగా, ప్రస్తుతం రూ.10 కోట్ల బడ్జెట్‌తో కేవలం 3,843 చదరపు అడుగుల లగ్జరీ నివాసాన్ని మాత్రమే కొనుగోలు చేయగలరు. 2024లో ఇదే మొత్తానికి 3,983 చదరపు అడుగుల స్థలం లభించగా, ఏడాది వ్యవధిలో కొనుగోలు చేయగల స్థలం 3.5 శాతం మేర తగ్గింది. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈ తగ్గుదల బెంగళూరులోనే అత్యధికంగా నమోదు కావడం గమనార్హం. ఈ గణనీయమైన వృద్ధితో, ప్రపంచ లగ్జరీ మార్కెట్ల సూచీ అయిన 'ప్రైమ్ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ ఇండెక్స్'లో బెంగళూరు 32 స్థానాలు ఎగబాకి 8వ ర్యాంక్‌కు చేరింది. ఇక దేశంలోని ఇతర నగరాలను పరిశీలిస్తే, ముంబై అత్యంత ఖరీదైన మార్కెట్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకుంది. అక్కడ రూ.10 కోట్లకు కేవలం 1,033 చదరపు అడుగుల స్థలం మాత్రమే లభిస్తుంది. ఢిల్లీలో 2,207 చదరపు అడుగులు లభిస్తుంది.

# మారిషస్‌లో ఒక శకాంతం!

తెలుగు భాషను సంజీవని పర్వతంలా చివరి శ్వాస వరకు భుజం మీద మోస్తూ, అలుపెరుగని తెలుగు యోధుడిలా దేశ విదేశాలు తిరిగిన సంజీవ నరసింహ అప్పుడు ఇక లేరు. ఈ వార్త వినగానే ఎన్నెన్నో జ్ఞాపకాల అలలు గుండె చెలియలికట్టను తాకుతూ నన్ను కకావికలు చేశాయి. మూడు దశాబ్దాలకు పైగా అనుబంధం మాది. మారిషస్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థాన నిర్మాణ కమిటీ చైర్మన్ శ్రీ నరసింహులు రామయ్యగారి విన్నపంతో ఆనాటి ఆప్కో ఫ్యాబ్రిక్స్ ఉన్నతాధికారి స్వర్గీయ శ్రీ ఆకురాతి వేంకటేశ్వరరావుగారికి వచ్చిన ఆలోచనతో నేను 1989లో మారిషస్ చేరాను. మౌలికమైన ఉద్దేశం అక్కడి తెలుగువారికి, ఆసక్తిగలవారికి తెలుగు బోధించడం. మా గురువు శోభారాజుగారి ఆశీస్సులతో అరకొరగా అబ్బిన అన్నమయ్య సంకీర్తనల పరిచయమే నాకు పాస్‌పోర్టు మాత్రమే కాక, వీసాగా కూడా ఎంతగానో అచ్చొచ్చింది. అలా మారిషస్‌లో నాకు పరిచయమై, మారిషస్‌లోని తెలుగువారందరికీ అన్నమయ్య సంకీర్తనలను దగ్గర చేసి, వాడ వాడలా వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేసినవాడు, ఆత్మీయ మిత్రుడు స్వర్గీయ సంజీవ నరసింహ అప్పుడు.నేను అక్కడ ఉన్నది 18 నెలలే అయినా, అన్నమయ్యను భుజాన వేసుకుని, సంజీవ సహకారంతో, మారిషస్ ద్వీపమంతా పర్యటన చేయగలిగాను. తెలుగువారి ఇళ్ళలో వివాహమైనా, పండగైనా నన్ను పిలిచేవాళ్ళు. రామభజన, శ్రీరామనవమి, ఉగాది ఏ పండగైనా నేనక్కడ ఉండాల్సిందే. ఏ సందర్భానికైనా పాడుకోగలిగిన విధంగా అన్నమయ్య రచించిన సంకీర్తనలెన్నో ఉన్నాయి. ఆయా సందర్భాలకు, దేవుడికి సంబంధించిన కీర్తన పాడి, అందరికీ అర్థం వివరించి చెబితే ఎంత సంతోషించేవాడో! 1990 డిసెంబరులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా శోభారాజుగారి మారిషస్ సందర్శన కూడా అన్నమయ్య సంకీర్తనా ప్రచారానికి ఎంతగానో దోహదం చేసి, ఊపునిచ్చింది. నాలుగైదేళ్ళ క్రితం యాభై అన్నమయ్య సంకీర్తనలను సంకలనం చేసి, అర్థ, తాత్పర్యాలతో ఇంగ్లీషులో ప్రచురించి, మారిషస్‌లో ఆసక్తి ఉన్న తెలుగువారందరికీ పంచిపెట్టాడు సంజీవ. మారిషస్‌లో తెలుగువారి అస్తిత్వ చిహ్నంగా ఒక పతాకాన్నే సృష్టించాడాయన.ఎంతో శ్రద్ధగా కలిగ్రఫీలో అందరి పేర్లు రాసేవాడు. దానికోసం ప్రత్యేకంగా నాలుగైదు రంగుల బాల్ పెన్నుల రీఫిల్స్ కలిపి వినూత్నమైన పెన్ను తయారు చేశాడు. ఒకేసారి నాలుగైదు రంగుల్లో రాసేవాడు. సంజీవ చేతిరాత ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. తన పేరు మీద ఒక ఫాంట్ తయారు చేయాలని ప్రయత్నించాడు, చివరికి సాధించాడు కూడా. 'మారిషస్ సంజీవ తెలుగు ఫాంట్'ను సృష్టించి, ప్రపంచమంతా ఉన్న తెలుగువారిలో చిరస్మరణీయుడయ్యాడు. అద్భుతంగా ముగ్గులు వేసేవాడు. ప్రపంచ మహాసభల సందర్భంగా రవీంద్ర భారతి ముంగిలిని ముగ్గులతో తీర్చిదిద్దాడు. తెలుగు ప్రముఖులంతా అతని శ్రద్ధకు ఆశ్చర్యపోయేవారు. రావి ఆకులను ఎండబెట్టి, వాటి మీద ఎందరో ప్రముఖుల బొమ్మలు గీసి, ఎన్నో ప్రదర్శనలిచ్చాడు. తన ప్రదర్శనకు స్థలం కేటాయించకపోతే గేటు దగ్గరే వాటిని ప్రదర్శించేవాడు. కుల మతాల ధోరణి లేకుండా అందరితో కలసిపోయేవాడు. నేను విజయవాడలో కలవడానికి వెళ్ళినపుడు ఒక క్రిస్టియన్ మిత్రుల ఇంట్లో ఉన్నాడు. వారు సంజీవ భక్తిని గమనించి కారులో భద్రాచలం తీసుకుని వెళ్ళారు. తెలుగు మాట్లాడితే చాలు; ఎందరో ప్రముఖుల్ని, అప్రముఖుల్ని టోరీ రేడియోలో ఇంటర్వ్యూ చేసేవాడు. జీవితాంతం టోరీ రేడియోతో అనుబంధం కొనసాగించాడు. ప్రతి వారమూ నాకు ఆ కార్యక్రమాల లింకు పంపించేవాడు. తెనాలిలో మునిసిపల్ స్కూలు పిల్లల దగ్గర నుంచి, అబిడ్స్‌లో స్లేట్ స్కూల్ పిల్లల దాకా అందరికీ సంజీవ పరిచయమే.

# ప్రజా సమస్యలకు వందశాతం పరిష్కారం

పథకాల నిధులను దారి మళ్లించింది. దీంతో కేంద్రం నిధులు ఇవ్వడం ఆపేసింది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి ఆగిపోయింది. అభివృద్ధి లేకుంటే సంపద లేదు.. సంపద లేకుంటే సంక్షేమం లేదు. రాయల్ ఎన్‌ఫీల్డ్ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగాం. పెట్టుబడుల కోసం 28 ఉత్తమ విధానాలు తీసుకొచ్చాం. గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారింది. దేశంలో ఉన్న అతిపెద్ద కంపెనీలన్నీ ఏపీలో ఏర్పాటు కాబోతున్నాయి. వారానికో కంపెనీ తీసుకొస్తున్నాం. రోజుకో శంకుస్థాపన చేస్తున్నాం. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని చంద్రబాబు అన్నారు.మంత్రుల సింగపూర్ పర్యటనపై జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ప్రజెంటేషన్ తదితర అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. నేర్చుకోవటం అనేది నిరంతర పక్రియ అని తెలిపారు. అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. సింగపూర్‌లో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని చెప్పారు. సింగపూర్‌లోని అత్యుత్తమ విధానాలను తీసుకుని ఓ జిల్లాను మోడల్‌గా అభివృద్ధి చేద్దామని అన్నారు. సింగపూర్ విధానాల అమలుకు 90 రోజుల యాక్షన్ ఎ÷–లాన్ తయారు చేసి పర్యవేక్షణ చేయాలని సూచించారు. 'నేను కాదు మనం అనే విధానంలో ముందుకు వెళ్తాం.. ఈ విధానం నేటి నుంచి నాతో మొదలవుతుంది' అని సీఎం పేర్కొన్నారు. బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ.. వారానికో శంకుస్థాపన జరుగుతోందన్నారు. వేగంగా పనిచేయాలని.. అంతే వేగంగా అభివృద్ధి చూపించాలని సూచించారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదన్నారు. పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చన్నారు. జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలని తెలిపారు. కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశానని... ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చామని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

# తమిళనాట కొనసాగుతున్న ఉత్కంఠ

తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రకటన విడుదల చేసింది. గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్ ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో బుధవారం గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు సమకూరిన అనంతరం రావాలని సూచించినట్టు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తం చేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## కొల్లు రవీంద్ర చెత్త రాజకీయాలు చేస్తున్నారు:

తాజాగా ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, తాను అధికారులను బెదిరించలేదని, కేవలం తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని మాత్రమే చెబుతున్నానని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే అధికారులకు భవిష్యత్తులో జవాబుదారీతనం ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, మచిలీపట్నంలోని నోబుల్ కాలేజీ సత్రం ఆక్రమణపై మంత్రి కొల్లు రవీంద్ర చేసిన ఆరోపణలను పేర్ని నాని తీవ్రంగా ఖండించారు. సత్రాన్ని తాను ఆక్రమించానన్నది పచ్చి అబద్ధమని, ఆ కాలేజీకి అద్దె ఎవరు చెల్లిస్తున్నారో తెలుసుకోవాలని ఆయన సూచించారు. కొల్లు రవీంద్ర ఇష్టానుసారం మాట్లాడుతూ 'చెత్త రాజకీయాలు' చేస్తున్నారని, ఇలాంటి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. మచిలీపట్నం అభివృద్ధిపై కాకుండా వ్యక్తిగత విమర్శలపై దృష్టి పెట్టడం సరైన పద్ధతి కాదని ఆయన విమర్శించారు.

## ఇక విద్యా శాఖ మొత్తానికీ ఒకే డ్యాష్‌బోర్డు:

ఒక సమగ్రమైన కేపీఐ (కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్) డ్యాష్‌బోర్డును రూపొందించాం. విద్యార్థుల హాజరు, డ్రాపవుట్లు, మధ్యాహ్న భోజనం వంటి కీలక అంశాలను ఇందులో పొందుపరిచాం. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో ఈ డ్యాష్‌బోర్డు కలెక్టర్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని వివరించారు. 'డెమాక్రటైజేషన్ ఆఫ్ డేటా' తమ లక్ష్యమని, త్వరలోనే ఈ డ్యాష్‌బోర్డును ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉత్తమ విధానాలు (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేసేందుకు జిల్లాల కలెక్టర్లను మెంటార్లుగా నియమిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా, స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల ఏర్పాటుకు మెంటార్‌గా కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ నిర్ణయాలు స్పష్టం చేస్తున్నాయి.

## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..

అయితే, ఎన్నికల ఫలితాలను అంగీకరించని మమతా బెనర్జీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, ఈ పరిణామంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) ట్యాంపరింగ్ ద్వారానే బీజేపీ గెలిచిందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీతో కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. బీజేపీ విజయాన్ని "అనైతికం" అని ఆమె అభివర్ణించారు. గవర్నర్ నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఎల్లుండి బీజేపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరనున్నట్టు సమాచారం.

## యుజువేంద్ర చాహల్ వేపింగ్ వివాదం: అసలేం జరిగింది?

టీమిండియా ఆటగాడు, ఐపీఎల్ లో పంజాబ్ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న స్టార్ స్పిన్నర్ యుజువేంద్ర చాహల్, విమాన ప్రయాణంలో నిబంధనలకు విరుద్ధంగా ఈ–సిగరెట్ (ఖుజూఆఅస్త్ర) తాగారనే ఆరోపణలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి.

వివరాల్లోకి వెళితే... పంజాబ్ కింగ్స్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన యూట్యూబ్ ఛానల్ కోసం 'ట్రావెల్ వ్లాగ్' షూట్ చేశాడు. మే 6న అహ్మదాబాద్ నుండి హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్న సమయంలో తీసిన ఈ వీడియోలో, బ్యాక్‌గ్రౌండ్‌లో కిటికీ పక్క సీటులో కూర్చున్న చాహల్, తన నోటి దగ్గర ఏదో పరికరాన్ని పెట్టుకుని పక్కన ఉన్న శశాంక్ సింగ్‌తో మాట్లాడుతున్నట్లు కనిపించింది. ఆ సమయంలో చిన్నపాటి పొగ లాంటిది రావడం, చాహల్ వెంటనే దగ్గడం నెటిజన్ల కంట పడింది.

# కళారాధన ఉచిత లలిత కళల వేసవి శిక్షణా శిబిరం ఘనంగా ప్రారంభం

**జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ.**

**20 అంశాలలో, 32 మంది శిక్షకులతో నెలరోజుల పాటు ఉచిత శిక్షణ శిబిరం.**

**జూన్ రెండవ తేదీ ముగింపు ఉత్సవం**



**నంద్యాల సిటీ బ్యూరో మే 7 ( నంది పత్రిక )** కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల ఆధ్వర్యంలో, నంద్యాల ఐఎంఏ, మహిళా వైద్య విభాగం, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత లలిత కళలు,క్రీడల వేసవి శిక్షణా శిబిరాన్ని స్థానిక కేవీఎంఎం పురపాలక పాఠశాల ఆవరణలో కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ రవి కృష్ణ, ఆంధ్రప్రదేశ్ లయన్స్ క్లబ్ ల సమాఖ్య మాజీ చైర్మన్ ఏ. వి.ఆర్. ప్రసాద్, కే.ఎన్.ఎం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అసదుల్లా కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి కృష్ణ, కార్య నిర్వాహక కార్యదర్శులు అన్నెం శ్రీనివాసరెడ్డి ,పత్తి రంగనాథ్, సాహితీ విభాగం కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు నిర్వహణలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళారాధన అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం మే 1వ తేదీ నుండి జూన్ 2 వ తేదీ వరకు "కళా సాధన- 2026" వేసవి శిబిరం నిర్వహించడం జరుగుతున్నదని, ఈరోజు లాంఛనంగా ప్రారంభించామన్నారు. వేసవి సెలవులను బాలలు, యువత సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఏవిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ కళలు, క్రీడలు బాలల మానసిక, వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని తద్వారా చదువులో కూడా రాణించడానికి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. క్రమ శిక్షణ, ఏకాగ్రత మెరుగవుతాయని అన్నారు. ప్రధానోపాధ్యాయులు అసదుల్లా మాట్లాడుతూ కళారాధన గత 25 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఇంత చక్కటి కార్యక్రమం ఒక కళాయజ్ఞంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలలకు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ శిక్షణ పొందిన బాలబాలికల చేత శిబిరం ముగింపు కార్యక్రమంలో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శిబిరంలో పాల్గొన్న అందరికీ ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. శిబిరంలో శిక్షణ పొందడానికి, ముగింపు ఉత్సవంలో ప్రదర్శనలు ఇవ్వడానికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని తెలిపారు. ప్రదర్శనలకు అవసరమైనటువంటి కాస్ట్యూమ్స్, మేకప్ , లైటింగ్ సౌండ్ సిస్టం ఏర్పాట్లు అన్ని కూడా కళారాధన ఆధ్వర్యంలో చేస్తామన్నారు. కోచ్ లకు గౌరవ పారితోషికం అందజేస్తామన్నారు. కోచ్ లకు ప్రతిరోజు అల్పాహారం ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ సమావేశంలో కలయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, క్యాంప్ కోఆర్డినేటర్ లు మజీద్, వెంకటేశ్వర్లు ,కోచ్ లు గణేష్ ,కళ్యాణి, లలితా సరస్వతి, సుహాసిని, ప్రజ్వల,మానస,రజాక్ బాలరాజు,, శివకుమార్,సుదర్శనం,బాలకృష్ణ,నాగేంద్ర,రాజేంద్ర,సతీష్ ,మధు,సీతారాం,వెంకటరాజు,రాజ్‌కుమార్,తరుణ్,నిలయ్,సాంఖ్య,సత్యనారాయణ, దామోదర్,సమీర్, ఫణి, శిక్షణ పొందుతున్న 350 మంది బాలబాలికలు, యువత, బాలల తల్లితండ్రులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డకు దక్కని గౌరవం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 7:** బండి ఆత్మకూరులో ని అంగన్వాడి సెంటర్లో ఆనందమ్మ టీచర్ గా పని చేస్తూ ఉంది. రెక్కల కష్టంతో పిల్లలను చదివించింది. చిన్న కూతురు పెద్దపాటి సాత్విక ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోని టాపర్గా నిలిచింది. ఫలితాలలో 595 మార్కులు సాధించి మట్టిలో మాణిక్యంలా నిలిచింది. ఫలితాలు వెలువడి పది రోజులు అవుతున్నప్పటికీ విద్యాశాఖకు సంబంధించిన ఏ ఒక్క అధికారి కానీ, ప్రజా ప్రతినిధులు కానీ, సాత్వికను అభినందించలేదు, ప్రశంసించలేదు. కేవలం సాత్విక ఒక దళిత బిడ్డ అయిన కారణంగానే, ప్రజా ప్రతినిధులు అధికారులు, ఈ విషయంపై దృష్టి సారించలేదని సామాన్యులు విమర్శలు గుప్పిస్తున్నారు. కేవలం ఒక ప్రైవేట్ పాఠశాలలో చదివిన కారణంగానే సాత్వికను అధికారులు దూరం పెట్టారా? అన్న అనుమానం కూడా తలెత్తుతూ ఉంది. దళిత కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా ఉన్నత మార్కులు సాధించిన సాత్వికను అభినందించడంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# దివ్యాగులకు ఎపిఎస్ఆర్టీసిలో ప్రత్యేక రక్షణ కల్పించాలి.

**స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి.**



**బేతంచెర్ల మే 7 ( నందిపత్రిక ).** ఎపి.రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉగాది కానుకగా ప్రవేశపెట్టిన దివ్యాంగశక్తి పథకంను పూర్తిగా అమలు చేయక పోవడంలో విఫలమయ్యిందని స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు పీట్ల మద్దిలేటి, కార్యదర్శి రాముడు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆసంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ, బస్సులలో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో కూర్చున్న ఇతరులను ఖాళీ చేయించడంలో, పూర్తిగా వికలాంగుల పట్ల కనీస మానవత్వం లేకుండా వ్యవహారిస్తున్న ఆర్టిసి కండక్టర్, డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరిని వీడి వికలాంగులకు బస్సులలో కేటాయించిన సీట్లలో వారిని కూర్చునే విధంగా చొరవ చూపాలన్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల హక్కుల చట్టం 2016 చట్టం( ఆర్పి డబ్ల్యూడి యాక్ట్ ) ను ఉల్లంగిస్తున్నది కాబట్టి కేవలం కూటమి ప్రభుత్వ ఆర్భాటాలు తప్ప ఆచరణలో శూన్యం అని అన్నారు. దివ్యాంగులు బస్సులలో నిలబడలేక,మెట్ల దగ్గర కూర్చొని అనేక ఇబ్బందులను ఎదుర్కొకోను చున్నారని, ఇది చాలా బాధాకర విషయం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టిసి బస్సులలో దివ్యాంగులకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చొనుటకు, ఆర్టిసి బస్ కండక్టర్,డ్రైవర్ సహకరించి దివ్యాంగులకు న్యాయం జరుగుటకు కూటమి ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని సంఘం అధ్యక్షులు పీట్ల మద్దులేటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రామమోహన్,సురేష్,శకుంతల,మద్దమ్మ,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పద్మావతి నగర్ కూడలిలో చలువ పందిరి రూపంలో పొంచివున్న ప్రమాదం.



**గాలులు వీస్తే విరిగిన కర్రతో ప్రమాదం .**

**ప్రజల సొమ్ము మంచినీళ్ల లా ఖర్చుచేస్తున్న అధికారులు.**

**చలువ పందిర్లకు ప్రతి ఏటా 5 నుంచి 6 లక్షలు ఖర్చు.**

**ప్రధాన కూడళ్లలో శాశ్వత నిర్మాణం చేసినా అంతా ఖర్చు రాదు.**

**చలువ పందిరి నీడలో జేబులు నింపుకుంటున్న అధికారులు,కాంట్రాక్టర్.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 7 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో ప్రజలు కడుతున్న పన్నుల డబ్బు ,మున్సిపల్ అధికారులు వృథాగా ఖర్చుచేస్తున్నారు. చలువ పందిర్లు నాసిరకంగా వేయడంతో మృత్యు ఫందిర్లుగా మారిపోయాయి. నాసిరకం కర్రలు వాడటంతో చిన్న గా వేస్తున్న గాలులకు కర్రలు విరిగిపోతున్నాయి. పద్మావతి నగర్ ఆర్చి సమీపంలో ఇప్పటికే మూడు సార్లు చలువ పందిరి కర్రలు విరిగిపోయాయి. తాజాగా గత మూడు రోజుల క్రితం వీచిన గాలులకు పందిరి లో కొన్ని కర్రలు విరిగిపోవడం,ఒక వైపు కర్ర విరిగి గునపం లా కనపడుతుంది. సాయంత్రం వేళల్లో గాలులు వీస్తే ఆ కర్ర ఊడి అక్కడ వాహనాల్లో నిలబడ్డ వారిపై పొరపాటున పడితే యమలోకానికి పయనం కట్టాల్సిందే. వివరాల్లోకి వెళితే ప్రతి ఏటా వేసవి కాలంలో ప్రధాన కూడళ్ల వద్ద చలువ పందిర్లు ఏర్పాటుచేస్తున్నారు. పట్టణంలో దాదాపు 10,12 ప్రాంతాల్లో చలువ పందిర్లు వేస్తారు. గతంలో స్థానికంగా ఉన్న కాంట్రాక్టర్ కు పనులు అప్పగించేవారు. ఎక్కడైనా చలువ పందిర్లు ఓడిపోతే వెంటనే సరిచేసేవారు. ప్రస్తుతం నంద్యాలలో ఎందరో కాంట్రాక్టర్లు ఉన్నా వారిని కాదని వారికి నచ్చిన కాంట్రాక్టర్ ఇతర జిల్లా నుంచి తీసుకొచ్చి 6 లక్షలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. వేసవి కాలం ప్రారంభం కావడం తో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో చలువ పందిర్లు వేశారు. వేసిన కొన్ని రోజుల కె అవి కొన్ని పడిపోయాయి. విచిత్రం ఏమంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట ఒక చలువ పందిరి పడిపోవడంతో అక్కడ ఆ పందిరి పూర్తిగా తొలగించారు. అలాగే పద్మావతి నగర్ ఆర్చి వద్ద ఒక వైపు ఇప్పటికే మూడు సార్లు పడిపోవడంతో మరమత్తులు కాంట్రాక్టర్ చేయకుండా మున్సిపల్ సిబ్బంది చేయడం విశేషం. తాజాగా మూడు రోజుల క్రితం కాసేపు వీచిన గాలులకు అక్కడ ఉన్న చలువ పందిరి కి వేసిన కర్రలు విరిగిపోయాయి. ఒక వైపు కర్ర సగం విరిగి గాల్లో తేలి యాడుతుంది. సిగ్నల్ లిట్ సరిగా పనిచేయకపోవడంతో వాహన దారులు నిలబడకుండా వెళ్లిపోతున్నారు. సిగ్నల్ లైట్ సరిగా పనిచేస్తే అక్కడ వాహన దారులు నిలబడ్డ సమయంలో గాలులు వీచి పొరపాటున విరిగిన కర్ర వాహనదారులపై పడితే ఖర్చు లేకుండా యమలోకాన్ని చూడవచ్చు. మరో వైపు ప్రతి ఏటా 6 లక్షలు ఖర్చు పెట్టే కంటే బలమైన పైపులు శాశ్వితంగా వేస్తే వేసవి కాలంలో పైన పరదా ఒక్కటి తగిలిస్తే సరిపోతుందని ప్రజలు పేర్కొంటున్నారు. శాశ్వత నిర్మాణం చేస్తే ప్రజా ధనం వృథా కాకుండా ఉంటుంది. పెద్దలు చెప్పిన సమేత ఎలా ఉందంటే సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్న చందంగా ప్రజల డబ్బుతో శాశ్వత నిర్మాణం చేపడితే ప్రతి ఏటా మాకు వచ్చేది రాదు అని అధికారులు అనుకున్నారో ఏమో ఇలా చేయడం మాకు ఆదాయమని ఇలాగే కొనసాగిస్తారేమో. ప్రతి ఏటా వేసే చలువ పందిర్లకు లక్ష కంటే ఖర్చు కాదని అధికారుల వాటా కోసమే ప్రతి ఏటా 6 లక్షలు ఖర్చుచేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రజలు పన్నులు కడుతున్నారు కానీ ఇలా వృథా చేస్తున్న అధికారులను ప్రశ్నించకపోవడంతో మున్సిపల్ అధికారులు ఇష్టం వచ్చినట్టుగా వృద్ధ చేస్తున్నారు. నంద్యాల మున్సిపాలిటీ విచిత్రం మరొకటి ఉందండి. వర్షాకాలంలో లక్షల రూపాయలతో కాల్వల్లో పూడికలు మొదలు పెడతారు,వర్షాలు వస్తె నిలిపివేసి బిల్లు మాత్రం పూర్తిగా కాంట్రాక్టర్ కు ఇచ్చి వారి వాటా వారు తీసుకుంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే వేసవి కాలంలో లక్షలు ఖర్చు పెట్టి మొక్కలు నాటుతారండోయ్. మొక్కలు నాటిన కొన్ని రోజులకే వాడిపోయి కనిపిస్తాయి. ఇదండీ మున్సిపల్ అధికారుల పనితీరు. అధికారులు ఇప్పటికైనా చలువ పందిర్లు శాశ్వత నిర్మాణాలు చేపట్టండి. ప్రస్తుతం పద్మావతి నగర్ ఆర్చి వద్ద ప్రమాదం జరగక ముందే మరమత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడండి.



# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో చిత్తశుద్ధి లేని పాలకులకు ప్రజలే బుద్ధి చెబుతారు.

**ప్రభుత్వ భూములు ప్రైవేటు కార్యాలయాలకు లీజుల పేరుతో ఇచ్చే కన్నా పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి**

**సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్**

**నంద్యాల ప్రతినిధి. మే 07 . (నంది పత్రిక ):** రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతలు ప్రజా ప్రయోజనాల కోసం ఉన్న ప్రభుత్వ భూములను పార్టీ కార్యాలయాల పేరుతో లీజులకు తీసుకోవడం దుర్మార్గమని. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేని పాలకులకు ప్రజలే తనకు బుద్ధి చెబుతారు. పట్టణంలోని సాయిబాబా నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు డి శ్రీనివాసులు సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి భూమని శ్రీనివాసులు మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి సుశీలమ్మ సిపిఐ నాయకులు ప్రసాద్ రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటి వరకు ఇచ్చిన హామీలు అరకురా తప్ప అసలైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు భూమి ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారని అది ఇంతవరకు నెరవేరుకపోగా ప్రభుత్వ భూములను పార్టీ కార్యాలయాలకు తీసుకోవడం దుర్మార్గమని అన్నారు. నంద్యాల జిల్లా ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న తరుణంలో, నాడు వైఎస్సార్సీపీ ప్రభుత్వం వ్యవసాయ పరిశోధన సంస్థ భూములను కలెక్టరేట్, మెడికల్ కాలేజీ కోసం తీసుకున్నప్పుడు ప్రస్తుత మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ తీవ్రంగా వ్యతిరేకించారని వారు గుర్తు చేశారు. నాడు ప్రతిపక్ష నేతగా ప్రశ్నించిన ఫరూక్, నేడు అధికారంలోకి రాగానే మార్కెట్ యార్డుకు చెందిన రెండెకరాల భూమిని ఏడాదికి కేవలం వెయ్యి రూపాయల లీజుతో టీడీపీ జిల్లా కార్యాలయం కోసం తీసుకోవడం దుర్మార్గమని గతంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డిని విమర్శించిన మీరు, ఈరోజు అదే బాటలో ఎలా వెళ్తారని ఈ విషయం మీద ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించుకోవాలన్నారు. నంద్యాల పట్టణ శివారులోని చాబోలు, రైతునగరం వంటి గ్రామాల్లోనూ నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించి అమ్ముకుంటున్న అధికార పార్టీ నాయకులు నిమ్మకి నీరెత్తినట్లు ఉంటున్నారు. పార్టీ కార్యాలయాల కోసం జీఓలు తెచ్చుకోవడంలో ఉన్న ఉత్సాహం పేదల ఇళ్ల స్థలాలపై ఎందుకు లేదని ప్రశ్నించారు. వెంటనే పట్టణ ప్రజలకు ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, లేని పక్షంలో నిరుపేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు.




# కాటమరాజు ప్రకృతి, పర్యావరణ, పశుసంపద పరిరక్షకుడు...





**మహానంది. మే 07 . (నంది పత్రిక ):** ప్రకృతి, పర్యావరణ, పశుసంపద పరిరక్షకులుగా ఇతర ప్రాణులను జంతువులను సమాన దృష్టితో కాటమరాజు చూసే వారు ఆని ఒక రాజు అయినప్పటికీ ఆయనను పూజిస్తే వర్షాలు కురిసి ప్రకృతి సస్యశ్యామలంగా మారుతుంది అని అఖిలభారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు చైర్మన్ డాక్టర్ చింతల మోహన్ రావు యాదవ్ పేర్కొన్నారు. మహానంది మండలం శ్రీ నగరం గ్రామం సమీపంలో దొరి బావి వద్ద వెలసిన పురాతన కాటమరాజు విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. దొర్రి బావి వద్ద ఉన్నఅతి పురాతనమైన కాటమరాజు విగ్రహం నేటికీ దర్శనమిస్తున్నది. ఇక్కడ గతంలో పెద్ద సంఖ్యలో రైతులు గ్రామస్తులు కాటమరాజుకు జంతుబలులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దొరి బావి గంగమ్మ వద్ద పూజలు నిర్వహించేవారు. కాటమరాజు విగ్రహానికి ఎంతో విశిష్టత ఉంది. ఆలయానికి వెళ్లే రహదారి ఆలయ స్థలం కబ్జాకు గురి కావడంతో నేడు కనుమరుగైనది. అఖిల భారత కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చింతల మోహన్ రావు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షకుడైన కాటమరాజును ప్రతి ఒక్కరూ పూజించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పూర్వం దొర్రి భావి వద్ద సుమారు 10 ఎకరాల బంజర్ పొలము ఉండేది. కాలక్రమంగా స్థానిక ఆక్రమణదారులు కాటమరాజు భూమితో పాటు దొర్రి భూమిని మరియు రస్త భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నడంతో కాటమరాజు ఆలయం కను మరుగైనదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి దురాక్రమనకు గురైన 10 ఎకరాల పొలాన్ని గుర్తించి ఆలయానికి వెళ్లే రహదారిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండల జిల్లా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి భూ కబ్జా దారుల నుంచి విముక్తి కలిగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు జనరల్ సెక్రెటరీ బి. నాగన్న యాదవ్, కోశాధికారి డాక్టర్ బండారు నాగేశ్వరరావు, కాటమరాజు సంస్కృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు కాజా శ్రీనివాసు, శివ, రమణయ్య పలువురు పాల్గొన్నారు.

## బి కోడూరులో కేంద్ర బృందం పర్యటన



**బండిఆత్మకూరు నంది పత్రిక మే 7:** రైతులు అవసరం మేరకే ఎరువులను వాడుకోవాలని కేంద్ర బృందం సూచించింది. గురువారం బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న బి కోడూరు గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫెర్టిలైజర్స్ రవీంద్ర యాదవ్ ఎక్స్టెన్షన్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ మధు శేఖర్ లు మాట్లాడుతూ, జిల్లాలో యూరియా, డిఏపీలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొన్నారు నానో యూరియా, నానో డిఏపి, జీవన ఎరువులను ఉపయోగించి భూసారాన్ని పెంచుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి సున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు ఆందోళనతో ముందస్తుగా ఎరువులనుకొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు.యూరియా, డిఏపీలకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలతోపాటు జీవన ఎరువు ల వాడకాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన పంటల వివరాలు,ఆ పంటలకు వినియోగించే ఎరువుల మోతాదు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పచ్చి రొట్టె ఎరువులు అయిన జీలుగ, పిల్లి పెసర లేదా 25 నుంచి 30 రకాల విత్తనాలు కలిగిన పీఎండీఎస్ కిట్లను సాగు చేయడం అలవర్చుకోవాలని అన్నారు. జీవన ఎరువులైన అజోల్ల,అజోస్ప యిరిల్లా, పోష్ప బ్యాక్టీరియా, మైకోరైజ, మరియు నానో ఎరువులు పంటల సాగులో వినియోగించుకోవాలన్నారు. డీఏపీ అధికంగా వాడటం వల్ల కలిగే నష్టాలను గురించి రైతులకు రైతు సేవా కేంద్రం సిబ్బంది అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఇన్చార్జి ఏడి జయప్రకాష్ రెడ్డి టెక్నికల్ ఏవో కళ్యాణ్ మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారులు లక్ష్మయ్య సువాసిని స్థానిక రైతులు పాల్గొన్నారు.



## ప్రవేట్ కార్పొరేట విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలి

**ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి**

**గుర్తింపు లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలి**

**నిద్ర మత్తులో విద్యాశాఖ అధికారులు**

**పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి రఫీ డిమాండ్**



**నంద్యాల ప్రతినిధి. మే 07 . (నంది పత్రిక ):**ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి జీవో నెంబర్ ఒకటి 1కి వ్యతిరేకంగా పట్టణంలో ఫ్లెక్సీలు, ఓర్డింగ్ బోర్డులు పెట్టి తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తున్న ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ దోపిడిని అరికట్టాలని పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి రఫీ వారు డిమాండ్ చేశారు.నంద్యాల పట్టణంలో సాయిబాబా నగర్ లో ఉన్న పి డి ఎస్ యు కార్యాలయంలో పి డి ఎస్ యు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి రఫీ మాట్లాడుతూ నంద్యాల జిల్లా లో ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అక్రమంగా ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ప్రచారాలు నిర్వహించకూడదని నిబంధన ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి తమ విద్యా సంస్థల యొక్క ర్యాంకుల ప్రచారాలు నిర్వహిస్తూ పెద్దపెద్ద ఫ్లెక్సీలు, బోర్డింగ్ బోర్డులు పెట్టి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నాయి. అడ్మిషన్ల పేరుతో భారీగా ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు కొన్ని విద్యా సంస్థలు అయితే ప్రభుత్వం నుండి ఎలాంటి గుర్తింపు లేకున్నా ముందస్తు అడ్మిషన్లు నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నారు మరోవైపు పెద్ద పెద్ద ప్రచార బోర్డులు పెట్టి, ప్రధాన కూడలిలలో పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో ప్రచారాలు నిర్వహిస్తూ పిఆర్వోలను విద్యార్థుల ఇండ్లకు పంపించి అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందన్నారు.ప్రభుత్వా నియమ నిబంధనలు ఉల్లంఘించి ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేస్తున్నప్పటికీ నంద్యాల జిల్లాలో ఉన్నటువంటి విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం ప్రవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలకు నిదర్శనం అన్నారు.విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ లోపం వల్లే ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు వాళ్లకిష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారన్నారు ,ఇప్పటికైనా ప్రభుత్వ నియామ నిబంధనలు ఉల్లంఘించి ప్రభుత్వ గుర్తింపు లేకుండా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పి డి ఎస్ యు ఆధ్వర్యంలో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు షాహీద్ , జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్, మద్రి స్వామి,పిడిఎస్యు నాయకులులక్ష్మీకాంత్,కిరణ్,విజయ్, హరి,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం





**-నంద్యాల మార్కెట్ యార్డ్ వద్ద వైసీపీ భారీ నిరసన**

**మద్దతు ధర ఏది? - మార్కెట్ యార్డ్ సాక్షిగా కూటమి సర్కార్‌పై విరుచుకుపడ్డ వైసీపీ నేతలు.**

**రైతుల పక్షాన పోరాటం ఆపేది లేదు: ఎమ్మెల్సీ ఇసాక్ బాష హెచ్చరిక.**

**ఆర్బీకేల వ్యవస్థను నిర్వీర్యం చేశారు: రాష్ట్ర సీఈసీ పీ.పీ. నాగిరెడ్డి విమర్శ.**

**నంద్యాల ప్రతినిధి. మే 07 . (నంది పత్రిక ):**రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికొదిలేసిందని విమర్శిస్తూ నంద్యాల జిల్లాలో వైసీపీ శ్రేణులు గళమెత్తాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ.. నేడు నంద్యాల టేక్కే మార్కెట్ యార్డ్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ నిరసనలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర సీఈసీ పీ.పీ. నాగిరెడ్డి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులకు అవసరమైన యూరియా, పురుగుమందులను సకాలంలో అందించలేక ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని వారు మండిపడ్డారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. "రైతు పండించిన జొన్న, మొక్కజొన్న, వరి, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా.. ఆచరణలో మాత్రం కొనుగోలు చేయకుండా రైతులను నట్టేట ముంచుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సును విస్మరిస్తోంది" అని విమర్శించారు.వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పార్టీలకు అతీతంగా రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

లేని పక్షంలో రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, నంద్యాల మండల అధ్యక్షులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర సీఈసీ పీ పీ నాగిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్న బాబు చౌదరి, నంద్యాల నియోజక వర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నీ సా, వైసీపీ నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, నంద్యాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శులు శివనాగిరెడ్డి, దేవనగర్ బాషా, గోస్పాడు మాజీ ఎంపీపీ ఆర్థర్ సైమన్, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృత రాజ్, టీవీ రమణ, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు,వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలు ముందే గుర్తించి నిలుపుదల చేయండి.

**ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.**



**తిరుపతి బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** నగరంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలను ముందే గుర్తించి నిలుపుదల చేయాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పోస్టల్ కాలనీ, నారాయణ పురం, డి. బి. ఆర్ రోడ్డు, చింతలచేను, కైకాల చెరువు తదితర ప్రాంతాల్లో ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులతో పాటు, నిర్మాణాలను పరిశీలించారు. నగరంలోని ఫుట్ పాత్ ఆక్రమణలు, అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు పిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది నగరంలో పర్యటిస్తూ అనుమతులు లేని నిర్మాణాలు గుర్తించి ముందే అడ్డుకోవాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట ఏసీపీ పార్వతి ప్రియ, స్వర్ణ వార్డు కార్యదర్సులు, తదితరులు ఉన్నారు.



## రైస్ కార్డుదారులలో ఇంకనూ ఈ-కేవైసీ పూర్తి చేయించుకోని సభ్యులు వెంటనే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోండి:

**జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా**



**వైఎస్సార్ కడప బ్యూరోచీఫ్ ,మే 7నంది పత్రిక** వై.ఎస్.ఆర్. కడప జిల్లాలోని రైస్ కార్డుదారులలో ఇంకనూ ఈ-కేవైసీ పూర్తి చేయించుకోని సభ్యులు వెంటనే తమ సమీపంలోని రేషన్ దుకాణ డీలర్‌ను లేదా స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించి ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవలసింది జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా గురువారం ఒక ప్రకటన లో తెలిపారు...జిల్లాలో ఇప్పటికీ మొత్తం 39,104 మంది ఈ-కేవైసీ పూర్తి చేయించుకోలేదని, అందులో అత్యధికంగా కడప నియోజకవర్గంలో 7,633 మంది, ప్రొద్దుటూరులో 4,297 మంది, రాజంపేటలో 3,029 మంది ఈ-కేవైసీ చేయించుకోవలసి ఉన్నదని తెలిపారు .. అందువల్ల జిల్లాలోని అన్ని తహశీల్దార్లు, సీఎస్‌డీటీలు తమ పరిధిలోని వీఆర్వోలు మరియు రేషన్ దుకాణ డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న ఈ-కేవైసీలను ఈ-పోస్ లేదా జీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్ ద్వారా త్వరితగతిన పూర్తి చేయించవలసిందిగా ఆదేశించడమైనది. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతున్నందున, కార్డుదారులు తమ సమీపం లోని రేషన్ దుకాణాలను సందర్శించి వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవలసిందిగా జిల్లా సంయుక్త కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## భూమా జగత్ విక్యాతరెడ్డి జన్మదినం సందర్భంగా అహోబిలంలో ప్రత్యేక పూజలు :

**కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి.**

**శిరివెళ్ల(నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన కల్లూరి శకుంతలమ్మ శేష ఓబులరెడ్డి నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షురాలు అయినటువంటి శకుంతలమ్మ భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి గారి జన్మదిన వేడుకల సందర్భంగా శ్రీ అహోబిల లక్ష్మీనరసింహస్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. దివంగత ప్రజాప్రతినిధులు ఎంపీ ఎమ్మెల్యే అయినటువంటి భూమా నాగిరెడ్డి భూమా శోభనాగిరెడ్డి గారి ముద్దుల తనయుడు విఖ్యాత్ రెడ్డి ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సిరి సంపదలతో భోగభాగ్యాలతో రాజయోగాలతో తులతూగాలని శ్రీ అహోబిల లక్ష్మీ నరసింహ స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థించినట్లు కల్లూరి శకుంతలమ్మ గారు తెలియజేశారు.



## విజయ్ ప్రభుత్వ ఏర్పాటుపై సస్పెన్స్... బీజేపీ నేతలు ఖుష్బూ, కస్తూరి కీలక వ్యాఖ్యలు

ప్రముఖ నటి, తమిళనాడు బీజేపీ ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు పరోక్షంగా మద్దతుగా వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే పార్టీ అత్యధికంగా 108 సీట్లు గెలుచుకుంది. విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం కాగా, ఐదుగురు ఎమ్మెల్యేలు కలిగిన కాంగ్రెస్ ఇప్పటికే మద్దతు ప్రకటించింది. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 118 మంది ఎమ్మెల్యేల బలం లేకపోవడంతో గవర్నర్ విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడం లేదు. ఈ క్రమంలో ఖుష్బూ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. ప్రజలు ఎవరినైతే ముఖ్యమంత్రిగా కోరుకున్నారో వారిని నియమించాలని పేర్కొన్నారు. తమిళనాడు పౌరురాలిగా ఈ మేరకు కోరుకుంటున్నానని తెలిపారు. అంతకుముందు సినీ నటి, బీజేపీ నాయకురాలు కస్తూరి కూడా విజయ్‌కు మద్దతు పలికారు.

## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి.. స్పందించిన బండి సంజయ్

కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద జరిగిన దాడి ఘటనపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, తమ కార్యకర్తలకు కూడా సహనం ఉంటుందని, కానీ ఆ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని అన్నారు. దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం తమ సంస్కృతి కాదని అన్నారు.

# రైతుల గోడు పట్టించుకోని కూటమి ప్రభుత్వం





**నంద్యాల మార్కెట్ యార్డ్ వద్ద వైసీపీ భారీ నిరసన.**

**మద్దతు ధర ఏది? - మార్కెట్ యార్డ్ సాక్షిగా కూటమి సర్కార్‌పై విరుచుకుపడ్డ వైసీపీ నేతలు.**

**రైతుల పక్షాన పోరాటం ఆపేది లేదు: ఎమ్మెల్సీ ఇసాక్ బాష హెచ్చరిక.**

**ఆర్బీకేల వ్యవస్థను నిర్వీర్యం చేశారు: రాష్ట్ర జజుజ పీ.పీ. నాగిరెడ్డి విమర్శ.**

**నంద్యాల సిటీ బ్యూరో మే 7 ( నంది పత్రిక )** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గాలికొదిలేసిందని విమర్శిస్తూ నంద్యాల జిల్లాలో వైసీపీ శ్రేణులు గళమెత్తాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ.. నేడు నంద్యాల టేక్కే మార్కెట్ యార్డ్ వద్ద వైసీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర జజుజ పీ.పీ. నాగిరెడ్డి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రబీ, ఖరీఫ్ సీజన్లలో రైతులకు అవసరమైన యూరియా, పురుగుమందులను సకాలంలో అందించలేక ప్రభుత్వం రైతులకు తీరని అన్యాయం చేసిందని వారు మండిపడ్డారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. "రైతు పండించిన జొన్న, మొక్కజొన్న, వరి, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినా.. ఆచరణలో మాత్రం కొనుగోలు చేయకుండా రైతులను నట్టేట ముంచుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సును విస్మరిస్తోంది" అని విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పార్టీలకు అతీతంగా రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, నంద్యాల మండల అధ్యక్షులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాష, రాష్ట్ర జజుజ పీ పీ నాగిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్న బాబు చౌదరి, నంద్యాల నియోజక వర్గ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ మాబున్నీ సా, వైసీపీ నంద్యాల మండల అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, నంద్యాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శులు శివనాగిరెడ్డి, దేవనగర్ బాషా, గోస్పాడు మాజీ ఎంపీపీ ఆర్థర్ సైమన్, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనీల్ అమృత రాజ్, టీవీ రమణ, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్లు,వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ఏ కోడూరులో ధర్తి మాత బచావో అభియాన్




**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 7** : బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఏ కోడూరు గ్రామంలో గురువారం ధర్తీ మాత బచావో అభియాన్ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తాసిల్దార్ పద్మావతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ రైతులు సగటున ఎకరాకు రెండు బస్తాల యూరియా వానకారుకు, మరియు ఎకరాకు మూడు బస్తాలు ఎండాకారుకు వాడుకోవాలని సూచించారు. మోతాదుకు మించి ఎరువులను వాడటం వల్ల రైతులకు నష్టమే జరుగుతుందని అన్నారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను, సేంద్రియ ఎరువులను రైతులు వినియోగించుకోవాలని అన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన దిగుబడులను పొందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో వెంకటరమణ,రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీనివాసరెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రజకుల వృత్తి దారుల సమస్యల ను పరిష్కరించాలి . అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం రజక



**సిరివెళ్ల (నంది పత్రిక)** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో అఖిలభారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రజక గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పోరేషన్కు తగిన నిధులు కేటాయించాలి, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి 5000 పెన్షన్ మంజూరు చేయాలి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలి, ఎస్సీ ఎస్టీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి. అలాగే ధోబి గాట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## జనగణ పురోగతిపై క్షేత్రస్థాయిలో సూపర్వైజర్లు పరిశీలించాలి.. తహసిల్దార్.



**జూపాడుబంగ్లా,మే :7: (నంది పత్రిక):** జూపాడు బంగ్లా మండలంలో జనగణ 2027 లో భాగంగా జరుగుతున్న ఇండ్ల నమోదు సర్వేను మండల స్థాయి సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో వెళ్లి ఆనిమేటర్లకు సూచనలు సలహాలు ఇవ్వాలని మండల తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో గురువారము జనగణకు సంబంధించిన కిట్లను సూపర్వైజర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడత ఇండ్ల గణన ఇండ్ల- నమోదు -2026 చేస్తున్న స్థానిక ఆనిమేటర్లకు ప్రభుత్వం అందిస్తున్న కిట్ల ద్వారా 33 రకాలు కుటుంబ సర్వేను కాలంసును పరిశీలించి సింక్ చేయాలని సేకరించిన డేటా నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపర్వైజర్లకు సూచించారు. అనంతరం ఏఎస్ఓ హనుమంతు జన గణనపై సూపర్వైజర్లకు సలహాలు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోపికృష్ణ, డిప్యూటీ తాసిల్దారులు సత్యదీప్, ఎన్ నాగన్న,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల లోనే వసతులు సౌకర్యాలు





**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 7:** విద్యా రంగానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల లోనే అన్ని రకాల వసతులు సౌకర్యాలు ఉన్నాయని, మండల విద్యాశాఖ అధికారి యశోద పేర్కొన్నారు. గురువారం బండి ఆత్మకూరు లోని అంగన్వాడీ కేంద్రాలను యశోద సందర్శించారు. అంగన్వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరములు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా అంగన్వాడి టీచర్లు తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యాబోధన జరుగుతూ ఉందని ఆమె పేర్కొన్నారు. క్వాలిఫైడ్ టీచర్లతో పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని అన్నారు. పాఠశాలల్లో విశాలమైన గదులు అన్ని వసతులు సౌకర్యాలను ప్రభుత్వం కల్పించడం జరిగిందని అన్నారు. గ్యారెంటెడ్ ఫౌండేషనల్ లిటరసి, మరియు న్యూమరిసి ద్వారా ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. దీని ద్వారా పాఠశాల విద్యార్థులలో చదవడం రాయడంతో పాటు ప్రాథమిక లెక్కలు నేర్చుకొని సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు. స్మార్ట్ టీవీల ద్వారా పాఠశాలలలో విద్యాబోధన జరుగుతుందని, ఆధునిక విద్యా విధానంలో ఏదో ఒక విప్లవాత్మకమైన మార్పు అని అన్నారు.

ఇది తరగతి గదులను మరింత ఆసక్తికరంగా మారుస్తుందని, వీడియోలు యానిమేషన్లు చిత్రాలను ఉపయోగించి సంక్షిప్తమైన అంశాలను సులభంగా ప్రభుత్వ పాఠశాలలో బోధించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు చక్కని యూనిఫామ్ తో పాటు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా, భోజన సౌకర్యాలు కూడా కల్పించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులలో మానసిక ఎదుగుదల కొరకు పాఠశాలల్లో ప్రత్యేకంగా యోగా అభ్యాసాల ద్వారా ప్రత్యేక క్లాసులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలన్నీ, ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నో వసతులు, సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలలలో తమ పిల్లలను చేర్పించి పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మండల విద్యాశాఖ అధికారి యశోద విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెయిన్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, సిఆర్పిలు అజమతుల్లా, పుల్లయ్య, ఉపాధ్యాయులు మహబూబ్బాషా, నాగపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసమే వచ్చాం - మీ ఊరికే వచ్చాం



**బండి ఆత్మకూరు నంది పత్రిక మే 7 :** గ్రామాలలో సమస్యలు పరిష్కరించేందుకు మీకోసమే మీ ముందుకు వచ్చాం! నేరుగా మీ ఊరికే వచ్చాం" మీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం అంటూ మండల తహసిల్దార్ పద్మావతమ్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ ఉత్తర్వుల మేరకు బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న కడమల కాలువ గ్రామంలో ఒక నెల -ఒక గ్రామం - నాలుగు సందర్శనలు అనే వినూత్నమైన కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తహసిల్దార్ మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో ప్రతినెల నాలుగు గురువారాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. గ్రామస్తుల నుండి రెవిన్యూ శాఖతోపాటు అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వినతులను స్వీకరించబడటం జరుగుతుందని తెలిపారు. ప్రజాల సమస్యలపై స్థల పరిశీలనలు నిర్వహించడం, విచారణలు చేపట్టడం, సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను త్వరితగతిన పరిష్కరించబడటం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ సర్వేయర్ నాగ ప్రసాద్, వీఆర్వో వెంకటేశ్వర్లు, విలేజ్ సర్వేయర్ అనూష తో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు అధికారులు అందరూ చర్యలు తీసుకుంటారని తహసిల్దార్ పద్మావతమ్మ తెలిపారు . ఈ సందర్భంగా పలువురు రైతులు పంట పొలాల్లో తాము ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.



# స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర -ఆరోగ్యం, పలు అంశాల పై అవగాహన సదస్సు..

**-ప్రతి ఒక్కరు మొక్కలు నాటి మహావృక్షాలుగా చేసి, ప్లాస్టిక్ ని వాడకుండా వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి.**

**--స్వాతంత్ర్య సమరయోధుల సేవలు చిరస్మరణీయం. --సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**

**--బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు.**

**బేతంచెర్ల మే 7 ( నందిపత్రిక ).** మే 7న జాతీయ గీతం రచయిత శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి మరియు స్వాతంత్ర్య సమర యోధులు శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మన జాతీయ గీతం రచయిత శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి మరియు స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘణంగా నివాళులు అర్పించారు. వారిని స్మరించుకున్నారు. ఈ కార్య క్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయభాస్కర్, సిస్టర్స్ ఆర్. వసంత,ఏ.ఇంద్రజ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ వెంకటేష్, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూమన దేశ స్వాతంత్ర్య సమర యోధులను,శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు. భారత దేశానికి జాతీయ గీతాన్ని అందించిన కవి రవీంద్రనాథ్ ఠాగూర్,మే 7, 1861 జన్మించారు. ఈయన తన గీతాంజలి కావ్యానికి సాహిత్యంలో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. నోబెల్ బహుమతిని అందు కున్న మొట్టమొదటి ఆసియా వాసి గా పేరుగాంచిన మహాను భావులు శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్. రవీంద్రుడు మొదటి నుండి జాతీయ భావాలున్నవాడు. దేశభక్తి గీతాలను పాడాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన "జనగణమణ" ను జాతీయ గీతంగాప్రకటించారు. రచయితగా, సంగీతవేత్తగా, చిత్ర కారునిగా, విద్యావేత్తగా ,గొప్ప మానవతావేత్తగా ఠాగూర్ చరిత్రలో నిలిచిపోయాడు. మాతృభూమి, మానవ సంబంధాలపట్ల అచంచల మయిన నమ్మకం, ప్రేమాభిమానాలు కలిగి ఉన్న విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, 1941 ఆగష్టు 7న మరణించాడు. భారత స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామ రాజు జూలై 4, 1897 జన్మించారు. ఒక మహోజ్వల శక్తి. ఇతడు జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్ర్యం వస్తుందని నమ్మి , దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడు. ఆదివాసులతో కలిసి బ్రిటీషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీ కొట్టాడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే 1924 మే 7 అల్లూరి సీతారామరాజు అమరవీరుడయ్యాడు. సీతా రామరాజు మరణించినా, అతడు రగిలించిన విప్లవాగ్ని చల్లారలేదు "రా తమ్ముడూ! వీరుడు మరణింపడు. విప్లవానికి పరాజయం లేదు. చిందిన వీరుని రక్తం చిరకాలము ప్రవహిస్తూ ఉంటుందని మన్యం వీరులు బ్రిటిష్ వారి పై యుద్ధం కొనసాగించారు. ఇలాంటి మహనీయులైన స్వాతంత్ర్య సమరయోధులను ఎల్లవేళల స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్తలు డోన్ పి. మహమ్మద్ రఫి,బేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ వేంకటేశ్వర్ల కోరారు. భ్రూణ హత్యలు నివారించడం కోసం ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలిపిసి పీఎన్డీటీ (గర్భస్థ పిండ పరీక్ష నివారణ) చట్టం పై ప్రజలకుబేతంచెర్ల ప్రభుత్వ వైద్యశాల ఇంచార్జ్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి లు అవగాహణ కల్పించారు.



## ఎంజి బ్రదర్స్ కియా వారి సమ్మర్ సర్వీస్ క్యాంప్ మే 6 నుండి 12 వరకు



**నంద్యాల ప్రతినిధి. మే 07 . (నంది పత్రిక ):**నంద్యాల పట్టణంలో దీపగుంట్ల గ్రామ సమీపాన ఎంజీ బ్రదర్స్ కియా మోటార్స్ వారి ప్రియమైన కస్టమర్ల వాహనాల ప్రత్యేక ప్రయోజనాలతో వేసవి కాలపు ప్రత్యేక సర్వీస్ క్యాంప్‌కు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం కియా వారి ప్రత్యేక ఆఫర్లు ఉచిత యూజ్డ్ కార్ మూల్యాంకనం టెస్ట్ డ్రైవ్ (రెఫరల్ ప్రయోజనాలతో)

**యాక్సెసరీస్‌పై 5% తగ్గింపు** రోడ్ సైడ్ అసిస్టెంట్స్ (ఆర్ఎస్ఏ) ప్లాన్స్‌పై 10% తగ్గింపు ఏసి కారు కేర్ ట్రీట్‌మెంట్‌పై 20% తగ్గింపు సర్వీస్ ప్రయోజనాలు 20-పాయింట్ల సమ్మర్ రెడినెస్ మరియు ఏసి పనితీరు తనిఖీ ఉచిత కార్ టాప్ వాష్

**కొనసాగుతున్న క్వాలిటీ చెక్ క్యాంపెయిన్స్** మీ కారును సమ్మర్ క్యాంపుకు సిద్ధంగా ఉంచుకోవాలని నిపుణుల సేవలు మరియు అద్భుతమైన ఆఫర్లతో మే 6వ నుండి 12 వరకు షోరూమ్ ను సందర్శించాలని కంపెనీ యాజమాన్యం తెలిపారు. బుకింగ్స్ కోసం ఈరోజే సంప్రదించండి. మీకు సేవ చేయడానికి ఎంజి బ్రదర్స్ కియా మోటార్స్ వారు సేవలందించేందుకు ఈ క్యాంపు ఉపయోగించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు+91 83282 12788 మరియు +91 78159 61280 సేవలు వినియోగించుకోవాలని వారు తెలిపారు.

## 1745 పాలసీలతో కడప డివిజన్లో నే ప్రథమ స్థానం..



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 7నంది పత్రిక** నంద్యాల బ్రాంచ్ లో గడిచిన ఆర్థిక సంవత్సరంలో 1745 జీవిత బీమా పాలసీలను సేకరించి ప్రథమ స్థానంలో నిలిచిన సీనియర్ డెవలప్మెంట్ ఆఫీసర్ దేవా ను గురువారం బ్రాంచ్ అధికారులు ఘనంగా సత్కరించారు. ఆళ్లగడ్డలోని జీవిత బీమా శాటిలైట్ కార్యాలయంలో జరిగిన నంద్యాల, ఆళ్లగడ్డ అభివృద్ధి అధికారుల సమావేశంలో నంద్యాల బ్రాంచ్ మేనేజర్ శివ శంకర్ కుమార్, ఆళ్లగడ్డ బీ. ఏం శ్రీనివాసులు మాట్లాడుతూ.. కృషి పట్టుదల ఉంటే దేనినైనా సాధించవచ్చని కొనియాడారు. ఈ ఏడాది కూడా అభివృద్ధి అధికారులు అందరూ సమిష్టిగా కృషిచేసి బ్రాంచికి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి బీమా పాలసీలను సేకరించాలని మేనేజర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మేనేజర్(ఏజెన్సీ )సుబ్బ నరసింహ అభివృద్ధి అధికారులు దేవా, విజయభాస్కర్, మధుమోహన్ రెడ్డి, శ్రీరాములు, సాయి ఈశ్వర్ రెడ్డి, విజయ శేఖర్, కేశవరెడ్డి, వెంకటరమణ, శశికళ, జగదీష్ కుమార్, కుప్పల శివ శంకర్, నాగార్జున, రాజశేఖర్, కుమ్మరి శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన హైస్కూలు విద్యార్థులు



**మంత్రాలయం , మే 7,-** రాజస్థాన్ ఉదయపూర్ లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడల్స్ పథకాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠోభ రావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఏప్రిల్ 28,29,మే 1 తేదిన ఇండియా పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజస్థాన్లోని ఉదయపూర్ లో జాతీయ స్థాయి పోటీలు జరిగాయి, ఈ జాతీయ స్థాయి విభాగంలో160 కేజీ బరువు నుపదవ తరగతి విద్యార్థి చిన్న నాగయ్య ఎత్తి , 120 కేజీ లు బరువు ను వినయ్ ఎత్తి గోల్డ్ మెడల్ సాధించాడు, 66 కేజీలడెడ్ లిఫ్ట్ విభాగంలో 140 కేజీ బరువు ఎత్తి జాతీయస్థాయిలో కాశీస్య పథకము , తొమ్మిద వ తరగతి విద్యార్థి వై. నరసింహ బెంచ్ ప్రెస్, స్క్వాట్, డెడ్ లిఫ్ట్ 53 కేజీల జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు, విద్యార్థులు జాతీయస్థాయిలో పాల్గొన్ని, మొదటి, రెండు, మూడు స్థానాలు కైవసం చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు విటోభ రావు విద్యార్థులను ప్రశంసించారు, ఈ కార్యక్రమంలో శివశంకర్, రవీంద్ర, నరసింహ రాజు పాల్గొన్నారు.

## సమస్యలపై దృష్టి సారించండి

### - తహసిల్దార్ ఉమారాణి



**కొత్తపల్లి - నంది పత్రిక :** గ్రామీణ ప్రాంతాలలో సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని, తహసీల్దార్ ఉమారాణి సూచించారు. గురువారం మండల పరిధిలోని శివపురం గారమంలో గ్రామ సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గ్రామాలలో సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు నెలలో ఒక గ్రామాన్ని ఎంచుకోని గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన పిర్యాదులను పరిష్కారిస్తామన్నారు. అందులో భాగంగానే భూమి కొలతలకు రెండు, పొలం ఆన్లైన్ మ్యూటేషన్ను ఒక రైతు ధరఖాస్తు చేసుకున్నారన్నారు. వాటిని వెంటనే పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేశామన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ, ఎంపీటీసీ శివన్న తదితరులు పాల్గొన్నారు.



# గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో మానవ సేవే..మాధవ సేవా..



### నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనంగా నూతన మొబైల్ క్యాంటీన్ ప్రారంభం.. మానవత్వానికి ప్రతీక గోళ్ళ రాజేష్.. సేవా నిరతిలో అలుపెరుగని యోధుడు గోళ్ల రాజేష్..

**నంద్యాల సిటీ బ్యూరో మే 7 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలో గడచిన సంవత్సర కాలం నుండి ఆర్థిక సహకారాలు,సేవా సహాయ సహకారాలు,వైద్య సేవ సహకారాలు ఇలా ఎన్నో రకాల సేవా సహకారాలు,సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మానవత్వానికి ప్రతీకగా,మానవసేవయే మాధవ సేవగా నిదర్శనంగా నిలుస్తూ ముందుకు వెళుతున్నారు గోళ్ళ రాజేష్ ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కార్యక్రమాల కార్య నిర్వాహకులు రిపోర్టర్ నూర్ భాషా ఆధ్వర్యంలో మొబైల్ కాంటీన్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నూర్ బాషా మాట్లాడుతూ గడిచిన సంవత్సర కాలం నుండి నంద్యాల నియోజకవర్గంలో గోళ్ళ రాజేష్ ఆధ్వర్యంలో నంద్యాల నియోజకవర్గ ప్రజలకొరకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు ఏర్పాటు చేస్తు వాటన్నిటినీ ఎక్కడా ఆపకుండా ప్రతి ఒక కార్యక్రమాలాన్నింటిని విజయపథంలో నడిపిస్తు ప్రజలందరి చేత ఆదర,అభిమానాలు,సహభాష్ అనిపించుకుంటూ అభినందనలు పొందుతున్నారు గోళ్ళ రాజేష్ అన్నారు. ఎవరు కూడా అర్థాకలితో ఉండకూడదు ప్రతి ఒక్కరు కడుపునిండా తినాలి అని సదుద్దేశంతో ఒక రూపాయికే రుచికరమైన పుల్కా కర్రీ, పప్పు, కలర్ రైస్,కర్రీ,పప్పు రుచికరమైన భోజనం కౌంటర్ ని పట్టణంలో ఏర్పాటు చేసి గడచిన 8 నెలల నుండి నిరంతరాయంగా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజలందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకుంటున్నారు గోళ్ళ రాజేష్ ఈ నేపథ్యంలో ఈరోజు సేవా నిరతిలో అలుపెరుగని యోధుడుగా మరింత మంది ప్రజలకు



కడుపునిండా అతి తక్కువ ధరకే కడుపునిండాలా మొబైల్ క్యాంటీన్ ని ఏర్పాటు చేసశారని మొబైల్ కాంటీన్ ప్రారంభించడానికి ముఖ్య ఉద్దేశం పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఈ మొబైల్ క్యాంటీన్ ద్వారా వీలైనంత ఎక్కువమందికి రుచికరమైన అతితక్కువ ధరికే ఆహారాన్ని అందించాలని ప్రధాన లక్ష్యంగా గోళ్ళ రాజేష్ ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్టు నూర్ బాషా ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నూతన సంక్షేమ పథకాలను గోళ్ళ రాజేష్ ప్రజలందరికీ కూడా తీసుకొని వచ్చి ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు చేసేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని నంద్యాల నియోజకవర్గ ప్రజలందరు గోళ్ళ రాజేష్ ను ఆశీర్వదించాలని వారు కోరారు.

## జాతీయ స్థాయి పోటీ లో పథకాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



**మంత్రాలయం , మే 7, :-** రాజస్థాన్ లో ఇండియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు మంత్రాలయం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో మంత్రాలయం టీడీపీ ఇంచార్జి సోదరులు మేరకు మంచాల సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి గురువారం శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువత జాతీయ స్థాయిలో రాణించడం ఎంతో ఆనందంగా ఉంది. కష్టపడి సాధన చేస్తే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు చిన్న నాగయ్య ఇండియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించగా, వినయ్ బ్రాంజ్ మెడల్, నరసింహులు సిల్వర్ మెడల్ అందుకొని నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచారన్నారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు నరసింహ రాజు , రవీంద్ర ఉన్నారు.

## శ్రీ వాసు స్కూల్ విద్యార్థి ఎం.జె. పి. కి



**బేతంచెర్ల మే 7 ( నందిపత్రిక ).** నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో గల శ్రీ వాసు విద్యానికేతన్ యుపి స్కూల్ చెందిన ఆర్.రాఘవ ఎం జె పి ఎంటెన్స్ లో 100కు 92 మార్కులు సాధించి బేతంచెర్ల ఎం జె పి పాఠశాలకు ఎంపిక అయ్యాడు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల కరస్పాండెంట్ డి. లక్ష్మీదేవి మరియు ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్).. డిజిటల్ డేటా కోసం వైసీపీ డిమాండ్

రాష్ట్రంలో జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని వైసీపీ డిమాండ్ చేసింది. ఈ ప్రక్రియకు ఉపయోగించే ఓటరు జాబితాను సెర్చ్ చేయగలిగే డిజిటల్ ఫార్మాట్‌లో తమకు అందించాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)ను కోరారు.ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగాలంటే, ఓటరు జాబితా పూర్తి వివరాలు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉండటం అత్యవసరమని అప్పిరెడ్డి అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా సులభంగా వెతకగలిగేలా డిజిటల్ జాబితాను ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ఓటర్ల జాబితాలో అక్రమ తొలగింపులు, డూప్లికేట్ ఎంట్రీలు, ఓటర్ల మార్పిడి వంటి అంశాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణల ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలు, భద్రతా చర్యలను బహిర్గతం చేయాలని కోరారు. సరైన ప్రక్రియ పాటించకుండా ఏ ఒక్క నిజమైన ఓటరునూ ఓటు హక్కుకు దూరం చేయకూడదని స్పష్టం చేశారు.

# వానపల్లి ఫుడ్ పాయిజన్ బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు..





### బాధితులకు ధైర్యం చెప్పి, మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించిన ఎమ్మెల్యే...

**కొత్త పేట బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** వానపల్లి శివారు రామ్మోహన్ పేటలో బుధవారం మధ్యాహ్నం ఒక వివాహ వేడుకలో విందు సందర్భంగా ఫుడ్ పాయిజన్ కు గురైన 35మందికి పైగా బాధితులను గురువారం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో మాట్లాడి వారికి భరోసా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివాహ వేడుకలో విందు కారణంగా ఫుడ్ పాయిజన్ జరిగినట్లు తెలుస్తుందన్నారు. బాధితులకు సరైన చికిత్స అందేలా వైద్యులు తగిన చర్యలు తీసుకున్నారన్నారు. వానపల్లి పీహెచ్సీలో మొదట బాధితులను చేర్చినా, అక్కడ నుంచి కొత్తపేట సీహెచ్సీకి తరలించడం జరిగిందన్నారు. ఇక్కడ డాక్టర్లు అందరూ ప్రత్యేక పర్యవేక్షణలో వారందరికీ వైద్యం అందిస్తున్నారన్నారు. వారందరి రక్తనమూనాలు సేకరించి పరీక్షలకు పంపడం జరిగిందన్నారు. మహిళలు, యువకులు, చిన్నారులు అందరూ బాధితుల్లో ఉన్నారన్నారు.ఉదయం, రాత్రి ఒకే రకమైన భోజనం తిన్నవారికి ఎక్కువగా ఇబ్బంది కనపడుతుందన్నారు. వైద్యులు, సిబ్బంది దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారని, ఎటువంటి ప్రాణ భయం లేదని వారు తెలిపారన్నారు.

ఫుడ్ పాయిజన్ నుంచి తేరుకోవాల్సి ఉందని తెలిపారన్నారు. ఎవరికైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేశారన్నారు. గ్రామంలో ఉన్న పెద్దలు అందరూ దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. పరీక్షలు వచ్చిన తర్వాత బాధితులకు దానికి తగిన చికిత్స కూడా అందించడం జరుగుతుందన్నారు. త్వరలోనే బాధ్యతలు అందరూ కోలుకుంటారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# ఆచంటలో ఐటిఐ నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసిన జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**బీమవరం బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో నిర్వహించిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ తొలి రోజు సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. సచివాలయం ఐదో బ్లాకులోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జరిగిన ఈ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా "బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్" అవార్డు అందుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు అభినందనలు తెలియజేస్తూ స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర జీఎస్డీపీ వృద్ధి, జిల్లాల వారీ జీఎస్డీపీ అంచనాలు, స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు, విద్య, వైద్యం, పెట్టుబడుల గ్రౌండింగ్, జలధార తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితుల కారణంగా రాష్ట్రం అప్పుల భారాన్ని ఎదుర్కొన్నప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టిని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రజల సంతృప్తినే పాలనకు కొలమానంగా తీసుకుని పనిచేస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు 26 కొత్త పాలసీలు తీసుకువ చ్చామని, రూ.23 లక్షల కోట్ల ఎంఓయూల ద్వారా లక్షలాది ఉద్యోగావకాశాలు సృష్టించనున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, డేటా, ఏఐ, క్వాంటం టెక్నాలజీలలో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అలాగే రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, ప్రజా ఫిర్యాదుల శతశాతం పరిష్కారం, క్షేత్రస్థాయి పాలన బలోపేతంపై అధికారులకు పలు దిశానిర్దేశాలు చేశారు.జిల్లాలో అవసరమైన ప్రాజెక్టులకు స్థలాల అవసరతపై చర్చ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఆచంటలో ఐటిఐ సమర్థవంతంగా కొనసాగుతున్నప్పటికీ, స్థలం లేక సొంత భవనాల నిర్మాణం చేపట్టలేకపోతు న్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఐటిఐ భవన నిర్మాణా నికి కనీసం రెండు ఎకరాల స్థలం అవసరమని విన్నవించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోతే భూసేకరణ ద్వారా స్థలం సమకూర్చే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు..





# అప్పన్నవీడు శ్రీ అభయాంజనేయ స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ - స్వామివారికి ప్రత్యేక పూజలు.





**హనుమాన్ జయంతి వేడుకలను లాంచనంగా ప్రారంభించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

**వేడుకలు అంగరంగ వైభవంగా జరపాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచన..**

**దెందులూరు బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** హనుమత్ భక్తి, సేవా నిరతి సమాజానికి ఆదర్శమని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. రాబోయే హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఉదయం ఆయన తన కుటుంబ సమేతంగా అప్పన్నవీడులోని ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరిపై ఆ హనుమంతుని ఆశీస్సులు ఉండా లని ప్రార్థించారు. ఆలయంలో నిర్వహించనున్న హనుమాన్ జయంతి వేడుకల ఏర్పాట్లను ఎమ్మెల్యే చింతమనేని ఈ సందర్భంగా లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "వైశాఖ బహుళ దశమి నాడు జరుపుకునే హనుమాన్ జయంతి అత్యంత పవిత్రమైనదని, ధైర్యానికి, విజయానికి మారుపేరైన ఆంజనేయ స్వామిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తులు నమ్మకం అని తెలిపారు." ఈ ఏడాది మే 12న (వైశాఖ దశమి నాడు) జరగనున్న హనుమాన్ జయంతి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించా లని నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, మజ్జిగ, నీడ, క్యూలైన్ల వంటి ఏర్పాట్లు చేయాలని అధికారులను మరియు ఆలయ కమిటీకి సూచించారు... శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ఆలయాల రక్షణతో పాటు సమాజంలో ధర్మ పరిరక్షణే తమ లక్ష్యమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని , వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ మరియు స్థానిక కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు ఎమ్మెల్యే చింతమనేని కుటుంబానికి వేద ఆశీర్వచనాలు అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను మరియు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గారపాటి రామసీత, ఆలయ కమిటీ చైర్మన్ వేమూరి శ్రీనివాస్, క్లస్టర్ ఇంచార్జ్ గుత్త అనిల్, వడ్డీ వాసవి దేవి, గరికిపాటి చంటిబాబు సహా పలువురు కూటమి నాయకులు, ఆలయ అధికారులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# "హజ్ భవన్"ను మైనారిటీస్ ఐటీఐకి కేటాయించండి:

**రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు**



**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** వైఎస్ఆర్ కడప జిల్లాలో నిరుపయోగంగా ఉన్న "హజ్ భవన్" లో మైనారిటీస్ ఐటీఐ కి కేటాయించి నిర్వహణలోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కి సూచించారు. అమరావతిలో రెండు రోజుల 7వ జిల్లా కలెక్టర్ల సదస్సులో మొదటి రోజు సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయిడు జిల్లాల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అందులో భాగంగా రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో నైపుణ్య శిక్షణా కేంద్రాల అభివృద్ధి చేయాలని సూచించారు. అందుకు సంబంధించి కడప జిల్లాలో నిరుపయోగంగా ఉన్న హజ్ భవనాన్ని మైనారిటీ ఐటీఐ నిర్వహణకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి కు సూచించారు.

## సామాజిక, రాజకీయ ప్రముఖుల సమక్షంలో మంచా సాయి వివాహ వేడుక



**పోరుమామిళ్ల, మే 7 (నంది పత్రిక ):** ప్రకాశం జిల్లా మాల మహానాడు చెన్నయ్య వర్గం అధ్యక్షురాలు, సిద్ధం సేవ పత్రిక చైర్మన్ మంచా నాగమల్లేశ్వరి సోదరుడు మంచా సాయి వివాహ వేడుక మార్కాపురం జిల్లా బేస్తవారిపేటలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షుడు జ్యేష్ఠాది భాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్, పరాశ సురేష్, హ్యూమన్ రైట్స్ నాయకుడు వెంకటన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బేరీ అహరోన్, బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు జక్కుల కిరణ్ కుమార్, విజయ్ కుమార్, అజరయా, సుజిత్, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆఫీస్ సెక్రటరీ కె. ప్రవీణ్, సురేందర్ రెడ్డి తదితర రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు. కడప జిల్లా నుంచి మాల మహానాడు జిల్లా కమిటీకి చెందిన సుమారు 20 మంది సభ్యులు వివాహ వేడుకకు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హాజరైన ప్రతి ఒక్కరికీ దళిత ఉద్యమ జైభీమ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# డ్రాఫ్ట్ పట్టాదారు పాసుపుస్తకాల పరిశీలన వేగవంతం చేయాలి





**జూన్ 2 నాటికి రైతులకు పాసుపుస్తకాల పంపిణీకి సిద్ధంగా ఉంచాలి**

**జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి**

**బీమవరం బ్యూరో చీఫ్ మే 7 నంది పత్రిక** జిల్లాలో డ్రాఫ్ట్ పట్టాదారు పాసుపుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేకుండా బుక్ ప్రింటింగ్ పూర్తి చేసి జూన్ 2వ తేదీ నాటికి రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామంలోని మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జాయింట్ ఎల్పీఎంలుగా ఉన్న భూముల విభజన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతుల ఖాతాల్లో అవసరమైన మార్పులు, చేర్పులు సకాలంలో పూర్తి చేసి, ఎటువంటి లోపాలు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాల ముద్రణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాయింట్ ఎల్పీఎంల విభజనలో పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. రైతుల భూ హక్కులకు సంబంధించిన అంశం కావడంతో ప్రతి దశలో ఖచ్చితత్వం, పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రాఫ్ట్ పట్టాదారు పాసుపుస్తకాలను మే 14వ తేదీ నాటికి సాధ్యమైనంతవరకు పూర్తి స్థాయిలో పరిశీలించి, వెంటనే ప్రింటింగ్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి రైతులకు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించే విధంగా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భూముల విభజన ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల భూ వివరాలు, రికార్డులు, ఖాతా మార్పులు వంటి అంశాల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

రైతులకు అందజేయబోయే పట్టాదారు పాసుపుస్తకాలు ఖచ్చితమైన సమాచారంతో ఉండేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకోడేరు తహసీల్దార్ ఎన్.బి విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భీరవోలులో వివాహిత మహిళ హత్య



**భార్య పై అనుమానంతో హత్య చేసి బావిలో పడేసిన భర్త మృతదేహాన్ని పూడ్చిపెట్టిన అతని ఇద్దరు సహోదరులు ముగ్గురు నిందితులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు**

**బనగానపల్లె, మే7నందిపత్రిక** మండలంలోని భీరవోలు గ్రామంలో సంచలనం సృష్టించిన వివాహిత మహిళ మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. భార్య ఆదిలక్ష్మిని హత్య చేసి మృతదేహాన్ని బావిలో పడేసిన భర్త వెంకటస్వామితో పాటు, మృతదేహాన్ని పూడ్చిపెట్టడంలో సహకరించిన అతని సోదరులు వెంకటరమణ, శ్రీనివాసులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం పట్టణంలోని గ్రామీణ సీఐ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గ్రామీణ సీఐ మంజునాథ్ రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. భీరవోలు గ్రామానికి చెందిన వెంకటస్వామి తన భార్య అయిన ఆదిలక్ష్మి తరచూ ఫోన్‌లో ఇతరులతో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో హత్యకు ముందు ఆమెను ద్విచక్ర వాహనంపై ఊరికి వెళ్దాం అంటూ తీసుకెళ్లాడు. అనంతరం భీరవోలు జీఎన్ఎస్ఎస్ కాలువ సమీపంలో ఆమెపై దాడి చేసి దారుణంగా హత్య చేసాడు. హత్య అనంతరం మృతదేహానికి రాళ్లు కట్టి సమీపంలోని బావిలో పడేశాడు. అయితే రెండు రోజుల తర్వాత అతనే బావి వద్దకు వెళ్లి చూడగా మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. దీంతో తన సోదరులు వెంకటరమణ, శ్రీనివాసుల సహాయంతో శవాన్ని బయటకు తీసి, సమీపంలోని కాలువ ప్రాంతంలో ఎవరికీ అనుమానం రాకుండా భూమిలో పూడ్చి పెట్టారని పోలీసులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఈ నెల 2వ తేదీన ఆదిలక్ష్మి కనిపించడం లేదని ఆమె తల్లి రాజోలి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందివర్గం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ విచారణలో భార్యపై అనుమానంతో భర్త వెంకటస్వామి ఆమెను హత్య చేసినట్లు బయటపడింది. ఈ కోవలో పోలీసులు అనుమానితుల కదలికలపై నిఘా పెట్టగా, పోలీసులకు చిక్కిపోతామనే భయంతో వెంకటస్వామి, వెంకటరమణ, శ్రీనివాసులు ముగ్గురు పోలీసుల ఎదుట లొంగిపోయారు. హత్యకు ఉపయోగించిన మోటార్ బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో ముగ్గురినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గ్రామీణ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో నందివర్గం ఎస్ఐ భూపాలుడు హెడ్ కానిస్టేబుల్ గంగన్న మరియు పోలీసు సిబ్బంది సుబ్బరాయుడు రాజశేఖర్ మదన గోపాల్ చెన్నయ్య లు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో పశ్చిమ గోదావరి జిల్లా రెడ్ క్రాస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు

**ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ.**



**బీమవరం బ్యూరో చీఫ్ మే 7 నంది పత్రిక** సేవే లక్ష్యంగా మానవతా కార్యక్రమాల్లో విశిష్ట గుర్తింపు ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆంధ్రప్రదేశ్ లోక్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా రెడ్ క్రాస్ శాఖకు ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. గౌరవనీయ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా. ఎం.ఎస్.వి.ఎస్. భద్రిరాజు రెడ్ క్రాస్ అవార్డును స్వీకరించారు. రెడ్ క్రాస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో 202526 సంవత్సరానికి గాను మానవతా సేవల రంగంలో విశిష్ట సేవలు అందించిన జిల్లాలకు ఈ అవార్డులు ప్రదానం చేయబడినట్లు అధికారులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా శాఖ నిర్వహించిన సేవా కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. జిల్లా రెడ్ క్రాస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, తలసేమియా బాధితులకు ఉచిత రక్త మార్పిడి సేవలు, విపత్తు సహాయక చర్యలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, అత్యవసర సేవలు వంటి అనేక మానవతా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడినట్లు పేర్కొన్నారు. ఈ సేవల ద్వారానే జిల్లా శాఖ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 27 జిల్లాలలో ఐదు జిల్లాలకు మాత్రమే ఈ ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానం చేయబడగా, ఇటీవల భీమవరం కేంద్రంగా ఏర్పడిన పశ్చిమ గోదావరి జిల్లా కూడా ఆ జాబితాలో స్థానం సంపాదించడం జిల్లాకు గర్వకారణంగా భావించబడుతోంది. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ భద్రిరాజు మాట్లాడుతూ, "ఈ అవార్డు మా జిల్లా బృందం సమిష్టి కృషికి ప్రతిఫలం. మాకు లభించిన ఈ గౌరవాన్ని మరింత బాధ్యతగా స్వీకరిస్తూ భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో మానవతా సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నాము" అని తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షురాలు మరియు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా సంయుక్త కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, వివిధ శాఖల అధికారులకు జిల్లా రెడ్ క్రాస్ శాఖ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. వారి సహకారం వల్ల మానవతా సేవలు అవసరమైన వారికి సమర్ధవంతంగా చేరడమే కాకుండా సేవా కార్యక్రమాల కోసం నిధుల సమీకరణలో కూడా విశేష సహకారం అందిందని పేర్కొన్నారు..

## టెన్త్ క్లాస్ లో 575 పైన మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించిన సూర్య బల్లాని.



**బేతంచెర్ల మే 7 (నంది పత్రిక )** బేతంచెర్ల పట్టణం నందుగల శ్రీ కన్యకాపరమేశ్వరి( అమ్మవారి శాల ) దేవ స్థానంలో,వాసవి మరియు వనితా క్లబ్ ఆధ్వర్యంలో 2026టెన్త్ క్లాస్ పరీక్షల్లో ఎన్నో కష్టాలను అధిగమించి,ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 575 /600 సాధించి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, సూర్య బల్లాని సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమం మరియు వారికి చిరు బహుమతిని సత్కరించి దీనికి దాతగా ముందుకు వచ్చిన మన బల్లాని బ్రాంచ్ అధినేత సూర్య బల్లాని వాసవి మరియు వనితా క్లబ్ అధ్యక్షులు రమణ మరియు గీత మాధవి సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ వి209ఎ గవర్నర్ లింగం నాగ శైలజ మరియు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు కందగడ్డల జనార్ధన్ మరియు జోనల్ చైర్పర్సన్ సుధీర్ స్కూల్స్ ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు మరియు తదితర ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు..
### -మఠం పీఠాధిపతుల హెచ్చరిక



**మంత్రాలయం, మే 7 నంది న్యూస్)** : భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం ఆయన మఠం సిబ్బందితో కలిసి పరిమళ ప్రసాద వితరణ కేంద్రం, అన్నపూర్ణ భోజనశాల, విఐపి భోజనశాల, సర్వదర్శనం క్యూలైన్లను ఆకస్మికంగా పరిశీలించారు.ప్రసాదాల నాణ్యత, పరిశుభ్రత, భక్తులకు అందుతున్న సౌకర్యాలను స్వయంగా తనిఖీ చేశారు. వంటశాల సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. మంత్రాలయానికి వచ్చే ప్రతి భక్తుడూ సంతృప్తితో వెళ్లాలని, సేవా భావంతో పని చేయాలని ఆదేశించారు. భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు.స్వామీజీ వెంట మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు, అధికారులు ఉన్నారు.

## జీవనోపాధి కల్పన పై ప్రణాళిక అవసరం
### పిడి వైపి రమణారెడ్డి



**మంత్రాలయం , మే 7** డ్వాక్రా పొదుపు మహిళలకు జీవనోపాధి కల్పనకు ప్రణాళిక అవసరమని పిడి వైపి రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో డ్వాక్రా పొదుపు మహిళలకు ఏసిఎల్పి 2026-27 ఆర్థిక రుణాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు రుణాలు వినియోగం, పొదుపు విధానాలు ఆర్థికాభివృద్ధి పై వివరించారు. రుణాలు మంజూరు, తిరిగి చెల్లింపులు వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దేటందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎం సిబిఒ ఫైనాన్స్ రెహమాన్ ఏపిఎంలు ఉన్నతి కరుణాకర్, రాజశేఖర్ సిసిలు చాముండేశ్వరి రామలింగ రామాంజినేయులు బసన్న విఒఏలు అంజలి సిఆర్పి లు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు ప్రశాంతంగా జరిగిన బహిరంగ వేలం పాటలు



**బేతంచర్ల మే 7 (బేతంచెర్ల నందిపత్రిక )** రెండు సార్లు వాయిదాలు పడినవేలాలు గురువారం నాడు బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలోనగర పంచాయితీ కమిషనర్ డి.హరిప్రసాద్ ఆధ్వర్యంలో 2026 & 2027 కాలానికి గురువారం సంత మార్కెట్, బండ్ల మెట్ట, కబేళాలకు బహిరంగ వేలాలు నిర్వహించారు. .4 లక్షలు 73 వేలు రూపాయలు ఆదాయం వచ్చినట్లు కమిషనర్ తెలిపారు. సంత మార్కెట్ ను రామ సుబ్బారెడ్డి 13 లక్షల90 వేల రూపాయలకు, బండ్ల మెట్టను పి.రామాంజనేయులు 19 లక్షల 9 వేల రూపాయలు, కబేళాను చంద్ర శేఖర్ రెడ్డి 1 లక్ష 80 వేల రూపాయలకువేలం పాటలో దక్కించుకున్నట్లు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ శాసన సభ్యులు

**బనగానపల్లె మే 7నందిపత్రిక** బనగానపల్లె మాజీ శాసన సభ్యులు కాటసాని రామిరెడ్డి గురువారం పలు వివాహ శుభ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అవుకు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి ,గుండం సూర్య ప్రకాశ్ రెడ్డి, మల్లిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, కర్రెద్దుల సుబ్బారెడ్డి తదితరులు వివాహ వేడుకలో మాజీ శాసన సభ్యులలతో పాటు పాల్గొన్నారు



# అల్లూరి స్ఫూర్తితో పోరాట పటిమను కొనసాగించాలి...



## మన్యం వీరుడు అల్లూరి 102వ వర్ధంతి సందర్భంగా భీమవరంలో ఘన నివాళి ...

**భీమవరం బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** భీమవరం పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వద్ద గురువారం ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్వర్యంలో మన్యం వీరుడు అల్లూరి 102వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు, భీమవరం శాసనసభ్యులు మరియు పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, తదితరులు ముందుగా అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆనంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ. 25 లక్షలతో వ్యయంతో నిర్మించిన డిజిటల్ స్క్రీన్, వాటర్ ప్లాంట్, వాటర్ మౌంటెన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కేవలం 27 ఏళ్ల జీవితాన్ని గడిపినా, ఆయన చేసిన త్యాగం, దేశసేవ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సాధారణంగా ఒకటి, రెండు తరాలు దాటితే మన పూర్వీకుల జ్ఞాపకాలు మసకబారిపోతాయని, కానీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా నేటికీ పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి నివాళులు అర్పించడం ఆయన దేశానికి చేసిన సేవకు నిదర్శనమన్నారు. అల్లూరి స్వస్థలం మోగల్లు కావడం, చిన్ననాటి జీవితం భీమవరం ప్రాంతంతో అనుబంధం కలిగి ఉండటం ఇక్కడి ప్రజలకు గర్వకారణమన్నారు. జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేవలం అధికారిక నివాళులకు పరిమితం చేయకుండా, ఆయన అన్యాయానికి వ్యతిరేకంగా చేసిన పోరాట స్ఫూర్తిని కూడా అందరూ ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎక్కడ సమస్య కనిపించినా భయపడకుండా అల్లూరి స్ఫూర్తితో పోరాడాలని సూచించారు. స్మృతి వనం అభివృద్ధికి కృషి చేసిన మున్సిపల్ అధికారులు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. రాజకీయ భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు, వైఎస్ఆర్సిపి నాయకులు కూడా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. గతంలో తాను చేసిన పోరాటాల ఫలితంగానే మళ్లీ ప్రజల మధ్య ఈ కార్యక్రమంలో పాల్గొనగలిగానని పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం మరింత వైభవంగా అల్లూరి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిద్దామని పిలుపునిస్తూ “జోహార్ అల్లూరి” అంటూ ముగించారు. భీమవరం శాసనసభ్యులు మరియు పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిదాయక జీవితం అందరికి ఆదర్శమని, వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. విప్లవ జ్యోతి అల్లూరి పోరాట పటిమ ఎన్నటికీ మరువలేనిదని, పిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ధైర్య సాహసాలు, దేశభక్తితో వారి ప్రాణాలను తృణప్రాయంగా ఇచ్చారన్నారు. అల్లూరి జీవితం ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను గుర్తించి దేశవ్యాప్తంగా గుర్తింపు కల్పించే క్రమంలో అల్లూరి సీతారామరాజు పేరును ప్రముఖంగా నిలబెట్టిందన్నారు. ఆయన త్యాగం అప్పట్లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రేరణ అయితే, నేటి తరానికి సమాజ సేవకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, జిల్లా అభివృద్ధిలో భీమవరం కీలక పాత్ర పోషిస్తోందని, వివిధ రంగాల్లో ముందున్న ప్రజలు ప్రభుత్వ అభివృద్ధి లక్ష్యాలకు సహకరించాలని కోరారు. రాబోయే జయంతి వేడుకలను కూడా ఘనంగా నిర్వహిస్తూ పాఠశాలల్లో జాతీయ భావాలు, అల్లూరి స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేసే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు అల్లూరి వేషధారణలో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం వారికి మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విగ్రహ కమిటీ అధ్యక్షులు ఉద్దరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి కంతేటి వెంకటరాజు, కోశాధికారి లయన్ సిహెచ్ కృష్ణంరాజు, వైస్ ప్రెసిడెంట్ గాదిరాజు సుబ్బరాజు, భీమవరం ఆర్డీవో కే ప్రవీణ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, డి.ఎస్.పి రఘువీర్ విష్ణు, తహసిల్దార్ రావి రాంబాబు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి గూడూరి ఉమాబాల, చేకూరి ఝాన్సీ లక్ష్మి, జాయింట్ సెక్రటరీ డివిఎస్ చంద్రాజీ, సభ్యులు చెరుకువాడ రంగసాయి, బుద్ధరాజు వెంకటపతి రాజు, చిలుకూరి నరసింహరాజు, భూపతిరాజు సత్యనారాయణరాజు, చేరుకోవడం సుబ్రహ్మణ్యం రాజు, మహిళా బత్తుల ఐజాక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



### “గ్రీవెన్స్ ఫ్రీ విలేజ్”లుగా గ్రామాల అభివృద్ధి లక్ష్యం
### జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి.

**భీమవరం బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి, వాటిని సత్వరంగా పరిష్కరించి “గ్రీవెన్స్ ఫ్రీ విలేజ్”లుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా పనిచేస్తాయని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ సభల కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవాసరం మండలం అండలూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం కోసం గ్రామ సభలు ఎంతో ఉపయోగకరమని అన్నారు.ప్రతి నెలా ఎంపిక చేసిన గ్రామంలో ప్రతి గురువారం నాలుగు దశలుగా గ్రామ సభలను నిర్వహిస్తూ ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. రెవెన్యూ, శానిటేషన్, పింఛన్లు, పోలీస్, భూ సర్వే తదితర శాఖలకు సంబంధించిన ఏ విధమైన ఫిర్యాదులనైనా స్వీకరించి చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభల మొదటి దశలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు లోతుగా పరిశీలించి సమస్య తీవ్రతను బట్టి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని చివరి దశ నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని తెలిపారు. పరిష్కారం కాని క్లిష్టమైన సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి ప్రత్యేకంగా పరిశీలిస్తామని అన్నారు. భూ సర్వే, రీ సర్వేలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు మండల రెవెన్యూ అధికారి, విఆర్వో, సర్వే అధికారులను సంప్రదించి దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో భూ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి ప్రజలకు సరైన సమాచారం అందుబాటులో ఉంచాలని సర్వే శాఖ అధికారులను ఆదేశించారు.అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం దరఖాస్తులు సమర్పించుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నాలుగు దఫాలుగా గ్రామ సభలను నిర్వహిస్తున్నామని, తదుపరి ఈ నెల 14, 21, 28 తేదీల్లో కూడా దశలవారీగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామ సభలకు వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటిపై తీసుకునే చర్యలను ఫిర్యాదుదారులకు సభలోనే తెలియజేస్తామని అన్నారు. ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అధికారులు గ్రామ సభలో అందుబాటులో ఉంటారని, గ్రామస్తులందరూ తమ సమస్యలను అర్జీ రూపంలో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**47 దరఖాస్తుల స్వీకరణ** అండలూరు గ్రామ సభలో ఇప్పటి వరకు మొత్తం 47 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో పింఛన్లకు సంబంధించి 15, రేషన్ కార్డుకు సంబంధించి 1, మంజూరైన ఇళ్ల స్థలాలకు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలంటూ 6, రీ సర్వేకు సంబంధించి 17, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 4, కొత్త ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి 4 దరఖాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

**గ్రామస్తుల సమస్యలపై స్పందన** గ్రామానికి చెందిన పోలుకొండ దుర్గారావు అనే వ్యక్తి తనకు ఎటువంటి ఆధారం లేకపోవడం, వృద్ధాప్యం కారణంగా పనిచేయలేని పరిస్థితి నెలకొనడంతో వృద్ధాప్య పింఛను మంజూరు చేయవలసిందిగా దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. లి అలాగే కాటూరి లక్ష్మీకాంతం అనే మహిళ తన భూమి ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నప్పటికీ “మీ భూమి” పోర్టల్‌లో అడంగల్ లో కనిపించడంలేదని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు సమర్పించినట్లు వెల్లడించారు. వరలక్ష్మి అనే మహిళ తనకు నివాసయోగ్యమైన ఇల్లు లేక అద్దె ఇంటిలో నివసించవలసి వస్తోందని, తక్కువ ఆదాయంతో జీవనం సాగించడం కష్టంగా మారిందని, గ్రామంలో ఎక్కడైనా ఇళ్ల స్థలం మంజూరు చేయవలసిందిగా వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి ఏ.వి రామాంజనేయులు, ఎంపీడీవో కే.ఎం వైభవతి, జడ్పిటిసి జయప్రకాష్, ఎంపీపీ వి. దుర్గాభవాని, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం




**మహానంది మే 07 (నంది పత్రిక):-** ప్రజా సమస్యలను గ్రామస్థాయిలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్ కార్యక్రమం ప్రభుత్వ అమలు చేస్తున్నట్లు తహశీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మహానంది మండలం మసీదుపురం గ్రామంలో వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో ఫిర్యాదుల స్వీకరణ, ఫీల్డ్ స్థాయిలో పరిశీలన,భూ సమస్యలు పరిష్కారం చేయబడుతుందని తెలిపారు. అనంతరం స్వర్ణ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో పలు రికార్డులను రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.ప్రభుత్వ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంది మెరుగైన సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహబూబ్ దౌల,రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వర్ రెడ్డి,ఆర్ ఐ వెంకట సుబ్బారావు,మండల అధికారులు,టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

**నంది పత్రిక -డోన్** ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డోన్ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి గురువారం ప్రారంభించారు.పట్టణంలోని శేగు టాకీస్ సమీపంలో, రైల్వే స్టేషన్ వెళ్లే ప్రధాన మార్గంలోని అమ్మ హోటల్ వద్ద ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రిబ్బన్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే స్వయంగా బాటసారులకు మంచి నీరు అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎండలు మండిపోతున్న ఈ తరుణంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఆయన పేర్కొన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల బాటసారులకు, సామాన్యులకు ఎంతో ఊరట లభిస్తుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని చోట్ల ఇలాంటి సౌకర్యాలు కల్పించాలని, చలివేంద్రాల్లో నిరంతరం స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉండేలా చూడాలని పురపాలక అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ ప్రసాద్ గౌడ్, వలసల రామకృష్ణ, రాఘవేంద్ర గౌడ్, శ్రీనివాసులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణమైన హత్య

**పోరుమామిళ్ల మే 7:( నంది పత్రిక )**పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోరమైన హత్య కేసు కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన 05.05.2026 రాత్రి 10.30 గంటల సమయంలో చిన్న ఎర్రసాల గ్రామం ఉత్తర వైపున ఉన్న అప్పన్న బావి సమీపంలో, పోరుమామిళ్ల పెద్ద ఎర్రసాల రోడ్డుపై చోటుచేసుకుంది. ఈ విషయమై 07.05.2026 ఉదయం 11.30 గంటలకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. కేసు వివరాల ప్రకారం, నిందితుడు షేక్ జాఫర్ వల్లి అలియాస్ బాషా ( ఏ.1) మృతుడు మానేపాటి సురేష్ (37 సంవత్సరాలు), సుంకన్న కుమారుడు, ఎస్టీ–ఎరుకల కులానికి చెందినవాడు, వృత్తి కోతులు పట్టేవాడు, స్వస్థలం తెలుగుపేట గ్రామం, ప్రస్తుతం నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామంలో నివసిస్తున్నాడు, అతని తలపై రాయితో బలంగా కొట్టాడు. దీంతో మృతుడు తీవ్ర రక్తస్రావ గాయాలతో నేలపై పడిపోయాడు. అనంతరం నిందితుడు ా.1 మరియు అతని భార్య షేక్ హసీనా (ా.2) కలిసి మృతుడిని చేతులు, కాళ్లతో విచక్షణారహితంగా కొట్టి, రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి చెత్తకుప్పలో పడవేసి నిప్పంటించారు. దీంతో మృతదేహం పూర్తిగా కాలిపోయి, కేవలం తల ఎముకలు మరియు కాలి ఎముకలు మాత్రమే మిగిలాయి. తరువాతి రోజు నిందితులు ఈ విషయాన్ని ఫిర్యాదుదారు మానేపాటి వెంకటేశ్వరి అలియాస్ ఎరుకల వెంకటేశ్వరి (29 సంవత్సరాలు), మృతుడి భార్య, తెలుగుపేట గ్రామం స్వస్థలం, ప్రస్తుతం బానుముక్కల గ్రామంలో నివసిస్తున్నది, ఆమెకు తెలియజేసి, ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించారు. దర్యాప్తులో తెలిసిన వివరాల ప్రకారం, నిందితుడు ా.1 ఫిర్యాదుదారుతో అక్రమ సంబంధం ఏర్పరుచుకొని, ఆమె భర్తను చంపి ఆమెను వివాహం చేసుకుంటానని పలుమార్లు చెప్పినట్లు తెలిసింది. అయితే ఆమె నిరాకరించడంతో, 05.05.2026 న అవకాశం దొరకడంతో ా.1 తన భార్య ా.2 సహాయంతో మృతుడిని హత్య చేసినట్లు వెల్లడైంది. నిందితుల బెదిరింపుల కారణంగా ఫిర్యాదుదారు కొంతకాలం వారి వెంటనే ఉండగా, ఈరోజు నిందితులు అప్రమత్తంగా లేని సమయంలో అక్కడి నుండి తప్పించుకొని పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోరుమామిళ్ల ఎస్ఐ హనుమంతు తెలియజేశారు.

# వ్యవసాయ, ఆక్వా వ్యర్థాలతో అద్భుత సంపద సృష్టి..

## పశ్చిమ గోదావరి జిల్లా "సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్"కు సీఎం ప్రశంసలు



**భీమవరం బ్యూరో చీఫ్ మే 7 నంది పత్రిక** 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రవేశపెట్టిన "సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్" రాష్ట్ర స్థాయిలో విశేష ప్రశంసలు అందుకుంది. వ్యవసాయం, ఆక్వా, పశుసంపద మరియు కోకో రంగాల నుంచి ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలను పర్యావరణానికి ముప్పుగా కాకుండా, విలువైన బయో ఉత్పత్తులుగా మార్చి సంపద సృష్టించే వినూత్న విధానాన్ని కలెక్టర్ సమగ్రంగా వివరించారు. జిల్లా వ్యవసాయ పరంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ, పారిశ్రామిక రంగం వాటా కేవలం 16 శాతంగా ఉండటాన్ని ప్రస్తావించిన కలెక్టర్, "వేస్ట్ టు వెల్త్" మోడల్ ద్వారా జిల్లాను పారిశ్రామికంగా కూడా అభివృద్ధి చేసే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 2026 నాటికి జిల్లాలో తలసరి ఆదాయం రూ.3.5 లక్షలు దాటే అవకాశముందని పేర్కొన్నారు. వరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా వరి పొట్టు నుంచి విద్యుత్, సిలికా జెల్, తవుడు నుంచి రైస్ బ్రాన్ ఆయిల్, నూకలు మరియు గడ్డి నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేసే ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఆక్వా రంగంలో ప్రతిరోజూ వృథాగా పోతున్న 30 నుంచి 40 టన్నుల చేపలు, రొయ్యల వ్యర్థాలతో విలువైన ఉత్పత్తులు తయారు చేసి, ప్రస్తుతం ఉన్న రూ.10 కోట్ల ఎగుమతులను రూ.50 కోట్లకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పశు సంపద రంగంలో పశువుల పేడతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో వంటగ్యాస్ అవసరాలను తీర్చడంతో పాటు, నాణ్యమైన సేంద్రియ ఎరువులు అందించేందుకు రాబోయే రెండేళ్లలో జిల్లాలో 40 వేల బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ, తాడేపల్లిగూడెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారవుతున్న "చోకో టేల్స్", ఉండి మండలం మహదేవపట్నంలో తయారవుతున్న "ది స్లో బీన్" చాక్లెట్ బ్రాండ్లను కలెక్టర్ సభకు పరిచయం చేశారు. ఈ ఉత్పత్తులు అధిక నాణ్యతతో మార్కెట్‌లో మంచి గుర్తింపు పొందుతూ లక్షల్లో టర్నోవర్ సాధిస్తున్నాయని తెలిపారు. భీమవరంలో ఇటీవల నిర్వహించిన సదస్సులో 500 మందికి పైగా మిల్లర్లు, ప్రజాప్రతినిధులు ముందుకు వచ్చి సుమారు రూ.60 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పారిశ్రామిక వికేంద్రీకరణలో భాగంగా తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం నియోజకవర్గాల్లో భూసమీకరణ ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా భవిష్యత్తులో "జీరో వేస్ట్ ఇండస్ట్రియల్ మోడల్"గా దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జిల్లా పరిపాలన రూపొందించిన "సర్క్యులర్ ఎకానమీ బ్లూప్రింట్"ను అభినందిస్తూ, రాష్ట్రంలోని ఇతర జిల్లాలు కూడా ఇలాంటి వినూత్న నమూనాలను అమలు చేయాలని సూచించారు

# మద్దతు ధరతోనే రైతుకు ఆర్థిక భరోసా



**కేసముద్రం, మే 07(నంది పత్రిక):**రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని కేసముద్రం సింగిల్ విండో చైర్మన్ దీకొండ వెంకన్న అన్నారు. గురువారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధి విలేజ్ కేసముద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ దీకొండ వెంకన్న, తహశీల్దార్ వివేక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ గ్రామాల్లోనే కేంద్రాలు ఉండటం వల్ల రైతులకు రవాణాభారం తగ్గుతుందన్నారు. అధికారులు ఎక్కడా అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరిపి, సకాలంలో చెల్లింపులు అయ్యేలా చూడాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఎండబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయానికి తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రావుల వినయ్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్స్ బీరం గోపాల్ రెడ్డి, తోట శోభ నాగన్న, గుగులోత్ రాంజీ నాయక్, మహేందర్ రెడ్డి, నంద, నూనావత్ శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కీర్తి సురేందర్, సీఈవో ఎల్లయ్య, సిబ్బంది రమేష్, రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు డీఎంకే, అన్నాడీఎంకే కలిస్తే... టీవీకే సంచలన నిర్ణయం!

తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠకు ఇంకా తెరపడటం లేదు. ఫలితాలు వచ్చి మూడు రోజులైనప్పటికీ, విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారా, లేదా అనేది తెలియడం లేదు. ఓ వైపు టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు చిన్న చిన్న పార్టీలను సంప్రదిస్తోంది. ఒక దశలో ద్రవిడ పార్టీలుగా పేరొందిన డీఎంకే, అన్నాడీఎంకేలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి రహస్య చర్చలు జరుపుతున్నట్లు ప్రచారం సాగింది. డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు కలిసినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో 12 మంది ఎమ్మెల్యేలు అవసరమవుతుంది. దీంతో అది ఎంత వరకు ఫలిస్తుందో తెలియదు. కానీ డీఎంకే, అన్నాడీఎంకే కూటమి కలిసే పరిస్థితి ఉంటే టీవీకే ఏం చేస్తుందనే చర్చ సాగుతోంది. ఆ రెండు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తే టీవీకే పార్టీకి చెందిన 107 మంది ఎమ్మెల్యేలు ( విజయ్ రెండు చోట్ల గెలిచారు. దీంతో ఆ పార్టీ బలం 108గా ఉంది) మూకుమ్మడిగా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ హెచ్చరించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి.



# నాట్య వసుందరి 2026 అవార్డును కైవసం చేసుకున్న చిన్నారి శ్రీనిధి.

**కేసముద్రం, మే 07(నంది పత్రిక):**కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామానికి చెందిన సట్ల పావని ప్రభాకర్ ల కుమార్తె చిన్నారి సట్ల శ్రీనిధి ఎంతో ప్రతిష్ఠాత్మకమైన "నాట్య వసుందరి 2026" అవార్డును అందుకొని గ్రామానికి, మండలానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో అత్యంత వైభవంగా గత మూడు రోజులుగా నిర్వహించిన నేషనల్ డాన్స్ అవార్డు ఫెస్టివల్‌లో ఈ అరుదైన గౌరవాన్ని చిన్నారి శ్రీనిధి సొంతం చేసుకుంది. దేశంలోని పలు రాష్ట్రాల నుండి పాల్గొన్న ప్రతిభావంతుల మధ్య తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ నృత్య కళను అద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకుంది. చిన్న వయసులోనే అసాధారణమైన నాట్య ప్రతిభను కనబరిచిన శ్రీనిధి తన కృషి, పట్టుదలతో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయం. న్యాయ నిర్ణేతలు సైతం శ్రీనిధి ప్రతిభను ప్రశంసిస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ అవార్డు కేవలం శ్రీనిధికే కాకుండా తెలంగాణ సాంస్కృతిక వైభవానికి లభించిన గౌరవంగా అందరూ కొనియాడుతున్నారు. చిన్నారి విజయంలో తల్లిదండ్రులు సట్ల ప్రభాకర్, పావని ల ప్రోత్సాహం ఎంతో కీలకమైంది. పిల్లల ప్రతిభను గుర్తించి చిన్నప్పటి నుంచే కళల వైపు నడిపించడం వారి గొప్పదనానికి నిదర్శనం. విద్యతో పాటు కళలకు కూడా సమాన ప్రాధాన్యం ఇస్తూ శ్రీనిధిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను అందరూ అభినందిస్తున్నారు. కుమార్తె భవిష్యత్తు కోసం వారు చేసిన కృషి ఈ విజయంతో నమోదు అయిందని వారు సంతోషపడుతున్నారు. శ్రీనిధి సాధించిన ఈ ఘనత కోరుకొండపల్లి గ్రామానికి ప్రత్యేక గుర్తింపును




తీసుకొచ్చింది. గ్రామ ప్రజలు చిన్నారిని అభినందిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సాధించాలని అందరూ ఆశీర్వదిస్తున్నారు. ఈ విజయానికి ప్రధాన కారకులైన నాట్య గురువు సరిత కి ప్రత్యేక ధన్యవాదాలు, నాట్య కళాకారిని తల్లిదండ్రులు తెలిపారు. శ్రీనిధిలోని ప్రతిభను వెలికితీసి సరైన శిక్షణ అందించిన గురువు సేవలు ప్రశంసనీయం. కళ పట్ల



అంకితభావంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ అనేక మందిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్న సరిత నిజమైన కళామాతగా నిలుస్తున్నారు. శ్రీనిధి ప్రతి అడుగులోనూ గురువు మార్గదర్శకత్వం ఎంతో తోడ్పడింది. క్రమశిక్షణ, సాధన, నిబద్ధతతో కళను నేర్పించిన ఫలితమే ఈ అవార్డు అని అందరూ భావిస్తున్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ జాతీయ స్థాయి కార్యక్రమంలో తెలంగాణ పేరు మారుమోగించడం విశేషం. అక్కడికి హాజరైన పలువురు ప్రముఖులు చిన్నారి ప్రదర్శనను ప్రశంసించారు. చిన్నారి నాట్యం చూసి ప్రేక్షకులు చప్పట్లతో అభినందించారు.

# ఒక నెల ఒక గ్రామ కార్యక్రమంలో భాగంగా రేగడగూడూరులో గ్రామసభ



**వెలుగోడు, మే 7 (నంది పత్రిక):** వెలుగోడు మండలంలో "ఒక నెల ఒక గ్రామం, నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా రేగడగూడూరు గ్రామం ఎంపిక. ఈ సందర్భం గ్రామసభల్లో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు, అందులో 20 సర్వేలకు సంబంధించిన అర్జీలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంఆర్ఐ, సత్యనారాయణ రెడ్డి,మండల సర్వేయర్ ఉపేంద్ర, వీఆర్ఓ, వేణుగోపాల్ , వెంకట శివుడు, ఉన్నారు. అలాగే గ్రామ పెద్దలు రామసుబ్బారెడ్డి, ఏ. మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు.. వ్యవసాయ శాఖ మండల అధికారి



**చాగలమర్రి మే 7నంది పత్రిక** పంట సాగులేని సమయంలో ఎరువుల విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి రంగ నేతాజీ అన్నారు. గురువారం ఆయన ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా ఏప్రిల్ మాసంలో పంటలేని సమయంలో యూరియా అమ్మకాలు జరిపినట్లు తనిఖీలలో తెలుసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. యూరియా అమ్మకాలు సంబంధించిన బిల్లులు, అమ్మకాలకు సంబంధించిన రికార్డులు సరైన విధంగా లేని కారణంగా ఎరువుల దుకాణానికి ఈనెల 25వ తేదీ వరకు క్రయ విక్రయాలు జరుపకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎరువుల దుకాణం లైసెన్సును రద్దుచేసి అమ్మకాలను నిలుపుదల చేస్తామన్నారు. రాబోవు ఖరీఫ్ పంట కాలానికి సంబంధించి ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

# బందే షావలి దర్గాలో గంధం కార్యక్రమం



**చాగలమర్రి మే 7 నంది పత్రిక** మండల కేంద్రమైన చాగలమర్రిలో పెద్దమకాణం వీధిలో వెలసిన బందే షావలి, మాబు సుభాని, షాబు షావలి ఉరుసు మహోత్సవంలో భాగంగా గంధం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గురువారం కమిటీ సభ్యులు తెలిపారు. 6 న ఉరుసు, 7న గంధం, 8న భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. శుక్రవారం రాత్రి కర్ణాటక ఖవాలి బృందం భక్తి గీతాలు ఆలపిస్తారు.

# తండ్రి ఆశయంతో నడుస్తున్న భూమా జగత్ విఖ్యాత్... నాగరాజు యాదవ్



**చాగలమర్రి మే7నంది పత్రిక** స్వర్గీయ మాజీ ఎంపీ, శాసనసభ్యులు భూమా నాగిరెడ్డి ఆశయ సాధనలో నడుస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా యువ నాయకుడిగా ఎదుగుతున్నాడని తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో భూమా జగత్ విఖ్యాతి రెడ్డి జన్మదిన వేడుకలను యువ నాయకుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో కీలక పాత్ర వహించే నాయకుడిగా ఎదగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి రాష్ట్ర కార్యదర్శి నరసింహుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూసార పరీక్షల ఆధారంగా మందులు వినియోగించాలి . ధర్తీ మాత బచావో అభియాన్‌లో రైతులకు అవగాహన

**వెలుగోడు, మే 7 (నంది పత్రిక):** ధర్తీ మాత బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెలుగోడు ఆర్ఎస్కే పరిధిలో రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి స్వాతి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా మందులు వినియోగించాలని రైతులకు సూచించారు. అధికంగా యూరియా, డీఏపీ ఎరువులు వాడటం వల్ల నేల స్వభావం మారి, మొక్కలకు అవసరమైన పోషకాలు సరిగా అందవని వివరించారు. అలాగే పచ్చిరొట్ట పంటలు అయిన చీలికలు, పెల్లిపెసర, జనుము సాగు చేయడం మరియు పీఎండీఎస్ కిట్ల వినియోగం ద్వారా భూమి సారవంతం మెరుగుపడుతుందని తెలిపారు. రసాయన మందుల వినియోగాన్ని తగ్గించి నానో యూరియా, నానో డీఏపీ వినియోగించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చును. రైతులు సేంద్రియ శిక్షణను అనుసరించి భూమి ఆరోగ్యాన్ని కాపాడాలని అధికారులు కోరారు.



# బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి





**రాష్ట్రంలో రోజుకో ఎంఓయూ... వారానికో శంకుస్థాపన**
**వేగంగా పనిచేయాలి... అంతే వేగంగా అభివృద్ధి చూపించాలి**
**స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ స్లోగన్‌కే పరిమితం కాకూడదు**
**పబ్లిక్ రిలేషన్స్ ఎంత ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ అంతే ముఖ్యం**
**వినూత్నంగా ఆలోచిస్తే నిధుల కొరతను అధిగమించవచ్చు**
**జిల్లా కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి**
**కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా... ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం**
**7వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం**





**అమరావతిబ్యూరో చీఫ్ , మే 7నంది పత్రిక** అభివృద్ధి సహా వివిధ రంగాల్లో బెంచ్ మార్క్ సెట్ చేసేలా రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. రెండేళ్ల క్రితం రాష్ట్రం గురించి ఏం మాట్లాడుకునేవారో... ఇప్పుడేం మాట్లాడుకుంటున్నారో ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి గ్రామస్థాయి ఉద్యోగులను కూడా మోటివేట్ చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లే తీసుకోవాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో రెండు రోజులపాటు జరిగే 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పాలకుల నుంచి రూ. 9.74 లక్షల కోట్ల అప్పులు ప్రభుత్వానికి సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం డైవర్ట్ చేసింది. రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు కూడా గత పాలకులు మనపై రుద్దారు. గత పాలకుల నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలు పడిన రోడ్లతో విధ్వంసమైంది. అందరి సహకారంతో అలాంటి పరిస్థితి నుంచి గట్టెక్కి... వ్యవస్థలను గాడిలో పెట్టగలిగాం. ప్రజా ప్రతినిధులు-అధికారుల కలయికే ప్రభుత్వం. ప్రజాస్వామ్యంలో సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత. ఇప్పుడు సంక్షేమాన్ని, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. జీవన ప్రమాణాలు పెంచేలా పాలన సాగిస్తున్నాం. వివిధ పాలసీలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. ప్రజల సంతృప్తి స్థాయిని కొలమానంగా పెట్టుకుని పాలన అందిస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. "అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ వస్తోంది. మంత్రుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాప్రతినిధి, ఉద్యోగి వరకూ అంతా బాధ్యతగా ఉండాలి. వచ్చిన ఫిర్యాదులు వందశాతం పరిష్కారం కావాల్సిందే. ఆర్థికేతర ఫిర్యాదులను పరిష్కరించకుండా.. కొందరు పైకి కిందకు ఫైళ్లు తిప్పుతున్నారు... వాటిని తక్షణం పరిష్కరించాలి. ఆర్థికపరమైన ఫిర్యాదుల గురించి కూడా విచారణ చేసి సరైన వాటిని పరిష్కరించాలి. 2027 మార్చి నాటికల్లా రెవెన్యూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన కావాలి. సమస్య పరిష్కారం కోసం వినూత్నంగా ఆలోచనలు చేస్తే సుపరిపాలన అందించినట్టే. డబ్బులు లేవనడం కాదు... సంపద సృష్టికి పని చేయాలి... చేద్దాం. వెల్ఫేర్, డెవలప్మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఓ సైకిల్. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో భద్రత, భరోసా కల్పించాం. పీ4తో ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం. 26 కొత్త పాలసీలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ అంటే నమ్మకాన్ని కల్పించాం. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని డ్రైవ్ చేయడమనేది గర్వంగా ఉండేది. కాలేజీ రోజుల్లో ఎన్ ఫీల్డ్ డ్రైవ్ చేయడాన్ని గొప్పగా ఫీలయ్యేవాళ్లం. అలాంటి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థను ఏపీకి తెచ్చాం. రూ. 23 లక్షల కోట్ల ఎంఓయూలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల మేర ఉద్యోగాలు వస్తాయి. గ్రీన్ ఎనర్జీతో పాటు గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియా ఉత్పత్తి దిశగా ముందుకు వెళ్తున్నాం. డేటా, ఏఐ, క్వాంటం లాంటి టెక్నాలజీలకు ఏపీ కేంద్రంగా మారనుంది. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకోగలుగుతున్నాం. వేసవిలో దేశ ప్రజలను చల్లబరిచే ఏసీలు మన రాష్ట్రం నుంచే సరఫరా చేసే పరిస్థితికి వచ్చాం."అని సీఎం వివరించారు.

**బెస్ట్ ప్రాక్టీసెస్ అమలు చేసే కలెక్టర్లే నోడల్ ఆఫీసర్లు** "గత ప్రభుత్వం అనవసరంగా ప్రైవేటు భూములను నిషేధిత జాబితాలో పెట్టేసింది. కార్యాలయాల చుట్టూ తిరిగి ప్రజలు విసిగిపోతున్న పరిస్థితి ఉంది. భూముల విషయంలో జీరో ఎర్రర్ రికార్డులు తయారు చేయాలి. రోడ్లు, వంతెనలు, ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. ప్రతీ మూడు నెలలకూ నిర్వహించే కలెక్టర్ల సదస్సు మంత్రులు, అధికారులకు క్వార్టర్లీ పరీక్షలు. ప్రజల కోసం పనిచేసే వ్యక్తులు ఎవరికీ భయపడాల్సిన అవసరమే లేదు. పబ్లిక్ రిలేషన్స్ ఎంతో ముఖ్యమో... పబ్లిక్ డెలివరీ కూడా అంతే ముఖ్యం. లాస్ట్ మైల్ లో ఉండే ఉద్యోగిని కూడా మోటివేట్ చేస్తే అద్భుతంగా పని చేయగలరు. విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చి 0.30 పైసల మేర కొనుగోలు వ్యయం తగ్గించాం. మరో 0.30 పైసలు త్వరలోనే తగ్గిస్తాం... తొలిసారి ట్రూ డౌన్ చేయగలిగాం. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాం... ఆన్ లైన్ లో పన్నులు కట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పదో తరగతి టాపర్ల ఫోటోలతో యాడ్ ఇచ్చాం. ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని చాటి చెప్పాం. డిమాండ్ డ్రివెన్ అగ్రికల్చర్, ఆక్వా కల్చర్ దిశగా అడుగులు వేస్తున్నాం. అన్ని రంగాల్లో... అన్ని వ్యవస్థల్లో ఏపీ పనితీరు బెంచ్ మార్క్ గా మారాలి. జిల్లాలు, కలెక్టర్ల మధ్య అభివృద్ధిలో పోటీ ఉండాలి. జిల్లాల్లో అమలు చేసే ఉత్తమ పద్ధతులను బెస్ట్ ప్రాక్టీసెస్ మిగతా జిల్లాల్లోనూ అమలు చేస్తాం... ఆ కలెక్టర్లనే వాటికి నోడల్ ఆఫీసరుగా పెడతాం. సీయింగ్ ఇజ్ బిలీఫ్ అనే విధానంలో 3 రోజుల కార్యదర్శులు, 6 రోజులు హెచ్వోడీలు, 8 రోజులు కలెక్టర్లు ఫీల్డ్ కు వెళ్లాలి. సామాజిక మాధ్యమాలను సక్రమంగా వినియోగించుకోవాలి. రిజల్ట్ ఓరియేంటేషనుతో ప్రతి ఒక్కరూ పని చేయాలి. ఆఫీస్ టెల్స్ యూ డేటా... ఫీల్డ్ టెల్స్ యూ ట్రూత్.. దీన్ని గుర్తు పెట్టుకోవాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ఈజ్ నాట్ స్లోగన్... గవర్నెన్స్ డిసైడ్స్ ద స్పీడ్ ఆఫ్ గ్రోత్. ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్.. అప్పుడే ప్రజలకు మంచి సేవలు అందుతాయి."అని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## టేకు దుంగల అక్రమ రవాణా కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్



**మంచిర్యాల జన్నారం బ్యూరో చీఫ్ మే 7:నంది పత్రిక** జన్నారం మండలం కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని ఇంధన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్‌లో టేకు దుంగల అక్రమ రవాణా కేసులో అరెస్టు చేసిన నిందితుడు లవుడ్యా హరికృష్ణను లక్షెట్టిపేట న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఇంధన్‌పల్లి ఎఫ్ఆర్వో లక్ష్మీనారాయణ గురువారం సాయంత్రం తెలిపారు.ఫారెస్ట్ అధికారుల సమాచారం మేరకు, నిందితుడు కారులో టేకు దుంగలను అక్రమంగా రవాణా చేయడంతో పాటు తన ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచినట్లు విచారణలో వెల్లడైంది. విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఫారెస్ట్ సిబ్బంది దాడులు నిర్వహించి టేకు దుంగలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.అనంతరం నిందితుడిపై అటవీ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి లక్షెట్టిపేట కోర్టులో ప్రవేశపెట్టగా, కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. అటవీ సంపదను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎఫ్ఆర్వో లక్ష్మీనారాయణ హెచ్చరించారు.అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన ప్రజలు వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్వో రవి, రాజేశ్వర్, ఎఫ్‌బీవో శ్రీనివాస్, బేసిక్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్యకర్తలకు భీమా కల్పించిన ఏకైక పార్టీ తెలుగుదేశం

**స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి**
**కార్యకర్తలకు అన్నివేళలా అందుబాటులో ఉంటా**
**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్,ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

**రంపచోడవరం బ్యూరో చీఫ్ మే 7నంది పత్రిక** కార్యకర్తలకు త్యాగాలను వెలకట్టలేమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఎటపాక మండలం గన్నవరంలో మండల పార్టీ అధ్యక్షులు బొల్లా పుల్లయ్య అధ్యక్షతన గురువారం మండల పార్టీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశం అన్నారు. కార్యకర్తల త్యాగాలను గుర్తించి వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే కార్యకర్తలకు ఎదురయ్యే ప్రతీ విషయాన్ని మండల స్థాయిలో నాయకత్వానికి తెలియ జేయాలన్నారు. అక్కడ పరిష్కారం కాకపోతే తన దృష్టిలో పెడితే పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఐకమత్యంతో సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గత వైకాపా ప్రభుత్వం హయాంలో ఏమి చేసింది ప్రస్తుతం మన కూటమి ప్రభుత్వం ఏమి చేస్తుందో అనేది క్షుణ్ణంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతీ కార్యకర్త యొక్క పనితనాన్ని నేను చూస్తానని కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం ఇస్తామన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టిలో పెట్టాలని సూచించారు. సాధ్యమైనంత వరకూ పరిష్కార చర్యలు చేపడతామన్నారు.

**మొక్కుబడులు తీర్చు కున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**

కోరిన కోర్కెలు తీర్చే దైవం కార్తికేయ శివుడు అని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. ఎటపాక మండలం గన్నవరం కార్తికేయ శివాలయంలో గురువారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటపాకలో గురువారం ఆమె నియోజక వర్గ పార్టీ పరిశీలకులు వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ సౌజన్యం లో పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె గతంలో మొక్కుకున్న మొక్కను ఆమె తీర్చుకున్నారు. శివాలయానికి విచ్చేసిన ఆమెకు పురోహితులు ఆచారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. అనంతరం ప్రత్యేక పూజాధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శివాలయ దర్శనం చేసుకున్న ఆమెకు ఆలయ కమిటి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**మండల పార్టీ అధ్యక్షులు పెళ్ళి రోజు శుభాలు చెప్పిన ఎమ్మెల్యే** ఎటపాక తెదేపా మండల పార్టీ అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, రమాదేవి దంపతులకు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి శుభాకాంక్షలు తెలిపారు. ఎటపాక మండలం లో గురువారం నియోజక వర్గ పార్టీ పరిశీలకులు వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్ సౌజన్యం లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మండల పార్టీ అధ్యక్షులు బొల్లా పుల్లయ్య,రమాదేవి దంపతులకు పెళ్ళిరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ వేడుకల్లో పాల్గొన్నారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో సకల శుభాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వాడపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి కనితి మధు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు. సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్, అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యులు గోడేటి భగవతి కుమారి, రాష్ట్ర నాయకులు మువ్వా శీను. రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, గార్లపాటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు కిలారి వెంకన్న, పాటి చలపతిరావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు, తెలుగు యువత అధ్యక్షులు నలజాల మధు, పాటి సంపత్, నలజాల శ్రీకాంత్ చౌదరి, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు ముత్యం సురేష్ గౌడ్, ఎంపీటీసీ పాయం దేవి, మాజీ ఎంపీపీ శ్యామల, మాజీ జెడ్పిటిసి రవికుమార్ అమర వరపు రాము తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ఆళ్లగడ్డప్రతినిధి మే 7,నంది పత్రిక** టీడీపీ యువనాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. సిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సిరివెళ్ల టీడీపీ సీనియర్ నాయకులు సురా రామా, భూమా యూత్ నాయకులు బి ఎం డి రఫీ , గౌండ యునుస్ భాష ల ఆధ్వర్యంలో గురువారం సిరివెళ్ళ మెట్లమీద ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చక్రి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేవి శెట్టి హరీష్ బాబు, కిరనా మర్చంట్ అధ్యక్షులు సాయి చరణ్, చక్రవర్తి నిచ్చెన మెట్ల రామయ్య అలాగే గోవింద పల్లె టీడీపీ సీనియర్ నాయకులు జీవి రవిరెడ్డి, వీరారెడ్డి పల్లె టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు రెడ్డి సిరివెళ్ల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## తమిళనాడు రాజకీయాలపై డీకే శివకుమార్ హాట్ కామెంట్స్

నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం నిరాకరిస్తూ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీసుకున్న నిర్ణయంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. గవర్నర్ చర్య పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు.గురువారం బెంగళూరులోని విధాన సౌధలో విలేకరులతో మాట్లాడుతూ, సంఖ్యాబలం ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించి, మెజారిటీ నిరూపించుకోకుండా అడ్డుకునే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేశారు. "ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను అడ్డుకునే అధికారం తమిళనాడు గవర్నర్‌కు ఏమాత్రం లేదు. ఆయన ప్రవర్తన సరైనది కాదు" అని డీకే శివకుమార్ అన్నారు.గతంలో కర్ణాటక, జాతీయ స్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలను ఆయన గుర్తుచేశారు. కర్ణాటకలో మాజీ సీఎం యడియూరప్పను, కేంద్రంలో అటల్ బిహారీ వాజ్‌పేయిని అతిపెద్ద పార్టీలుగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసేందుకు గవర్నర్లు, రాష్ట్రపతులు అవకాశం కల్పించారని తెలిపారు. మాజీ రాష్ట్రపతులు కేఆర్ నారాయణన్, ఏపీజే అబ్దుల్ కలాం కూడా ఇదే విధానాన్ని అనుసరించారని చెప్పారు. అదేవిధంగా, తమిళగ వెట్రి కళగం పార్టీకి కూడా మెజారిటీని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. "ఇదే ప్రజాస్వామ్యం. ఒక్క ఓటు కూడా మెజారిటీని లేదా మైనారిటీని నిర్ణయించగలదు. ఒకవేళ వారు మెజారిటీ నిరూపించుకోలేకపోతే, అప్పుడు తదుపరి ప్రత్యామ్నాయాన్ని పరిశీలించవచ్చు. రాష్ట్ర ప్రజల మనోభావాలను, వారి తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలి" అని శివకుమార్ హితవు పలికారు.

## మహిళా చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలి: డి.ఎస్.పి శ్రీనివాసరావు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మే 7నంది పత్రిక** ప్రస్తుత సమాజంలో మహిళలు తమ హక్కులు మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆళ్లగడ్డ డిఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆళ్లగడ్డమున్సిపాలిటీ పరిధిలోగల తిట్కో గృహ సముదాయాల వద్ద మహిళల భద్రత మరియు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని పట్టణ ఎస్సై పీరయ్య నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్పి శ్రీనివాసరావు పాల్గొని మహిళల హక్కులు మరియు చట్టాలపై అవగాహన కల్పించడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే తమకు అందించాలని ప్రజలను కోరారు. టిడ్కో గృహ సముదాయాల వద్ద అన్ని వసతులు ఉన్నప్పటికీ చిన్నచిన్న సమస్యలకే పోలీస్ స్టేషన్ల వరకు రాకుండా ఇక్కడ ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని టిట్కో ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దెందులూరులో మెగా క్రీడా సంబరాలకు శ్రీకారం





**'చింతమనేని ప్రీమియర్ లీగ్' ద్వారా దెందులూరులో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహణ - క్యాంపు కార్యాలయంలో సీపీల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్..**

**క్రీడా స్ఫూర్తితో పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించాలని నిర్వాహకులకు పిలుపు..**

**క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ - ప్రజా సమస్యల స్వీకరణ**

**దుగ్గిరాల (క్యాంపుబ్యూరో చీఫ్ కార్యాలయం), మే7 నంది పత్రిక** యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు మరియు వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 'చింతమనేని ప్రీమియర్ లీగ్' (సిపిల్ )క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి లీగ్‌లు నిర్వహించడం శుభపరిణామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి దెందులూరు హైస్కూల్ గ్రౌండ్లో ఈ క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ లీగ్ నిర్వాహకులు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి పెనుబోయిన మహేష్ యాదవ్ ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు క్రమశిక్షణతో ఆడి, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయిలో ఏ క్రికెట్ టీం లైనా కూడా వచ్చి పాల్గొనవచ్చు అని, గెలుపొందిన జట్లకు భారీ నగదు బహుమతులతో పాటు ఆకర్షణీయమైన ట్రోఫీలను అందించనున్నట్లు వెల్లడించాం . మొదటి విజేతగా నిలిచిన జట్టుకు రూ.ఒక లక్ష 11 వేల 111 రూపాయలు బహుమతిగా అందించడం జరుగుతుందని, రెండవ జట్టు విజేతకు రూ.55,555/- , అదేవిధంగా బెస్ట్ బ్యాట్స్మెన్, బెస్ట్ బౌలర్, హ్యాట్రిక్, ఇలా అనేక అంశాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రత్యేకంగా బహుమతి ప్రధానం కూడా చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ యువతకు పిలుపునిచ్చారు. టోర్నమెంట్లో పాల్గొనేవారు మరిన్ని వివరాల కోసం 6300598229, 9885509845 నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. విద్య, వైద్యం, మరియు మౌలిక వసతులకు సంబంధించిన పలు సమస్యలను బాధితులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగా.. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన, తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్పర్సన్ గారపాటి రామసీత, కూటమి నాయకులు ఇప్పిలి వెంకటేశ్వరరావు, కొనకళ్ళ శివమణి, తానంకి సురేష్ సహా పలువురు కూటమి నాయకులు, సిపిఎల్ నిర్వహక టీం సభ్యులు పాల్గొన్నారు..



# మద్దతు లేఖలే అసలు సమస్య

**మెజార్టీ కోసం ప్రయత్నించని విజయ్**

**గతంలోనూ అనేక రాష్ట్రాల్లో ఇదే సమస్య**

**గవర్నర్ల విచక్షణ మేరకు నిర్ణయాలు**

తమిళనాట రాజకీయ అనిశ్చితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. స్పష్టమైన మెజార్టీ లేక తిప్పలు పడుతోంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే, గతంలోనూ పలు రాష్ట్రాల్లో హంగ్ వచ్చినప్పుడు. గవర్నర్ ఆదేశాలతో మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలున్నాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే.. గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించి సరైన అభ్యర్థిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అలా గత దశాబ్దంన్నర కాలంలో ఐదు రాష్ట్రాల్లో ఇలాంటి మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే..! 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపా-శివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి. 2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గట్టెక్కింది. అదే ఏడాది (2017) మణిపుర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు. దీంతో బీరేన్ సింగ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మణిపుర్‌లో మొత్తం 60 శాసనసభ స్థానాలున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 70 శాసనసభ స్థానాలుండగా.. 2013లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. 31 సీట్లతో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఆమ్ ఆద్మీ పార్టీకి 28, కాంగ్రెస్‌కు 8 సీట్లు దక్కాయి. నాడు సంఖ్యాబలం లేకపోవడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు భాజపా ముందుకు రాలేదు. ఆ తర్వాత గవర్నర్.. ఆమ్ ఆద్మీ పార్టీని ఆహ్వానించారు. దీంతో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో మైనార్టీ ప్రభుత్వం ఏర్పాటైంది. నాడు ఆయనకు కాంగ్రెస్ వెలుపలి మద్దతు ప్రకటించింది. అయితే, ఈ ప్రభుత్వం ఎన్నో రోజులు నిలవలేదు. 49 రోజుల తర్వాత కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో దిల్లీలో రాష్ట్రపతి పాలన ఏర్పడింది. ఆ తర్వాత 2015లో మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. ఆమ్ ఆద్మీ పార్టీ ఘన విజయం సాధించింది.

# రాజ్యాంగేతర శక్తిగా తమిళ గవర్నర్ వ్యవహారం

**ప్రజాతీర్పును గౌరవించకపోవడం అవమానం**

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపాటు**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకేను ప్రజలు గెలిపిస్తూ తీర్పు ఇచ్చారని.. దానిని ఆ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ అగౌరవపరుస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న తమిళనాడు గవర్నర్.. ప్రజా తీర్పును గౌరవించాలని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో టీ పీసీసీ చీఫ్ మాట్లాడారు. 108 స్థానాలు గెలిచి సింగిల్ లా÷-జర్గ÷స్ట్ పార్టీగా అవతరించిన టీవీకేను ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించక పోవడం దురదృష్టకరమని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు. గవర్నర్ తీరు రాజ్యాంగ స్ఫూర్తిని సమాధి చేసేదిగా ఉందన్నారు. గవర్నర్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు.. ఢిల్లీలో బీజేపీ హైకమాండ్ నుంచి వస్తున్నాయనే అనుమానం తనకు కలుగుతుందన్నారు. సింగిల్ పార్టీకి అవకాశమివ్వాలని సర్కారియా కమిషన్‌తోపాటు ఎస్ఆర్ బొమ్మై కేసులో సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టంగా చెబుతున్నాయని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ వివరించారు. గవర్నర్‌కు రాజ్యాంగం చదవడం తెలియదా? లేక రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తించాలనే ఉద్దేశపూర్వకంగా ఆయన ఇలా చేస్తున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. తమిళనాడులో గవర్నర్ ద్వారా పాలించాలని బీజేపీ చూస్తోందని టీపీసీసీ చీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 59 సంవత్సరాల ద్రావిడ పార్టీల పాలనకు ప్రజలు చెక్ పెట్టిన.. దానిని అడ్డుకోవడానికి గవర్నర్‌ను ఆయుధంగా వాడుకుంటోందంటూ బీజేపీపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ మద్దతు ప్రకటించిన తర్వాత కూడా టీవీకే పార్టీకి అవకాశం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన వ్యాఖ్యానించారు. కేరళ పర్యటన పేరుతో మరింత జాప్యం చేయడం యాదృచ్ఛికం కాదు.. కుట్ర రాజకీయాల్లో భాగమే అంటూ గవర్నర్ తీరును ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ ఎండగట్టారు. విజయ్ రెండుసార్లు రాజ్‌భవన్‌కు వెళ్ళినా వట్టి చేతులతో తిరిగి రావడం చూస్తే గవర్నర్.. రాజ్యాంగ పదవిలో ఉన్న బీజేపీ గేట్‌కీపర్ అని స్పష్టమవుతోందని వ్యంగ్యంగా అన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ హోదా నామ మాత్రమే.. విచక్షణాధికారాన్ని బీజేపీ కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగ ద్రోహం చేయడమేననిఈసందర్భంగా గవర్నర్ తీరును ఆయన ఎండగట్టరు.కోట్లమంది ఓట్లు వేసి విజయ్ పార్టీని గెలిపిస్తే.. వారి కలలను గవర్నర్ రాజ్‌భవన్‌లో బంధించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మహేశ్ కుమార్ గౌడ్ అభివర్ణించారు.

# తమిళనాట మళ్లీ రిసార్ట్ రాజకీయాలు

**ఎమ్మెల్యేలను రిసార్టుకు తరలించిన ఎఐడిఎంకె**

**అద్భుతం జరగోతోందన్న ఎఐడిఎంకె నేత అన్బళగన్**

తమిళనాడు రాజకీయ వేదికపై మళ్ళీ 'రిసార్టు రాజకీయాలు' వేడెక్కాయి. గత కొద్దిరోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ, ఎఐడిఎంకె త్వరలోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అన్బళగన్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎవరూ ఊహించని విధంగా ఒక 'అద్భుతం' జరగబోతోందని ఆయన వ్యాఖ్యానించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అన్బళగన్ మీడియాతో మాట్లాడుతూ.. 'మాకు ప్రస్తుతం 118 మంది ఎమ్మెల్యేల మద్దతు లభిస్తోంది. రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యబద్ధంగా మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. అందరినీ ఆశ్చర్యపరిచే విధంగా ఇతర పక్షాల మద్దతు కూడా మాకు లభించబోతోంది' అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఏర్పాటు దిశగా పావులు కదుపుతున్న ఎఐడిఎంకె, తమ ఎమ్మెల్యేలు చేజారిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే రాష్ట్రంలో క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. సీనియర్ నేతల పర్యవేక్షణలో సుమారు 27 మంది ఎమ్మెల్యేలు పుదుచ్చేరిలోని ఒక ప్రైవేట్ రిసార్టుకు చేరుకున్నారు. సీవీ షణ్ముగం నేతృత్వంలో మిగతా ఎమ్మెల్యేలను మరొక రహస్య ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. తమ ఎమ్మెల్యేలపై ఒత్తిడి రాకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అన్బళగన్ చెప్పిన ఆ 'అద్భుతం' ఏ రూపంలో ఉండబోతోంది? అనేది హాట్ టాపిక్ గా ఉంది.

# గతానుభవాలను గవర్నర్ గుర్తించాలి

**విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించాలి**

**తమిళ నటుడు విశాల్ వ్యాఖ్యలు**

ప్రస్తుతం తమిళనాడులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 2017-18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఎ÷-లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తమిళనాడులో 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉందని, ఇలాంటి సమయంలో గవర్నర్ పాలన కాదని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే కావాలని విశాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని విశాల్ ప్రశ్నించారు. ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని, ప్రజలకు కూడా తెలుసని విశాల్ అన్నారు. విజయ్ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని, తాను కూడా అదే కోరుకుంటున్నానంటూ విశాల్ తన మద్దతు ప్రకటించారు.

# ధాన్యం కొనుగోళ్లలో దబాయింపులు !

ఏటా దేశంలో ధాన్యం కొనుగోళ్లు అన్నది ఓ పజిల్‌గా మారింది. పెద్ద ఎత్తున ధాన్యం కొంటున్నామని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రకటిస్తుంటాయి. క్షేత్రస్థాయిలో మాత్రం అది కానరావడం లేదు. తెలుగు రాష్ట్రాలనే తీసుకుంటే ధాన్యం కొనండి అని రైతులు లబోదిబోమంటున్నారు. అయినా కొనుగోళ్లు పెద్ద ఎత్తున ఎక్కడా కానరావడం లేదు. దీనికితోడు అకాల వర్షాం రైతుల నెత్తిన పిడుగు పడేసింది. ఇటీవలి అకాల వర్షం నిండా ముంచింది. అన్నదాత రెక్కలకష్టాన్ని నీళ్లపాల్జేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పలుప్రాంతాల్లో పడిన వర్షం దాటికి, మార్కెట్ యార్డుల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పలు గ్రామాల్లో తీవ్రమైన గాలులతో అకాల వర్షం కురవడంతో మంథని మార్కెట్ యార్డుతోపాటు ఆయా మండలాల్లోని వ్యవసాయ ధాన్యమంతా మట్టిలో కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. పదిహేను రోజుల కిందటే కోతలు కోసి, ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి కొనుగోళ్ల కోసం పడిగాపులు పడుతున్న తరుణంలో కోలుకోలేని దెబ్బతీసింది. కొనుగోళ్లు వేగంగా చేస్తే తమ ధాన్యం తడిసేది కాదని కుప్పల చుట్టూ వర్షం నీటిని చూపిస్తూ రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. తడిసి ముద్దయిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని మంత్రులు, అధికారులు పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్, ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అసలు ధాన్యమే కొనడం లేదని తెలంగాణలో బిఆర్ఎస్ ఆరోపిస్తోంది. మక్కల కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. కొన్నిచోట్ల రైతులు కుప్పలమీదే ప్రాణాలు వదిలిన ఘటనలు చూస్తున్నాం. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటామని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. బిఆర్ఎస్ విష ప్రచారం చేస్తోందన్నారు. ఎపిలో కూడా ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతు న్నాయని మంత్రి అచ్చన్నాయుడు చెబుతున్నారు. మరి లోపం ఎక్కడో తెలియడం లేదు. కేంద్రం కూడా దేశంలో ఏయే పంటలు పండుతున్నాయో, వాటిని ప్రజలకు చేర్చడమెలా అన్నది ఆలోచన చేయడం లేదు. పంటులు బాగానే పండుతున్నాయి. గోదాముల్లో ఫుల్లుగా ఉంటున్నాయి. రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ప్రజలకు ధరలు అందుబాటులో ఉండడం లేదు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించి పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో కానరావడం లేదు. పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో గోధుమల సేకరణ ఎక్కువగా జరుగుతుంది. అక్కడి ధరలు ఎంఎస్‌పీకి చేరువగా ఉంటాయి. గోధుమల సేకరణ పరిమితంగా ఉండే రాష్ట్రాల్లో మాత్రం ధరలు పడిపోతుంటాయి. ఈ అసమానత రైతులు సంపాదించే దానికి, వినియోగ దారుడు చెల్లించే దానికి మధ్య అంతరాన్ని మరింతగా పెంచుతోంది. మార్కెట్ నియంత్రణ సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ఇదేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నాయి. వినియోగ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో ధరల పర్యవేక్షణ విభాగం ఉంటుంది. అయితే అది కేవలం సమాచారాన్ని సేకరిస్తోందా లేక అడ్డూ అదుపూ లేని ధరలను నియంత్రిస్తోందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. గోధుమల ధర తగ్గితే రైతుకు గిట్టుబాటు ధర లభించదు. వినియోగదారుడికీ ఉపశమనం కలగదు. మరి ప్రయోజనం పొందేది ఎవరు? మధ్యలో ఉన్న కొద్ది మంది దళారులు మాత్రమే. పంజాబ్, హర్యానాల్లో గోధుమలు బాగా పండిస్తారు. గోధుమల ధర తగ్గితే సహజంగానే గోధుమ పిండి ధర కూడా తగ్గుతుంది. తద్వారా ప్రజలకు ఊరట లభిస్తుంది. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా గోధుమల ధరలు తగ్గినప్పటికీ దాని ప్రభావం ఎక్కడా కన్పించడం లేదు. రైతులు గోధుమలను కనీస మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సి వస్తున్నప్పటికీ మార్కెట్‌లో గోధుమ పిండి, బ్రెడ్ ధరలు మాత్రం దిగిరావడం లేదు. వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ చెబుతున్న దాని ప్రకారం ఇటీవలి కాలంలో గోధుమల ధరలు గణనీయంగా పడిపోయాయి. ఈ నెలలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని హోల్‌సేల్ మండీల్లో కిలో గోధుమల ధర రూ.23 నుంచి రూ.25 మధ్య నడుస్తోంది. చాలా వరకూ కిలో ధర రూ.25.85 పలికినప్పటికీ అది ఎంఎస్‌పీ కంటే తక్కువగానే ఉంది. గత సంవత్సరం నరేంద్ర మోడీ ప్రభుత్వం గోధుమల కనీస మద్దతు ధరను క్వింటాలుకు రూ.160 పెంచి రూ.2,585గా నిర్ణయించింది. 2024-25లో ఇది రూ.2,425గా ఉంది. గోధుమల ధర తగ్గినప్పుడు సహజంగానే పిండి ధర కూడా తగ్గాలి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. దేశవ్యాప్తంగా రిటైల్ మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.36 నుంచి రూ.40 మధ్య పలుకుతోంది. బ్రాండెడ్ ఉత్పత్తుల విషయానికి వస్తే కిలో ధర రూ.40 నుంచి రూ.50 మధ్య నడుస్తోంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తున్న దాఖలాలు కూడా ఉన్నాయి. ఇది రైతుకు నష్టమా లేక వినియోగదారుడికి లాభమా లేక వినియోగదారుడి పేరుతో వేరెవరైనా లాభాలు గడిస్తున్నారా అన్నదే ఇక్కడ ప్రశ్న. గోధుమ పిండి ధర పెరిగినప్పుడు మిల్లు యజమానులు, కంపెనీలు ఆ భారాన్ని వినియోగదారుల నెత్తిన వేస్తాయి. కానీ పిండి ధర తగ్గినప్పుడు ధరలను తగ్గించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. లాభాల మార్జిన్‌ను కాపాడుకోవడానికి, వీలైతే దానిని మరింతగా పెంచుకోవడానికి వీలుగా వారు ఇలా వ్యవహరిస్తుంటారు. దేశంలో ప్రతి పంట పరిస్థితి ఇలాగే ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, మక్క రైతులు నాన కష్టాలు పడుతున్నారు. దీనికంతటికి కొనుగోలు విధానాలు, మద్దతు ధరల విధానాలు సక్రమంగా లేకపోవడమే అని గుర్తించాలి. దీనిని సంస్కరిస్తే తప్ప రైతులకు, వినోగదారులకు మనశ్శాంతి ఉండదు.

## 12న అసోంలో ప్రభుత్వ ఏర్పాటు

అస్సాంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఎ ఘన విజయం సాధించింది. దీంతో అక్కడ వరుసగా మూడోసారి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రానుంది. మే 12న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కొలువుదీరనుందని అస్సాం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కోటా వెల్లడించారు.

# ప్రతిపక్షమా.. నిన్ను నీవు చదువుకో!

నడుస్తున్న చరిత్రలో ఎన్నికల ప్రకరణం ఒకటి ముగిసింది. భారత ప్రజాస్వామిక ప్రతిపక్షానికి ఒక పరీక్షా ఘట్టం ప్రారంభమయింది. అవును, ప్రతిపక్షం ఆత్మశోధన చేసుకోవల్సిన సమయమిది. కఠోర సత్యాలను ఎదుర్కోవల్సిన సందర్భమిది. ప్రశ్నలు, నిస్సంశయంగా కఠిన ప్రశ్నలు, మనస్తాపం కలిగించే ప్రశ్నలు వేసుకోవల్సిన అగత్యమిది. రెండు సంవత్సరాల క్రితం లోక్‌సభ ఎన్నికలలో ప్రజల తీర్పు ఆశ్చర్యకరంగా ప్రతిపక్షానికి ఒక అవకాశాన్ని సమకూర్చింది. అయితే తదాది ఆ అవకాశం అంతకంతకూ కృశించిపోతోంది. ఇప్పుడు పూర్తిగా లేకుండా పోయింది. జాతీయ ఆధిపత్యం, సంపూర్ణ అధికారం అనే తన దీర్ఘకాలిక లక్ష్యసాధనలో భారతీయ జనతా పార్టీ ఒక ప్రముఖ మైలురాయిని దాటింది. పశ్చిమ బెంగాల్‌ను బీజేపీ చరిత్రాత్మకంగా గెలుచుకోవడం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అది బీజేపీకి ఒక గొప్ప ముందడుగు, సందేహం లేదు. అయితే వర్తమాన భారతదేశ ఎన్నికల సమగ్రతకు (ఇంకా ఏమైనా మిగిలివుంటే) అదొక తిరుగులేని తిరోగతి కూడా. ఈ చివరి రెండు మాటలలోని నామవాచకాన్ని మనసును స్థిమితం చేసుకుని అంగీకరిద్దాం; దానికి ముందున్న విశేషణం శాశ్వత నిజం కాబోదని ఆశిద్దాం, కాకుండా ఉండేందుకు సంకల్పిద్దాం. కేరళ, తమిళనాడు ఎన్నికల ఫలితాలు ఆ కఠోర సత్యం నుంచి మన దృష్టిని మళ్లించలేవు. కేరళలో జరిగిందేమిటి? పదేళ్ల క్రితం వరకూ ప్రతి ఐదేళ్లకొకసారి ఓటర్లు ప్రత్యామ్నాయ పార్టీని ఎన్నుకుంటూ ఉండేవారు. అలా కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ లేదా సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ ప్రతి ఐదేళ్లకొకసారి ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తుండేవి. ఏ ఒక్క కూటమీ వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చేది కాదు. 2021లో ఎల్‌డీఎఫ్ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. 2026లో ఆ అరుదైన ఆనవాయితీకి భంగం కలిగింది. ఈసారి యూడీఎఫ్ అధికారంలోకి వచ్చింది. అంటే కేరళ రాష్ట్ర విశిష్ట రాజకీయ సంప్రదాయం ప్రతిసారీ ప్రత్యామ్నాయ పార్టీని ఎన్నుకోవడం పునరుద్ధరణ అయింది. ఇది శుభ పరిణామమే. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వ పాలన పట్ల ప్రజల అసంతృప్తి ఈ ఎన్నికల తీర్పులో పూర్తిగా ప్రతిబింబించింది. తమిళనాడులో విజయ్ టీవీకే మహావిజయం ఆశ్చర్యకరం. వర్తమాన భారతదేశంలో నిజమైన అద్భుత రాజకీయ పరిణామమది. అయితే మరొక రాష్ట్రంలో సుసాధ్యంకాని సఫల నమూనా అది. డీఎంకే సర్వాధిపత్యం తమిళులకు వెగటు కలిగించింది. ప్రత్యామ్నాయానికి ఆరాటపడ్డారు. చీలికలతో కునారిల్లి, మళ్లీ సుసంఘటితమైన అన్నాడీఎంకే తాము కోరుకునే ప్రత్యామ్నాయ పాలననందించలేదని తమిళులు భావించారు. పైగా, తమిళనాడు రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరించే బీజేపీతో అన్నాడీఎంకే అంటకాగడాన్ని తమిళులు సుతరామూ అంగీకరించలేకపోయారు. ద్రావిడ భావజాలాన్ని గౌరవిస్తూ డీఎంకే రాజకీయ నమూనాకు భిన్నంగా ఉండే పార్టీని తమిళ ఓటర్లు కోరుకున్నారు. ఎమ్‌జీఆర్ స్ఫూర్తితో ఆయన బాటలో నడయాడుతూ ప్రజారంగంలోకి వచ్చిన తమ ఆరాధ్య నటుడు విజయ్ పార్టీకి పట్టంకట్టి తమిళ ప్రజలు కొత్త చరిత్రకు నాంది పలికారు. డీఎంకే తన 'రాజకీయ ప్రత్యర్థి' అని, బీజేపీ 'భావజాల విరోధి' అని స్పష్టం చేస్తూ తాను సదా పెరియార్, కామరాజ్, అంబేద్కర్ ఆదర్శాల స్ఫూర్తితో వారి అడుగుజాడల్లో నడుస్తానని విజయ్ ప్రకటించడం తమిళ ప్రజలను బాగా ఆకట్టుకున్నది. తమిళ రాజకీయాల స్వతస్సిద్ధ సంప్రదాయాలకు సరికొత్త విశిష్ట ప్రతీకగా భాసిల్లిన విజయ్‌కు అధికారం అప్పగించేందుకు తమిళులకు అభ్యంతరం లేకపోయింది. పర్యవసానమే తమిళనాట పెనుమార్పు. అసోంలో బీజేపీకి లబ్ధి సమకూరేలా నియోజకవర్గాల సరిహద్దులను ఎన్నికల సంఘం మార్చివేసింది. ఆ నియోజకవర్గాల పునర్విభజన మత ప్రాతిపదికన జరిగిందన్నది ఒక చేదు సత్యం. భారతదేశ ఎన్నికల చరిత్రలో మున్నెన్నడూ సంభవించని పరిణామమది. ఆ కారణంగానే ఎవరూ ఓటు వేయకముందే పది సీట్లను బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. సరే, ముఖ్యమంత్రి హిమంతశర్మ వాగరిలో మతవిద్వేషం కాక మరేముంటుంది? 'మియాన్' సామాజికవర్గానికి వ్యతిరేకంగా ఆయన పేలిన అవాకులు చెవాకులను ఎన్నికల సంఘమేకాదు, సర్వోన్నత న్యాయస్థానమూ మౌనంగా వింటూ ఉండిపోయింది. మరి ప్రతిపక్షం ఏమి చేసింది? ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. పాలక పక్షంపై పోరాడేందుకు రాజకీయ సంకల్పం చూపిందా? లేదు. ముఖ్యమంత్రిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. వాటిపై ఆయనను నిలదీసిందా? లేదు కదా. గాయకుడు జుబిన్ గర్గ్ మరణం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక భావోద్వేగ అంశమయింది. ప్రతిపక్షం ప్రతిస్పందన ఏమిటి? సత్యశోధన చేసి ఆ గాయకుడి అభిమానులకు ఊరట కల్పించిందా? సరి సరి. పాలక పక్షాన్ని ఎదుర్కోవడంలో అసోం ప్రతిపక్షం వ్యవహరించిన వైనం ఎన్నికల్లో ఓడిపోవడం ఎలా అనే విషయానికి ఒక ప్రశస్త పాఠ్యపుస్తకం సుమా! బెంగాల్‌లో ప్రతిపక్షం అసోం విపక్షం వలే బలహీనంగా లేదు. బీజేపీకి బలమైన సవాల్ విసరలేదని మమతా బెనర్జీని ఎవరూ ఆక్షేపించలేరు. ఆమెకు ఒక స్పష్టమైన వ్యూహం ఉన్నది; దానిని పటిష్ఠంగా అమలుపరచగల సామర్థ్యమూ ఉన్నది; ఎదురులేకుండా దూసుకొస్తోన్న బీజేపీని నిలువరించగల తృణమూల్ కాంగ్రెస్ రూపేణా సంస్థాగత శక్తియుక్తులూ ఉన్నాయి. నిజమే, బెంగాల్‌లో ప్రతిపక్షాలు సమైక్యంగా లేవు. అయితే ఈ ప్రతికూల పరిస్థితి మమతకు అనుకూలతగా పరిణమించింది. వామపక్షాలు వేర్వేరుగా పోటీ చేశాయి. ఇక కాంగ్రెస్‌తో మమత పార్టీకి వాటిల్లిన నష్టం స్వల్పమైనదే. వాస్తవాలను అవును.. కఠోర వాస్తవాలను సూటిగా, నిశితంగా చూద్దాం. డొంక తిరుగుడుగా కాకుండా నిక్కచ్చిగా చెప్పుకుందాం. 'ప్రభుత్వ వ్యతిరేకత' అనేది గణనీయంగా లేనిపక్షంలో మమతకు, ఆమె పార్టీకి అటువంటి పరాజయాలు సంభవించి ఉండేవేనా? మమత పాలన తీరుతెన్నులపై ఓటర్లలో అవధులు మీరిన అసంతృప్తి ఉన్నది, గూడుకట్టుకున్న ఆందోళనగా వారి మనోభావాలు ఉన్నాయి. ప్రజల అంతరంగాన్ని మమత అర్థం చేసుకోలేదా? గ్రహించారు కానీ, అది తనకు వ్యతిరేకంగా తుపాను సదృశంగా చెలరేగి ఉగ్రతాండవం చేయగలదని ఊహించలేకపోయారు. రాజకీయాలలో తప్పుడు అంచనాలు జారుడుమెట్లే సుమా! పెల్లుబికిన ప్రజాగ్రహం మమతకు వ్యతిరేకంగా కాకపోవచ్చు. నిజమే. అయితే, మమతను ఆమె పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌ను విడివిడిగా చూడడం సబబేనా? అధికార ప్రాభవంతో ఆ పార్టీ స్థానిక నాయకుల వ్యవహరణ వైనాలే మమతకు నష్టదాయకమయ్యాయి. పైగా పాలనా నాణ్యత ప్రశస్తంగా లేకపోవడాన్ని ప్రజలు ఎంతకాలం క్షమిస్తారు? మమత పరిపాలన కంటే అధ్వాన పాలన ఉన్న కొన్ని ఇతర రాష్ట్రాలలో ప్రజలు తమ ప్రభుత్వాలను ఇంతగా శిక్షించలేదు. బెంగాల్ కథ వేరు. మమతపై కానవచ్చిన జనాగ్రహాన్ని బీజేపీ, ఆ పార్టీ విధేయ మీడియా చక్కగా వినియోగించుకున్నాయి. ఆమె పాలనలోని గోరంత లొసుగులనూ కొండంతలు చేశాయి; తృణమూల్ కాంగ్రెస్‌పై రాజకీయ మెరుపుదాడులు చేశాయి. చెప్పవచ్చినదేమిటంటే ప్రతిపక్షమూ తన సొంత పాలనా చరిత్రపై నిజాయితీగా ఆత్మపరీక్ష చేసుకోవాలి. ఇది కేవలం పశ్చిమ బెంగాల్‌లో మాత్రమే కాదు, పంజాబ్, కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రతిపక్ష ప్రభుత్వాలు తమ పాలన ప్రజాశ్రేయస్సుకు దోహదం చేస్తుందో లేదో ఒక్కసారి నిష్పాక్షికంగా అవలోకన చేసుకోవాలి. జాతీయ స్థాయిలో బీజేపీ మహాశక్తితో తలపడేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించుకునే లోగానే ఈ ఆత్మశోధన జరిగితీరాలి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలకు సంబంధించిన ఒక బాధాకర, ఆందోళనకర సత్యాన్ని మనం అంగీకరించాలి. బెంగాల్ ఎన్నికల ఫలితం ప్రజాసంకల్పానికి ఒక సహజ ప్రతిబింబం కాదు. ఆ రాష్ట్రంలో బీజేపీ విజయం కేంద్ర ప్రభుత్వ, ఎన్నికల సంఘం విశేష ప్రమేయంతో ముందుగా నిర్ణయించిన ఫలితం అని నిష్కర్షగా చెప్పక తప్పదు. ఎందుకని? రాజ్యాంగ సంస్థ ఎన్నికల సంఘం తన విధ్యుక్త ధర్మ నిర్వహణలో తటస్థంగా వ్యవహరించలేదు. నిష్పాక్షికత కొరవడడంతో ఎన్నికల సమగ్రత కళంకితమయింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో వాటిల్లిన పరాజయాలతో బీజేపీ బెంగాల్‌లో ఒక అవ్యవస్థకులోనైంది. తృణమూల్ కాంగ్రెస్‌తో తలపడే పరిస్థితి బీజేపీకి లేకపోయింది. అయితే కేంద్ర ప్రభుత్వమూ, సానుకూల మీడియా బెంగాల్ బీజేపీకి అండగా నిలబడ్డాయి. మమత ప్రభుత్వానికి నిధుల కొరత ఏర్పడేలా కేంద్రం చేయవలసినవన్నీ చేసింది. గ్రామీణ ఉపాధి హామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన మొదలైన సంక్షేమ పథకాలను దాదాపుగా నిలిపివేసింది. మరింత స్పష్టంగా చెప్పాలంటే సంక్షేమ వ్యయాలకు మమత ప్రభుత్వం కటకటలాడిపోయేలా చేసింది. ఇక బీజేపీ విషపూరిత మతతత్వ ప్రచారాన్ని ముమ్మరం చేసినా ఎన్నికల సంఘం మౌనంగా ఉండిపోయింది.

ఈ మత విద్వేష ప్రచారం అసోంలో కంటే బెంగాల్‌లోనే తీవ్రంగా జరిగింది. మరీ ముఖ్యంగా ఎన్నికల సంఘం మరే రాష్ట్రంలోనూ చేపట్టని అసాధారణ చర్యలు కొన్నిటిని బెంగాల్‌లో అమలుపరిచింది. వాటిలో భాగంగా తాము ఓటు హక్కుకు పూర్తిగా అర్హులమని సమస్త ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన 27 లక్షల మంది ఓటర్ల పేర్లను ఓటర్ జాబితాల నుంచి తొలగించింది! ప్రతి స్వతంత్ర విచారణలోనూ ఈ తొలగింపులు ఎంతమాత్రం సక్రమమైనవి కావని నిర్ధారణ అయింది. అంతేకాదు, నిర్దిష్ట వర్గాల ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి పేర్లను తొలగించినట్టు స్పష్టమయింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అయిన మొత్తం ఓట్లలో 4.3 శాతంగా ఆ తొలగింపులు లెక్కలోకి వస్తాయి. తృణమూల్ కాంగ్రెస్‌పై బీజేపీ ఓట్ల ఆధిక్యత 4.6శాతం. ఈ వాస్తవం దృష్ట్యా ఒక ప్రశ్న అనివార్యంగా తలెత్తుతోంది: ఆ 27 లక్షల మంది పౌరులను ఓటు వేసేందుకు అనుమతించి ఉన్నట్టయితే ఎన్నికల ఫలితాన్ని ఆ నిర్ణయం ఏ విధంగా ప్రభావితం చేసి ఉండేది? ప్రతిపక్షం కలసికట్టుగా ఎదుర్కోవలసిన కఠోర ప్రశ్న అది.

# గోధుమ ధరల పతనం
## పిండి ధరలు మాత్రం పైపైకి

గోధమ ధరల పతనం రైతులను ఆందోళన కలిగిస్తోంది. మద్దతు ధరలు ఉన్నా, ఉత్పత్తి పెరిగిన కారణంగా ధరలు పడిపోతున్నాయి. దీంతో పలు రాష్ట్రాల్లో గోధులమలు పండించే రైతులు ఆందోళన చెందుతున్నారు. గోధుమల ధరలు ఎందుకు తగ్గుతున్నాయనే ప్రశ్నకు ఓ వ్యాపారి సమాధాన మిస్తూ ఉత్పత్తి పెరుగుతుందన్న అంచనాలు, సరుకు పెద్ద ఎత్తున రావడం, ప్రభుత్వం వద్ద 2.2 కోట్ల టన్నుల నిల్వలు ఉండడం కారణమని చెప్పారు. 'మండీలలో గోధుమ పిండిని తక్కువ ధరకు అమ్ముతున్నారు. అదే మాల్స్‌లో దాని ఖరీదు ఎక్కువగా ఉంటోంది. ఇది కఠోర వాస్తవం. రైతు నష్టపోతుంటే అది వినియోగదారుడికి ఆదాగా మారడం లేదు. మధ్యవర్తులు, బ్రాండెడ్ కంపెనీలు లాభపడుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రముఖ బ్రాండెడ్ సంస్థలు గోధుమ పిండి మార్కెట్‌ను తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నాయి. బ్రాండ్ విలువ, ప్యాకేజింగ్, పంపిణీ వ్యవస్థ వంటి అంశాలు ధరను ప్రభావితం చేస్తున్నాయి. అసంఘటిత రంగంలో పిండి మిల్లులు విద్యుత్ ఛార్జీలు, కార్మికులు, రవాణా వంటి స్థిర ఖర్చులను భరించాల్సి వస్తోంది. గోధుమల ధర పెరిగినప్పుడు ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కొన్ని చర్యలు తీసుకుంటుంది. నిల్వలపై పరిమితులు నిర్ణయిస్తుంది. ఎగుమతులపై ఆంక్షలు విధిస్తుంది. బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తుంది. ధర ఎంఎస్‌పీ కంటే తక్కువగా ఉన్నప్పుడు సేకరణను పెంచి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రయత్నిస్తుంది. అయితే ఈ మద్దతు అనేది రాష్ట్రాలన్నింటిలో ఒకేలా ఉండదు. ఫలితంగా అన్నదాతలు తమ పంటను తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ధరలు తగ్గినా వినియోగదారునికి కలిగే ప్రయోజనం స్వల్పమే. సేకరణ బలహీనంగా ఉన్నప్పుడు రైతులు అయిన  కాడికి తమ పంటను విక్రయించుకోవాల్సి వస్తోంది. అదే సమయంలో రొ÷-టటెల తయారీకి ఉపయోగించే గోధుమ పిండి కోసం వినియోగదారులు గరిష్ట ధరలు చెల్లిస్తూనే ఉన్నారు.

# కేరళకు చేరుకున్న కాంగ్రెస్ పరిశీలకులు
## ముఖ్యమంత్రి అభ్యర్థిపై తర్జనభర్జనలు

కేరళంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఫలితాలు వెలువడి మూడు రోజులు గడిచినప్పటికీ.. సిఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై స్పష్టత వెలువడలేదు. 140 మంది సభ్యులున్న కేరళం అసెంబ్లీలో యుడిఎఫ్ 102 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ 63 స్థానాలను గెలుచుకోగా,  దాని మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) 22 స్థానాల్లో విజయం సాధించింది. కేరళం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కేపీసీసీ) కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో తన మొదటి శాసనసభ పక్ష సమావేశాన్ని తిరువనంతపురంలో గురువారం నిర్వహిస్తున్నారు.  ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అభ్యర్థిపై చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.  వి.డి. సతీసన్, కె. సురేష్, దీప్‌దాస్ మున్షీ సహా పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులైన ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్‌లను కలిసేందుకు  తిరువనంతపురం లోని తాజ్ హోటల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపి కె.సురేష్ మీడియాతో మాట్లాడారు. ఈ చర్చలు కాంగ్రెస్ హైకమాండ్ పక్రియలో ఒక భాగమని అన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కాంగ్రెస్‌కు మెజారిటీ వచ్చినా, రాకపోయినా సిఎల్ పి నేతను ఎంపికే చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ పరిశీలకులను పంపుతుందని అన్నారు. ఇదే పక్రియ కేరళలోనూ చేపట్టనున్నారని అన్నారు. హైకమాండ్ ఇద్దరు అత్యంత సీనియర్ నాయకులను, వర్కింగ్ కమిటీ సభ్యులను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. గతంలో కేరళ బాధ్యతలు చేపట్టిన, రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉన్న సీనియర్ నేత ముకుల్ వాస్నిక్, ప్రస్తుతం ఏఐసీసీ కోశాధికారిగా ఉన్న అజయ్ మాకెన్లను పరిశీలకులుగా నియమించిందని అన్నారు. వారు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నేతలతో చర్చలు జరపనున్నారని అన్నారు. చర్చల అనంతరం హైకమాండ్‌కు ఒక నివేదికను పంపనున్నాని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగా, హైకమాండ్ సీనియర్ నాయకులతో చర్చించిన తర్వాత, ముఖ్యమంత్రి అభ్యర్థిపై తగిన నిర్ణయం తీసుకుంటారని అన్నారు.

## నిధులు లేని కార్పోరేషన్లకు చైర్మన్ల నియామకం
### బలోపేతం చేయకుండా నిర్వీర్యం చేయడం తగదు: వేముల

సీఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడంపై ఉన్న శ్రద్ధ నిధులు విడుదల చేయడంపై లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు, విధులు లేకుండా కార్పొరేషన్లను నిర్వీర్యం చేసిన ఘనత రేవంత్‌రెడ్డికే దకుతుందని విమర్శించారు. మాల, మాదిగ, సంతు సేవాలాల్, కుమ్రంభీం, ఏకలవ్య, మైనార్టీ కార్పొరేషన్లకు ఒక రూపాయి కేటాయించకుండా నిర్లక్ష్యం ప్రదర్శించడం, వారి పట్ల చూపుతున్న వివక్షకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముదిరాజ్, యాదవ, మున్నూరు కాపు, కుమ్మరి, విశ్వబ్రాహ్మణ, మేదర, వాల్మీకి, బోయ తదితర కార్పొరేషన్లకు కేటాయించిన నిధుల్లో ఒక రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు.కార్పొరేషన్లను రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి ఏం సాధిస్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సంక్షేమం కంటే అనుచరులను సంతృపిపరచడంపైనే ఎక్కువ దృష్టి పెట్టారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం 17 కార్పొరేషన్లకు చైర్‌పర్సన్లు ప్రకటించడం పట్ల తీవ్రంగా స్పందించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న 33 కార్పొరేషన్లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు మరికొందరికి కార్పొరేషన్ పదవులు ఇవ్వడం హాస్యాస్పదమని ఆక్షేపించారు. నిధులు విడుదల చేయకపోవడంతో, మొదటి దఫాలో నియమితులైన చైర్మన్లు ప్రజలకు ఒక రూపాయి కూడా సాయం చేయకుండా వారి పదవీకాలాన్ని ముగించారని గుర్తు చేశారు. 33 కార్పొరేషన్లకుగాను 21 కార్పొరేషన్లకు ఒక రూపాయి కూడా ఇవ్వకుండా వాటి అసలు ఉద్దేశాన్ని నీరుగార్చారని మండిపడ్డారు.  ఇదే విషయాన్ని అసెంబ్లీ లో నిలదీస్తే సరైన సమాధానం లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి చేతులు దులుపుకోవడం మానేసి, ఆయా కులాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# అలల కింద అదృశ్య యుద్ధం

ఇంటర్నెట్ ద్వారా మనం రోజూ చేసే ప్రతి ఆన్‌లైన్ చెల్లింపు, ప్రతి వీడియో కాల్, ప్రతి ఈమెయిల్... ఇవన్నీ ఎలా వీలవుతున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా? సమాధానం ఆకాశంలో లేదు. మన పాదాల కింద కూడా లేదు. సముద్రం అడుగున ఉంది. ప్రపంచ ఖండాలను కలిపే గాజు తంతుల అదృశ్య వలయం ఒకటి అక్కడ పనిచేస్తోంది. ఆ తంతులే నేడు యుద్ధం నేపథ్యంలో పెనుముప్పులో పడ్డాయి.ఆప్టికల్ ఫైబర్ కేబుళ్లు అనే గాజు తంతుల ద్వారా డేటా కాంతి వేగంతో ప్రయాణిస్తుంది. కానీ ఈ కేబుళ్లు సముద్రం అడుగున, కొన్ని చోట్ల ఎనిమిది వేల మీటర్ల లోతున, బహిరంగంగా పడి ఉన్నాయి. అదే వాటి బలమూ, అదే వాటి బలహీనత కూడా.ప్రపంచవ్యాప్తంగా ఆరు వందలకు పైగా ఇలాంటి సముద్రగర్భ కేబుల్ వ్యవస్థలు పద్నాలుగు లక్షల కిలోమీటర్ల మేర పరుచుకుని ఉన్నాయి. అంతర్జాతీయ ఇంటర్నెట్ ట్రాఫిక్‌లో తొంభై ఐదు శాతం వీటి గుండానే ప్రవహిస్తోంది. బ్యాంకింగ్ లావాదేవీలు, స్టాక్ మార్కెట్ ఆర్డర్లు, ప్రభుత్వ సందేశాలు, రక్షణ సమాచారం... అన్నీ ఈ తంతులపైనే ఆధారపడి ఉన్నాయి. ఉపగ్రహాల వాటా అయిదు శాతం కూడా దాటదు. లోతైన సముద్రంలో ఒక కేబుల్ తెగితే, దాన్ని వెతికి పట్టుకోవడానికే వారాలు పడుతుంది. మరమ్మతు చేసే ప్రత్యేక నౌకలు ప్రపంచంలో వేళ్లపై లెక్కపెట్టగలిగినన్ని మాత్రమే ఉన్నాయి. ఇంత పెళుసుదైన మౌలిక వ్యవస్థపై మన మొత్తం ఆర్థిక వ్యవస్థ నిలబడి ఉందని ఊహిస్తే గుండె ఝల్లుమంటుంది. ఇరాన్‌ను అరేబియా ద్వీపకల్పం నుంచి వేరు చేసే హోర్ముజ్ జలసంధి కేవలం ముప్పై మూడు కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉన్న ఓ ఇరుకైన నీటిమార్గం. ఒకప్పుడు చమురు రవాణాకు చోక్ పాయింట్‌గా ఉండేది. ఇప్పుడు అది డేటా చోక్ పాయింట్ కూడా అయింది. దక్షిణాసియా, ఆగ్నేయాసియా, మధ్యప్రాచ్యం, యూరప్, తూర్పు ఆఫ్రికాలను కలిపే అనేక సముద్రగర్భ కేబుళ్లు ఈ సందు గుండానో, దాని పక్క నుంచో వెళ్లక తప్పదు. ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ ఆంక్షలు, సైనిక ఒత్తిళ్ల నేపథ్యంలో ఆ జలసంధి కింద పడి ఉన్న కేబుళ్లు పెద్ద టార్గెట్‌గా మారాయి.2024 మొదట్లో ఎర్ర సముద్రంలో హౌతీ దళాలతో సంబంధం ఉన్న దాడులు అనేక సముద్రగర్భ కేబుళ్లను దెబ్బ తీశాయి. దక్షిణాసియా, తూర్పు ఆఫ్రికాలో గంటల తరబడి ఇంటర్నెట్ స్తంభించిపోయింది. ఆ తర్వాత నవంబర్‌లో బాల్టిక్ సముద్రంలో ఫిన్‌లాండ్, జర్మనీ, స్వీడన్, లిథువేనియాలను కలిపే రెండు కేబుళ్లు అనుమానాస్పదంగా తెగిపోయాయి. నాటో మిత్రదేశాలు దీన్ని ఉద్దేశపూర్వక చర్యగా, బహుశా రాజ్యం మద్దతుతో జరిగిన దాడిగా అభివర్ణించాయి.హోర్ముజ్ ఇప్పుడు చమురు దారి మాత్రమే కాదు. డేటా దారి కూడా. అది మూసుకుపోతే ఆ ప్రాంతానికి అతీతంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలే కుదేలవుతాయి. ఇది భారత్‌కు సుదూర సమస్య కాదు. మన దేశ అంతర్జాతీయ ఇంటర్నెట్ కనెక్టివిటీలో దాదాపు పూర్తి భాగం సముద్రగర్భ కేబుళ్లపైనే ఆధారపడి ఉంది. మూడున్నర ట్రిలియన్ డాలర్లకు పైబడిన ఆర్థిక వ్యవస్థ, నూట నలభై కోట్ల జనాభా ఉన్న దేశానికి చెన్నై, ముంబై, కొచ్చి, తూత్తుకుడి వంటి కొద్దిపాటి తీర నగరాల్లో మాత్రమే కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లు ఉన్నాయి. వేళ్లపై లెక్కపెట్టగలిగిన ఈ చిన్న సంఖ్య శత్రువులకు కూడా బాగా తెలిసిందే.యూరప్‌కు, మధ్యప్రాచ్యానికి, ఆఫ్రికాకు మన దేశం నుంచి వెళ్ళే అన్ని కేబుల్ మార్గాలూ అరేబియా సముద్రం గుండా, ఏడెన్ గల్ఫ్ గుండా.. హోర్ముజ్ జలసంధి సమీపం నుంచే వెళ్తాయి. అంటే అంతర్జాతీయంగా అత్యంత ఉద్రిక్త ప్రాంతాల పక్క నుంచే మన డిజిటల్ జీవనాడులు ప్రయాణిస్తున్నాయి. ఆ కారిడార్‌లో కాస్త ఆటంకం వచ్చినా చాలు, సామాన్యుడి వాట్సాప్ నుంచి స్టాక్ మార్కెట్ లావాదేవీల వరకు, ప్రభుత్వ డిజిటల్ సేవల నుంచి సైనిక సమాచారం వరకు అన్నీ ప్రభావితమవుతాయి. మనం అద్భుతమైన డిజిటల్ నిర్మాణాన్ని కట్టుకున్నాం. కానీ దాని పునాది మాత్రం వివాదాస్పద జలాల గుండా వెళ్లే ఫైబర్ ఆప్టిక్ కేబుళ్లపై ఉంది. అది ఎప్పుడూ లేనంత ప్రమాదంలో ఉంది. మరి, ఇప్పుడేం చేయాలి? 1) కేబుల్ ల్యాండింగ్ స్టేషన్లను విస్తరించాలి. ఇప్పుడు కొద్ది నగరాలకే పరిమితమై ఉన్న ఈ స్టేషన్లను తూర్పు, పశ్చిమ తీరాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లకూ తీసుకెళ్లాలి. ల్యాండింగ్ పాయింట్లు ఎక్కువగా, పంపిణీ విస్తృతంగా ఉంటే ఎక్కడో ఒకచోట అంతరాయం వచ్చినా, మొత్తం వ్యవస్థ స్తంభించదు. 2) హోర్ముజ్‌ను తప్పించుకుని వెళ్ళే ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేయాలి. మధ్య ఆసియా గుండా భూ మార్గాన ఫైబర్ లైన్లు, దక్షిణ హిందూ మహాసముద్రం గుండా ప్రత్యామ్నాయ లోతైన నీటి కేబుళ్లు... ఇలాంటి కొత్త దారులలో భారత్ చురుగ్గా పెట్టుబడి పెట్టాలి. ఒకే గుర్రంపై మన అదృష్టాన్ని పందెం కాయకూడదు. 3) తక్కువ ఎత్తులో తిరిగే ఉపగ్రహ నెట్‌వర్క్‌ల (రాజుూ) వ్యవస్థతో అవగాహన ఒప్పందాలు చేసుకోవాలి.ఈ ఉపగ్రహాలు సముద్రగర్భ కేబుళ్లకు పూర్తి ప్రత్యామ్నాయం కాలేవు, నిజమే.

కానీ అత్యవసర సమయంలో ప్రభుత్వ సేవలు, రక్షణ సమాచారం, ఆర్థిక లావాదేవీలు ఆగిపోకుండా చూడటానికి అవి కీలకమైన బ్యాకప్‌గా పనిచేస్తాయి. ఈ సన్నద్ధత ముందుగానే చేసుకోవాలి, సంక్షోభం వచ్చిన తర్వాత కాదు. 4) సముద్రగర్భ కేబుళ్లను దేశ కీలక మౌలిక వసతులుగా అధికారికంగా గుర్తించాలి. భారత్ ప్రత్యేక ఆర్థిక మండలంలో (జుజ్జ) నౌకాదళం, తీరరక్షక దళం నిరంతరం గస్తీ తిరగాలి. కేబుల్ మార్గాల పక్కన అనుమానాస్పదంగా తిరిగే నౌకలపై నిఘా ఉంచాలి.

5) ౧=ూ×, టెలికాం శాఖ, నౌకాదళం, నిఘా సంస్థల సమాచారం ఒక్క చోటకు చేరే ఒక జాతీయ సముద్రగర్భ కేబుల్ భద్రతా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇప్పుడు ఈ బాధ్యత ఎవరిదో ఎవరికీ తెలియదు. పర్యవేక్షణ లేకుండా రక్షణ ఎలా సాధ్యం? 6) క్వాడ్, జీ20 వేదికల ద్వారా అంతర్జాతీయంగా దౌత్యపరంగా పనిచేయాలి. సముద్రగర్భ కేబుళ్ల రక్షణ కోసం ఒప్పందాలు,

ప్రోటోకాళ్లను రూపొందించడంలో భారత్ ముందుండాలి.డిజిటల్ శక్తిగా ఎదగాలనుకునే భారతదేశం ఈ కొద్దిపాటి కేబుళ్ల మీద తన మొత్తం భవిష్యత్తును మోపి నిశ్చింతగా ఉండరాదు. వేరే మార్గాలు, ఉపగ్రహ ప్రత్యామ్నాయాలు, నిఘా వ్యవస్థలు, దౌత్యపరమైన ఒప్పందాలు... అవసరం. ఇవన్నీ ఖరీదైనవే. కానీ మూడున్నర ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిమిషాల్లో స్తంభింపజేయగల ఒక డిజిటల్ బ్లాక్‌ఔట్ ఖర్చు ముందు ఇవి చాలా చిన్న ఖర్చే.

# ముస్లిం జైలర్, హిందూ ఖైదీ...
## ఓ జైలు ప్రేమ కథ!

మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో ఓ అసాధారణ ప్రేమకథ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. సత్నా సెంట్రల్ జైలులో అసిస్టెంట్ జైలర్‌గా పనిచేస్తున్న ఓ ముస్లిం మహిళ, గతంలో ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవించిన హిందూ వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.వివరాల్లోకి వెళితే.. రేవాకు చెందిన ఫిరోజా, సత్నా సెంట్రల్ జైలులో అసిస్టెంట్ జైలర్‌గా పనిచేస్తున్నారు. వారెంట్ సంబంధిత విధుల్లో ఆమె ఉండేవారు. అదే జైలులో ధర్మేంద్ర సింగ్ చాండ్లా అనే వ్యక్తి ఓ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవించాడు. జైలులో మంచి ప్రవర్తనతో ఉంటూ, అధికారులకు పరిపాలనా పనుల్లో సహాయం చేసేవాడు. ఈ క్రమంలో ఫిరోజా, ధర్మేంద్ర మధ్య పరిచయం ఏర్పడి, అది స్నేహంగా మారి చివరికి ప్రేమకు దారితీసింది.ఈ వివాహానికి ఫిరోజా కుటుంబం తీవ్రంగా వ్యతిరేకించింది. అయినప్పటికీ, మే 5న లవకుశ్‌నగర్‌లో వారి వివాహం జరిగింది. పెళ్లికి ఫిరోజా కుటుంబ సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. వారి స్థానంలో బజరంగ్‌దళ్, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు ముందుకు వచ్చి కన్యాదానం చేయడం విశేషం. వేద మంత్రాల నడుమ, ఏడడుగులతో హిందూ సంప్రదాయాల ప్రకారం ఈవివాహంజరిగింది.

వరుడు ధర్మేంద్ర సింగ్ 2007లో చాండ్లా నగర్ పరిషత్ ఉపాధ్యక్షుడు కృష్ణ దత్ దీక్షిత్ హత్య కేసులో దోషిగా తేలి, జీవిత ఖైదు శిక్ష అనుభవించాడు. సుమారు 14 ఏళ్ల జైలు జీవితం తర్వాత, మంచి ప్రవర్తన కారణంగా నాలుగేళ్ల క్రితం విడుదలయ్యాడు. అప్పటి నుంచి బయట జీవితాన్ని గడుపుతున్నాడు.  ఒక జైలు అధికారిణి, మాజీ ఖైదీని పెళ్లి చేసుకోవడం, అందులోనూ మతాంతర వివాహం కావడంతో ఈ జంట కథ స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కొందరు దీనిని ప్రేమకు హద్దులు లేవనడానికి నిదర్శనంగా చూస్తున్నారు.



printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com